నవల



# యురేనియం పల్లె

## డా॥ వేంపల్లి గంగాధర్

రాయలసీమ ప్రాంతంలోని కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం వేముల మండలంలోని తుమ్మలపల్లెలో నిర్మించిన 'యురేనియం ప్రాజెక్టు' ప్రధాన ఇతివృత్తంగా ప్రజాభూమికను అక్షరీకరించిన నవల



# యురేనియం పల్లె

(నవల)

డా॥ వేంపల్లి గంగాధర్

గాయత్రి ప్రచురణలు

2019

# యురేనియం పల్లె

డా॥ వేంపల్లి గంగాధర్

**Urenium Palle**
by **Dr. Vempalli Gangadhar**
gangadhar.vempalli@gmail.com
mobile : 9440074893

Copyright © by writer

Daily Serial in Vishalandhra Daily
from 16 April 2017 to 09 May 2017

| | | |
|---|---|---|
| Published | : | July 2019 |
| For Copies | : | Jutur Thulisadas<br>Balala Abhyudaya Vedika<br>1-3-482, Opp. S.V.S.R. Appartment,<br>4th Road, Rangaswamy Nagar,<br>Anantapuram Dist. Cell : 9848859954 |
| D.T.P. | : | B. Sivaram<br>Sivaram Graphics: 9959214299 |
| Cover Design | : | Gangavaram Konda Reddy |
| Copies available | : | Vishalandhra, Navachentana and<br>Navodaya Hyderabad, Pallavi at Vijayawada. |
| Printed at | : | Charitha Impressions, Hyderabad-20.<br>Phone : 040-27678411 |
| Price | : | ₹ 100.00 |

ఒక తుమ్మలపల్లె
ఒక కూడంకుళం
ఒక కొవ్వాడ
ప్రాంతం ఏదైనా కావచ్చు
నెత్తుటి పిడికిలి ఎత్తినతడు
అక్కడొక అణురియాక్టర్!

‘యురేనియం పల్లె’ నవల విశాలాంధ్ర దినపత్రికలో డైలీ సీరియల్‌గా 16 ఏప్రిల్ 2017 నుంచి 09 మే 2017 వరకు ప్రచురితమైంది.

రాయలసీమ ప్రాంతంలోని కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం వేముల మండలంలోని తుమ్మలపల్లెలో నిర్మించిన ‘యురేనియం ప్రాజెక్టు’ ప్రధాన ఇతివృత్తంగా ప్రజాభూమికను అక్షరీకరించిన నవల.

**డా॥ వేంపల్లి గంగాధర్** : 'రాష్ట్రపతి భవన్'లో విశిష్ట ఆతిథ్యం అందుకున్న తొలి భారతీయ సాహితీవేత్తగా వీరు గుర్తింపు పొందారు. 2014, సెప్టెంబర్ 8వ తేదీ నుంచి 26 వరకు వీరు రాష్ట్రపతి భవన్‌లో విడిది చేశారు. రాయలసీమ ప్రాంతానికి సంబంధించిన పలు అంశాలపై పుస్తకాలు రాశారు. వీరి కథా సంకలనం 'మొలకల పున్నమి'కి కేంద్ర సాహిత్య అకాడమి మొదటి యువపురస్కారం - 2011 లభించింది. ప్రసిద్ధ సాహితీవేత్త సునీల్ గంగోపాధ్యాయ చేతుల మీదుగా తామ్రపత్రం అందుకున్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి 'రాయలసీమ కథా సాహిత్యం' పై పిహెచ్‌డి, 'రాయలసీమ ఫ్యాక్షనిజం' పై ఎంఫిల్ పూర్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం వారి 'రైటర్స్ ట్రావెల్ గ్రాంట్' ద్వారా 'శాంతినికేతన్'లో పర్యటించారు. మొలకల పున్నమి, దేవరశిల, గ్రీష్మభూమి, తొలితెలుగు శాసనం, పూణే ప్రయాణం, కథనం, హిరణ్యరాజ్యం, నేలదిగినవాన, నేను చూసిన శాంతినికేతన్, పాపాఘ్ని కథలు, రావణవాహణం కథలు, కడప వైభవం (సంపాదకత్వం), అనంతపురం చరిత్ర (సంపాదకత్వం), ఎర్రచందనం దారిలో తమిళ కూలీలు, యురేనియంపల్లె నవల పుస్తకాలు రాశారు. సీమ గిరిజన తండాల నుంచి పడుపు వృత్తిలోకి తరలిపోతున్న మహిళల జీవన ఆక్రందనను 'పూణే ప్రయాణం' రచనలో చిత్రణ చేశారు. ఇదే ఇతివృత్తంతో రాసిన 'మైనం బొమ్మలు' కథకు అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) పురస్కారం దక్కింది. న్యూఢిల్లీ కథా ఫౌండేషన్‌వారి నుంచి 'శిలబండి' కథకు జాతీయ కథాపురస్కారం, 'నేలదిగిన వాన' నవలకు అంపశయ్య నవీన్ సాహితీ పురస్కారం, 'దేవరశిల'కు రావూరి భరద్వాజ స్మారక సాహితీ పురస్కారం అందుకున్నారు. వీరి కథలు పలు భారతీయ భాషలలోకి అనువాదమయ్యాయి.

Date: 14-11-2012

To
The Director,
Uranium Corporation of India Ltd,
Head office,
Jaduguda Mains,
East Singhbhum (Dist)
Jarkhand – 832102.

Sir,

**RTI ACT-2005**

**The Right to information Act; Provisions of Section 4(1) (b) of this Act.**

**The under signed here by require the following particulars of information.**

**Kindly arrange to furnish the Tummalapalle Uranium Project, Kadapa District, Andhra Pradesh pertaining as detailed below:**

1. **Can you assure that no untoward or disastrous consequence of the plant takes place during the processing of the unit in and around the plant area?**
2. **What Anticipatory or preventive measures do you undertake to protect the area around the Plant especially regarding any possible human Loss?**
3. **What Preventive Measures do you take to protect the ground water of the area from being polluted to protect the people from any health-related problems?**

**A Postal Order No** 94E 856815 **dated** 06/11/2012 **is enclosed**

**Thanking you,**

**Yours Sincerely.**

Vempalli Gangadhar

**Dr.Vempalli Gangadhar,**
**4/432-A,**
**Vivekananda Nagar,**
**Kadapa-516001, A.P**
**Cell.No: 09440074893**
**Mail: gangadhar.vempalli@gmail.com**
**Web: www.vempalligangadhar.com**

यूरेनियम कॉरपोरेशन ऑफ इंडिया लि.
(भारत सरकार का संस्थान)

**URANIUM CORPORATION OF INDIA LTD**
(A Govt. of India Enterprise)

An ISO 9001 : 2008, ISO 14001 : 2004, IS 18001 : 2007 Company

**Registered Post/AD**

Ref: UCIL/CS/58/2012

December 19, 2012

Dr. Vempalli Gangadhar,
4/432-A, Vivekananda Nagar,
Kadapa Dist,
Andhra Pradesh,
**PIN- 516 001**

Sub: Information sought for under Right to Information Act [RTI], 2005.

Dear Sir,

Please refer to your application dated 14-11-2012 received by us on 22-11-2012 seeking information under the Right to Information Act, 2005.

In this connection, we would like to furnish the requested information as under :

01. All safety provisions and inter locks as approved by Atomic Energy Regulatory Board [AERB] and Ministry of Environment & Forest [MOEF] have been put into place in the Tummalapalle Uranium Project as a safeguard against untoward and disastrous consequences in and around the plant.

02. There is remote possibility of human loss in the vicinity of the plant due to UCIL operations.

03. The Process Plant floor in contact with liquor is of R.C.C. construction with facility of containment and recycle. This prevents ground water pollution.

Thanking you,

Yours truly,
For Uranium Corporation of India Limited

( B.C. Gupta )
Company Secretary/
Public Information Officer

जादुगोड़ा माइन्स, सिंहभूम (पूर्व), झारखण्ड – 832102 **JADUGUDA MINES, Singhbhum (East), Jharkhand - 832102**

Phone : 0657-2730122 / 2730222 / 2730353, Fax : 0657-2730322 / 2730353



● తుమ్మలపల్లె యురేనియం ప్రాజెక్టు వున్న కొండ ప్రాంతం

## యురేనియం పల్లె
## నవలా నేపథ్యం

# నల్లరాతి గుట్టల దారిలో....

*చరిత్ర భౌగోళిక పరిస్థితుల గర్భం నుండి జనిస్తుంది. ప్రకృతి చరిత్రను పెంచి పోషిస్తుంది. ఎప్పటికప్పుడు చరిత్రను అదుపులో పెడుతుంటుంది. ప్రకృతి వద్ద మూడు ఆయుధాలు ఉన్నాయి. అవి కరవులు, అంటురోగాలు, యుద్ధాలు.*

ఎందుకోసం ఈ నవల రాయాలి? అని నన్ను నేను ప్రశ్నించుకున్న తర్వాత నవల రాయడం మొదలు పెట్టాను. మూలాల్లోకి ప్రయాణం ప్రారంభించాను. వేర్లలోతుల్లోని జన్య రూపం చూపిస్తాను. నల్లరాతి గుట్టల దారిలో నాతోపాటూ కదలండి...

'భారత దేశంలో అణువిద్యుత్ సవాళ్ళు – అణుఇంధనం' అనే అంశంపై గతంలో హైద్రాబాదులో ఈఎస్‌సీఐ (ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా) వేదికగా జరిగిన సదస్సును ప్రారంభించడానికి విచ్చేసిన బాబా అణుపరిశోధన కేంద్రం (బార్క్) డైరెక్టర్ డాక్టర్ శేఖర్ బసు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న యురేనియం నిల్వల వెలికితీతపై సుదీర్ఘమైన వివరణ ఇచ్చారు. కానీ ప్రజల కోణం నుంచి వారికి అవగాహన కల్గించడం కోసం ఏం చేయబోతున్నారో చెప్పకపోవడం విస్మయం కల్గిస్తోంది. కడప జిల్లాలోని పులివెందులకు సమీపంలో ఉన్న తుమ్మలపల్లి ప్రాంతం ప్రపంచంలోనే అత్యధిక యురేనియం నిల్వలున్న ఇరవై గనుల్లో ఒకటని చెప్పడం బాగానే ఉంది. అలాగే అక్కడ లక్షటన్నుల యురేనియం లభించవచ్చని, దాని నాణ్యత 0.3 నుంచి 0.4 శాతంగా ఉంటోందని వెల్లడించారు. నిజానికి అక్కడ రెండవ యురేనియం మైనింగ్ కోసం అధికారులు చర్యలు చేపట్టే క్రమంలో కాలుష్య

నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టినప్పుడు యురేనియం ప్రాజక్టు చుట్టు ప్రక్క ఉన్న భూమయ్యగారిపల్లె, రాచకుంటపల్లె, మబ్బుచింతలపల్లె, తుమ్మలపల్లె గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. రేడియేషన్, అణుధార్మికతపై ప్రజా సంఘాలు అడిగిన చాలా ప్రశ్నలకు సమాధానాలే యూసీఐఎల్ (భారత యురేనియం సంస్థ) చెప్పలేక పోయింది.

యురేనియం తవ్వకాలవల్ల ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటి పోయి వ్యవసాయబోర్లు ఎండిపోయాయని, మొదటి ప్రాజెక్టుతోనే చాలా నష్టపోయామని, రెండవ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తే తాగేందుకు నీళ్ళు కూడా ఉండవని అప్పటి కడప ఎంపీ వై.ఎస్. జగన్మోహన్ రెడ్డికి స్థానిక ప్రజలు తమగోడు వెల్లబోసుకున్నారు. యురేనియం తవ్వకాల్లో భూములు కోల్పోయిన బాధితులకు న్యాయం చేయడంతో పాటూ భూగర్భ జలాల పెంపుకు చర్యలు తీసుకోవాలని తుమ్మలపల్లికి వచ్చిన అణుశక్తి సంఘ చైర్మన్ శ్రీకుమార్ బెనర్జీని వ్యక్తిగతంగా కలిసి సమస్యలను వారి దృష్టికి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి తీసుకెళ్ళారు. పరిష్కారానికి కృషి చేశారు.

భారత దేశంలో మొట్టమొదటి సారిగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో యరేనియంను ఉత్పత్తి చేపట్టాలనే సంకల్పంతో తుమ్మలపల్లిలో ప్రాజెక్టును ప్రారంభించారు. ఇక్కడ 30 నుండి 50 ఏళ్ళ పాటు తవ్వకాలకు సరిపడ ముడి యురేనియం నిల్వలున్నట్లు గుర్తించారు. ఏడాదికి 250 టన్నుల యురేనియం ఉత్పత్తి చేయాలనేది లక్ష్యం. యూపీఐఎల్ ఇందుకోసం మూడవేల టన్ను ఉత్పత్తి చేయాలనేది లక్ష్యం. యూపీఐఎల్ ఇందుకోసం 1106.4 కోట్లు తవ్వకాలు చేయడానికే ఖర్చు చేస్తోంది. మూడువేల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న ప్రాజెక్టును 4,500 టన్నులకు పెంచేందుకు వీలుగా రెండో మైనింగ్‌కు సిద్ధడింది. ఇప్పటికే భూములు కోల్పోయి, ఉద్యోగాలు, పరిహారం రాని బాధితులు ప్రజాభిప్రాయ సేకరణను కూడా అడ్డుకున్నారు. యురేనియం తవ్వకాలకు ముందు బోరుబావుల్లో ఎనభై అడుగుల్లో నీరు ఉండేదని, తవ్వకాల తర్వాత ఆరువందల అడుగుల లోతుకు బోర్లు వేసినా నీళ్ళు పడడం లేదని, తవ్వకాలు ప్రారంభమైనప్పటి నుంచి నూట ముప్పై బోర్లు ఎండిపోయాయని స్థానికులు గగ్గోలు పెడ్తున్నారు. కానీ దీన్ని యురేనియం సంస్థ ఒప్పుకోదు. తాము కేవలం చిత్రావతి నది ద్వారా మాత్రమే నీళ్ళు తీసుకుంటున్నామని చెప్తోంది.

'టన్ను ముడి యురేనియాన్ని శుద్ధి చేస్తే 2.94 గ్రాముల యురేనియం మాత్రమే బయటికి వస్తుంది. రోజుకు 20 నుంచి 30 టన్నుల వరకు ముడి యురేనియాన్ని వెలికి తీయడానికి సంస్థ ప్రయత్నిస్తోంది. దీన్ని శుద్ధి చేయడం వల్ల దాదాపు 3 కోట్ల టన్నుల వ్యర్థ పదార్థం టెయిల్ పాండ్‌లో నిల్వ ఉంచాల్సి ఉంటుంది. దీనివల్ల రేడియేషన్, అణుధార్మికత వ్యాపిస్తాయని' ప్రాజెక్టు ప్రాంతంలో నిరసనలు చేసిన మానవ హక్కుల కమిటీ కన్వీనర్ జయశ్రీ అభిప్రాయపడ్డారు.

ప్రతిచోటా గాలిలో సహజరేడియో ధార్మికత అనేది ఉంటుంది. యురేనియం తవ్వకాల వల్ల ఆ రేడియో ధార్మికత శాతం ఎంత మేరకు ఉంటుందనేది ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని అణుశక్తి సంఘం జవాబిస్తోంది. తుమ్మలపల్లిలో భూగర్భంలోకి వెళ్ళి యురేనియంను బయటికి తీసి శుద్ధి చేస్తున్నారు. దీనికి అనుబంధంగా న్యూక్లియర్ ఇంధన కేంద్రం ఏర్పాటు చేయడానికి వెయ్యి నుంచి పద్నాలుగు వందల ఎకరాల స్థలం అవసరం ఉంది. కడప – అనంతపురం సరిహద్దుల్లోని నంబులిపూటకుంట ప్రాంతంలో ఫ్లుయల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు ప్రయత్నించారు. సమీపంలోనే ఉన్న పాపాఘ్నినది, దానిపై వెలిగల్లు జలాశయం ఉండడంతో ఈ ప్రాంతంపై ఆసక్తి చూపింది సంస్థ. కానీ ఆ ప్రాంతంలో స్థానికుల, పర్యావరణ వేత్తల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో కడప నగర శివారులోని కొప్పర్తి పారిశ్రామిక వాడ భూములవైపు దృష్టి సారించారు. చింతకొమ్మదిన్నె మండలంలోని కొప్పర్తి, ఎర్రమాచుపల్లె, కృష్ణాపురం, తాటిగొట్ల ప్రాంతాల్లోని స్థానికులు, ప్రజా సంఘాల వారు నిరసన తెలిపారు. యురేనియం ప్రభావం పది కిలోమీటర్ల నుంచి 150 కిలోమీటర్ల వరకు ఉంటుందని వారు ఆందోళన వ్యక్తపరిచారు.

భారతదేశంలో 2050 నాటికి యురేనియం విద్యుదుత్పత్తి ఇరవై శాతానికి పెంచాలది యూసీఐఎల్ లక్ష్యం. ఫ్రాన్స్‌లో యురేనియం ద్వారానే ఎనభైశాతం విద్యుత్ తయారవుతున్న విషయాన్ని ఉదాహరణగా చూపిస్తుంది. మనదేశంలో కేవలం మూడు శాతం మాత్రమే యురేనియం ద్వారా విద్యుత్ వస్తోందని సంస్థ చెప్తోంది.

తుమ్మలపల్లిలో యురేనియం ప్రాజెక్టు కోసం సంస్థ ఇప్పటి వరకు రూ. 2000 కోట్లు ఖర్చు చేసింది. 2007 నవంబరు 20వ తేదీ నుంచి యురేనియం ప్రాజెక్టు ప్రారంభమైంది. అప్పటి నుంచి భూగర్భ మైనింగు ద్వారా రోజుకు 1,500 టన్నుల నుంచి రెండు వేల టన్నుల వరకు ముడి యురేనియం వెలికి తీసి నిల్వ చేశారు. ముడి యురేనియాన్ని శుద్ధి చేసిన తర్వాత వచ్చే వ్యర్థపదార్థాన్ని నింపేందుకు అవసరమయ్యే టెయిల్ పాండ్ నిర్మాణ పనులు ఆలస్యంగా జరిగాయి. 2012 ఏప్రిల్ 20వ తేదీన భారత అణుశక్తి సంఘం అధ్యక్షుడు, అణు విభాగం కార్యదర్శి శ్రీ కుమార్ బెనర్జీ ఉత్పత్తి కర్మాగారాన్ని ప్రారంభించారు.

చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్) నుంచి ప్రాజెక్టుకు నీటి శుద్ధి కోసం ప్రత్యేక పైపులైను అరవై రెండు కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి యాభై కిలోమీటర్ల దూరం నుంచి పైపులైను వేశారు. ప్రాజెక్టులో ఉత్పత్తికి పదినెలల కాలం పట్టింది. ముడి పదార్థాన్ని శుద్ధి చేయడంతో తలెత్తిన అవాంతరాల్ని అధిగమించడానికి నాల్గు నెలల పాటూ ట్రయిల్‌రన్ చేయాల్సి వచ్చింది. ముడిపదార్థాన్ని శుద్ధి చేసి విజయవంతంగా జనవరి 16, 2013 నుంచి ప్రాజెక్టులో యురేనియం ఉత్పత్తిని అధికారికంగా మొదలు చేశారు. యురేనియం పరిశ్రమలో పనిచేసే 422 మంది కార్మికులు తమకు ప్లాంట్ లోపల శుద్ధి జలం ఇవ్వడం లేదని, విద్యార్థులకు ఫీజులు చెల్లించడం లేదని 2013 మార్చిలో సమ్మెకు దిగారు.

భూగర్భ మైనింగులోకి వెళ్ళేందుకు బూట్లు ఇవ్వడం లేదని కూడా కార్మికులు ఆవేదన చెందారు. రెండవ ప్లాంట్ నిర్మాణం కోసం ప్రభుత్వం మూడు సార్లు ప్రజాభిప్రాయ సేకరణకు సిద్ధపడినా అది సాధ్యం కాలేదు. ఫలితంగా యురేనియం తవ్వకాల వలన తాగునీరు కలుషితం కావడం లేదంటూ హైద్రాబాదు జెఎన్‌టీయూ ప్రొఫెసర్ల బృందం చేత నివేదిక ఇప్పించింది. మైనింగ్ 90 డిగ్రీల కోణంలో సుమారు రెండు కి.మీ. లోతుకు తవ్వకాలు చేసుకుంటూ వెళ్తూ చుట్టు ప్రక్కల ఇరవై కిలోమీటర్ల మేర సొరంగ మార్గం ద్వారా ముడి పదార్థాన్ని బయటికి తీసుకొస్తున్నారు. ముడి పదార్థానికి రసాయనాలు కలుపుతూ శుద్ధి చేయడం, నాణ్యతను పరీక్షించడం వంటి విధానాలతో యురేనియాన్ని ఉత్పత్తి చేస్తున్నారు.

నిజానికి 1967 ప్రాంతంలోనే రాయలసీమ ప్రాంతంలో విస్తారంగా ఉన్న యురేనియం నిల్వలను భారత ప్రభుత్వం గుర్తించింది. 2218 ఎకరాల్లో తుమ్మలపల్లిలో ప్రారంభమైన 'యురేనియం ప్రాజెక్టు' కోసం 2006 సెప్టెంబరు

10వ తేదీన ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు చోటు చేసుకున్నాయి. కానీ 2006 నవంబరు 20వ తేదీన యూసీఐఎల్ అధికారులు నాటి ముఖ్యమంత్రితో పనులు ప్రారంభించేశారు. స్థల సేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు యాభైవేల చొప్పున 1090 ఎకరాల్ని సంస్థకు అప్పగించింది. తక్కిన పట్టా భూముల్లో 467 ఎకరాలకు సంబంధించి పరిహారం చెల్లించారు. సాగుభూమికి రూ. 1.8 లక్షలు, మెట్ట భూమికి రూ. 1.2 లక్షలకు అందించారు. వాస్తవానికి యురేనియం ప్రాజెక్టు ఆది నుంచి కూడా అడ్డంకుల్ని అవరోధాల్ని ఎదుర్కొంటూనే ఉంది. 2013 అక్టోబరు 29 నాడు కార్మికుల ఆందోళనతో మైనింగ్, శుద్ధి కర్మాగారంలో పనులు ఆగిపోయాయి. 2014 డిసెంబరు 22 నాడు అకౌంటెంట్‌ను జార్ఖండ్‌కు బదిలీ చేయడాన్ని ఆపాలని కార్మికులు ఆందోళనకు దిగారు. అంతుకు మునుపు యురేనియం భూగర్భగనిలో ప్రమాదం జరగడంతో కార్మికుడిపైన బండరాళ్ళు పడడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి.

యురేనియం తవ్వకాల వలన భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని, భూములు కోల్పోయిన కొంతమందికి ఉద్యోగాలు ఇవ్వాని ఇప్పటికీ నిర్వాసితులు నిరసనలు వ్యక్తం చేస్తూనే ఉన్నారు. గని విస్తరణకు జరగాల్సిన ప్రజాభిప్రాయ సేకరణ ఆగిపోయింది. యురేనియం ప్లాంట్ లోపల ఏం జరిగేది బయటికి ఏదీ పొక్కదు. అసలు యురేనియం ఉత్పత్తి జరుగుతోందా? ఎన్ని టన్నులు వెలికితీశారు? వంటి వాటిని యూసీఐఎల్ బయటపెట్టదు. యురేనియం తవ్వకాల వల్ల నష్టం లేదని ప్రజల్లో అపోహల్ని తొలగించడానికి ఎందుకు ప్రయత్నించదో అర్థం కాదు. ఇప్పటికైనా ఆదిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉంది. 2030 నాటికి దేశంలో 60 వేల మెగావాట్ల అణు విద్యుత్ ఉత్పత్తికి ముందు మారుమూల గ్రామీణ ప్రాంతంలో చిరుదీపం వెలిగించడం, వారి ముఖాల్లో కాంతి పూలు పూయించడం ముఖ్యం.

'మరణానికీ – మనిషి మేధస్సుకి మధ్య జరిగే సంగ్రామంలో గెలుపు ఎవరిది?

ఎప్పుడైనా, ఎక్కడైనా ఒక నాగరికత ఎందుకు పతనం అవుతుంది?

*- డాక్టర్ వేంపల్లి గంగాధర్*

*06 ఏప్రిల్ 2017*



● *తుమ్మలపల్లె యురేనియం ప్రాజెక్టులో కొంత భాగం*

# ఇక్కడ్నుంచి మొదలు...

ఎర్రదుమ్ము గాలి రేగింది.

దిగదాల మోరీ కింద వుండే తుమ్మచెట్ల వనం కాన్నుంచి రివ్వున ఎగుర్తా గంగమ్మ గుడి మోట్లోని ఎర్రమట్టి నేలను విసురుగా తాకిన 'సుడిగాలి'పైకి ఎగిరింది. అన్నుంచి దుమ్ములేపుకుంటా ఎగువకు రాతిమిట్టచెరువు దిక్కు దూసుకపోతాంది. చూస్తాంటే కొండను మింగిన దెయ్యంలా ఎగిరెగిరి పైపైకి పోతానే వుంది.

గుడిసెల దగ్గర కంపచెట్ల కింద కాళ్ళు బారా జాపుకొని పడుకొని జోగుతాండే రెండుకుక్కలు గబుక్కున పైకిలేచి దుమ్ము విదిలించుకొని, చెవులు రిక్కించుకొని సుడిగాలి పోతాండే వైపుకి చూస్తామొరగడం మొదలెట్టాయి.

దూరంగా శబ్దం.

నల్లరాతి గుట్టల పైనుంచి రాకాసిశబ్దం చేస్కుంటా ఏదో ఆకాశంలోంచి వస్తాండే శబ్దం. లోగా ఇండ్లల్లో ఆడుకునే పిల్లోళ్ళకు శబ్దం వినపడింది. ఎట్లుండేటోళ్ళు అట్లనే బయటికొచ్చి ఆకాశంలోకి ఎగబడి చూస్తా వుండారు.

అవును... నిజమే... దూరంగా ఆకాశంలో... ఇనుపరెక్కల హెలికాప్టర్ నల్లరాతి గుట్టల వైపుకి దూసుకొస్తోంది.

పిల్లలు కేరింతలు వేస్తావుండారు.

చేసే పనుల్ని మధ్యలోనే వదిలేసి ఆడోళ్ళు, మొగోళ్ళు కూడా ఇండ్ల లోపల్నుంచి బయటికి వచ్చేసినారు. ఆకాశానికి ఎగమల్లుకొని చూస్తావుండారు. హెలికాప్టర్ నల్లరాతి గుట్టల చుట్టూ ఒకసారి తిరిగింది. కుక్కలు ఆగి ఆగి మొరుగుతానే వుండాయి.

కానుగ చెట్టుకు అవతల ఇంట్లో వుండే కుళ్ళాయప్ప మామ బయటి కొచ్చినాడు. ఆకాశంలో చక్కర్లు కొడతాండే హెలికాప్టర్‌ను చూసి నవ్వినాడు.

'బ్బీ! ఏందిది? మన పల్లె దిక్కు హెలికాప్టర్ రావడం ఏంది? ఎవరన్నా సినిమావాళ్లు షూటింగ్ పెట్టుకుంటా వుండారా? ఏంది?' ఆనందం కొంత, సందేహం కొంత కలిపిన ముఖంతో వచ్చి రావిచెట్టు అరుగు మీద సంజీవుడి పక్కనే కూర్చున్నాడు.

'ఔ! మామ... నువ్వు జెప్పినట్లు సినిమావాళ్ళ షూటింగ్ జరుగుతాండేటట్లే వుండాది. పవన్ కల్యాణో, ప్రభాసో వచ్చినట్లుండారు గానీ, మనం గూడా గుట్ట ఎక్కితే అట్నే చూస్కుంటా వుండొచ్చు' సిగరెట్ ముట్టించినాడు సంజీవుడు.

హెలికాప్టర్ రెండవ రౌండు తిరిగింది నల్లరాతిగుట్టల చుట్టూ.

అంత కింద, అంత దగ్గర్నుంచి హెలికాప్టర్‌ను వాళ్ళెప్పుడూ చూసిందే లేదు. దాని రెక్కలన్నుంచి వస్తున్న శబ్దం చెవుల్లో గింగిర్లు కొడ్తావుంది... హోరుమని!

పిల్లలు కేకలు వేస్తూ ఎగుర్తున్నారు.

ఆ పక్క ఇండ్లలో వుండే శ్రీరాములు, రామ్మూర్తి, మద్దిలేటి, వెంకటేశు, చిన్న పెద్దన్న... కూడా ఒక్కొక్కరుగా రావిచెట్టు అరుగు దగ్గరికి చేరుకుంటా వుండారు ఆకాశంలోకి చూస్తా!

'ఏందిరో... మన కొండల దిక్కు హెలికాప్టర్ తిరుగుతాంది. మనల్ని గూడా ఎక్కించుకొని రెండు రౌండ్లు తిప్పుతాదా!' నవ్వుతా అన్నాడు మద్దిలేటి.

'ఔ... మామ! టౌన్లో ఎగ్జిబిషన్ పెట్టినప్పుడు ఎక్కినట్టుండావే బొమ్మ విమానం. మర్సిపోయినావా?' అరుగు మీద కూర్చుంటా అన్నాడు రామ్మూర్తి.

'మా ఇంటికి రాన్నా! పిల్లోడు ఆడుకునే హెలికాప్టర్ ప్లాస్టిక్ బొమ్మ వుండాది. యిస్తా! ఎక్కొని పోదువు!' నవ్వుతా చెప్పినాడు వెంకటేశు.

'రేయ్... మీకు తమాషా అయిందయ్యా. నాల్గురోజులుండండి. పాస్‌పోర్ట్ వస్తానే కువైట్ పోవాలని వుండా. అప్పుడు విమానమెక్కొచ్చి మీ కత చెప్తా' జవాబిచ్చినాడు చిటపటలాడ్తా మద్దిలేటి.

'నువ్వు ఐదేళ్ళ నుంచి ఈ మాట అంటానే వుండావులే మామ! ఆ పాస్‌పోర్ట్ తెచ్చుకునింది ల్యా. నువ్వు వూరిడ్సి పోయిందిల్యా.' రోంత ప్రక్కకు జరిగి మద్దిలేటి భుజంపై చేయివేసినాడు చిన్న పెద్దన్న.

'నువ్వు ఊరుకోరా సామీ... మధ్యలో తటిక్కిన దూర్తావుంటావు అన్నిట్లోకి'. విసుక్కున్నాడు మద్దిలేటి.

హెలికాప్టర్ మూడో రౌండు పూర్తి చేసుకుంది. దానితోక చివరి భాగంలోంచి సన్నటి వలలాంటిది గొడుగులా విచ్చుకుంది. అది కొండల అంచుల్ని తాకుతా కిందకి దిగింది.

కట్ట మీద కూర్చొని వుండేటోళ్ళందరూ లేచి నిలబడి చూస్తావుండారు.

హెలికాప్టర్ మరోసారి వలతో సహా కొండల్ని చుట్టుకొని వచ్చింది.

ఇద్దరు ముగ్గురు పిల్లోళ్ళు చెట్లు ఎక్కి చూస్తాండరు. ఆడొళ్ళు చంకల్లో చంటిపిల్లల్ని ఎత్తుకొని మిద్దెలెక్కి ఆకాశంలోకి చూస్తాండరు.

కుక్కలు మొరుగుతా రోంత దూరం ముందుకు పోతాయి... మళ్ళా వెనక్కి వచ్చేస్తాండయి.

హెలికాప్టర్ నుంచి కిందికి వచ్చిన తెల్లటివల గాలికి అటు ఇటు ఊగుతానే కొండ బండరాళ్ళని తాకుతూ ఎక్కడా చిక్కుకోకుండా హెలికాప్టర్ వెంట గాల్లోనే తేలిపోతోంది.

వింతగా వుంది. విచిత్రంగా వుంది. చూసేటోళ్ళకు.

'ఏందిరో... ఏం జరుగుతాందో అర్థం కాకుండా వుండాది. ఏం జేస్తాండరు వాళ్ళు?' తలగోక్కున్నాడు మద్దిలేటి.

'బాగుందిన్నా... మాకు తెల్సుస్తాంటే నీకూ చెప్పొచ్చు. ఎవడికి తెల్సు' అన్నుంచి లేచి చెట్టు పైకొమ్మకు ఎక్కినాడు కనపడ్డం లేదని శ్రీరాములు.

యింకో గంటసేపు హెలికాప్టర్ గాల్లో ఇట్లనే నాల్గు రౌండ్లు వేసింది.

అది ఆకాశంలో ఎగుర్తాండే వరకు ఎవరూ ఇంట్లోకి పోయింది లేదు. పనులు చేసుకుంది లేదు. ఎగమల్లుకునే వుండారు.

సాయంత్రం కావస్తోంది. హెలికాప్టర్ శబ్దం చేసుకుంటా పడమటి ఆకాశం దిక్కు వెళ్ళిపోయింది.

మళ్ళీ వస్తుందేమో అని పిల్లోళ్ళు బయటే ఆడుకుంటూ ఎదురుచూస్తా వుండారు.

కుక్కలు అలిసిపోయి బోరింగు మోట్లోని తడిమట్టిలో కూలబడి సేదతీర్తాండయి.

'పల్లెలో మనకంటే తెలీదు. టౌన్లో వుండే ఆఫీసర్లకు విషయం తెల్సి వుంటాది. పులిందలకు పోయి దీని కతేందో కనుక్కొని వస్తా' అని గొణుక్కుంటా కట్టపైనుంచి లేసిపోయినాడు మద్దిలేటి.

'ఎమ్మెల్యే సారింటికాడికి పోతే, నీకన్ని తెలుస్తాయిన్నా. ముందు ఆ విషయం ఏందో కనుక్కొని రాపో...' అన్యాడు కట్టమీద గుర్రప్పతో పులిజూదం ఆడ్తాండే చిన్న పెద్దన్న.

'నువ్వు ఆడుకోరా... సామీ. నాకత నీ కేంటికి? య్యాదోఒకటి కనుక్కొని వస్తాగానీ...' అనుకుంటూ ఇంటిదారి పట్టినాడు మద్దిలేటి.

రావిచెట్టు కొమ్మలపై వాలిన పక్షి కూతేస్తోంది. కొంత సేపటికి ఆటలో మూడు మేకల్ని పులి తినేసింది.

● ● ●

ప్రొద్దున్నే ఎగువ ఇండ్ల కాన్నుంచి బాలిరెడ్డి, మునిరెడ్డి, చలమారెడ్డి, వెంకటనాయుడు, గౌస్ రచ్చబండ దగ్గరికొచ్చినారు రోజులాగే.

సర్పంచు బాలిరెడ్డి ఇంటికే పేపరొచ్చేది. దాన్ని చంకలో పెట్టుకొని ప్రొద్దున్నే ఆయప్ప రచ్చబండ కాడికి వచ్చేస్తాడు.

'ఏం! న్నా... ఏంది నిన్న మనూరి నల్లరాతి గుట్టలపైన హెలికాప్టర్ తిరిగింది అని పేపరు కేసినారా? ఏంటికి వచ్చిందంట!' నోట్లో వేపపుల్ల వేసుకొని పళ్ళు తోముకుంటా ఎత్తిడ్సినాడు మునిరెడ్డి.

'ఔ...బ్బీ! వేసినారు' - పేపర్లోకి తలదూర్చి కళ్ళకు దగ్గరగా పెట్టుకొని చదువుతానే జవాబిచ్చినాడు బాలిరెడ్డి.

'వార్నీ... నువ్వు అద్దాలు తెచ్చుకోకుండా వచ్చినట్లుండావే. పో సామీ... ఇంటికాడికి ఎవర్నన్న పిల్లోడ్ని పంపించైనా అద్దాలు తెప్పించుకో...' వార్త ఏమిటో తెలుసుకోవాలనే ఆతృత. బాలిరెడ్డి అద్దాలు మర్చిపోయి వచ్చినందుకు విసుగు. మునిరెడ్డి స్వరంలో!

'పెద్దాయిన... యిట్టీ... పేపరు నేనైనా చదవుతా...' అడిగినాడు చలమారెడ్డి.

'ఇదో... తీసుకో...' అసహనంగా ఇచ్చేసినాడు బాలిరెడ్డి.

'రోంత గట్టిగ చదువు న్నా... అందరం వింటాం' వెంకటనాయుడు ఆసక్తిగా అడిగినాడు.

'ఔనను... ఆ వార్త తెల్సుకోవాల ముందు' తన ఆసక్తిని కూడా వ్యక్తపర్చి నాడు గౌసు.

'చదువుతాండ... అందరూ రోంతసేపు నిశ్శబ్దంగా వినండి...' - చదవడం మొదలు పెట్టినాడు చలమారెడ్డి.

'నల్లరాతి గుట్టల్లో యురేనియం సర్వే - నిన్న ఉదయం నుంచి సాయంత్రం దాకా నల్లరాతి గుట్టలలోని అటవీ ప్రాంతంలో భారత అణు ఇంధన సంస్థకు చెందిన ఓ హెలికాప్టర్ యురేనియం నిల్వల కోసం సర్వే చేసింది. హెలికాప్టర్ తోక చివరి భాగంలో వలలాంటిది ఏర్పాటు చేశారు. అది కొండల అంచులను తాకుతూ నైసర్గికంగా ఉన్న అణు ఇంధనం గురించి సర్వే చేస్తోంది. నల్లరాతి గుట్టల పరిసర ప్రాంతాల్లో జరిగిన ఏరియల్ సర్వేను - పల్లెల్లోని జనం ఆసక్తిగా వీక్షించారు.'

గట్టిగా వార్తను చదివి ముగించినాడు చలమారెడ్డి.

'వార్ని... అది అసలు విషయం. మనం ఏందోనని తెలియక తకనలాడ్తిమి' ఉత్కంఠ నుంచి బయటపడినట్లు ముఖం పెట్టాడు బాలిరెడ్డి.

'నేను అప్పుడా అనుకున్య. మన ఎమ్మెల్యే సారింటికాడ అదే అనుకుంటా వుండిరి. నేను పట్టించుకోకుండా, నా పని చేసుకొని వచ్చేస్తి.' అన్నాడు కట్టపైకి చదివేటప్పుడు మధ్యలో వచ్చిన శివారెడ్డి.

'యురేనియం అంటే ఏందో...' వేపపుల్లను నోట్లోంచి తీసి పక్కకి విసిరేస్తూ అడిగినాడు మునిరెడ్డి.

'ఎవడికి తెల్సు దాని గురించి. అంతోయింతో చదువుకునింది నాయ్డునే ఆయప్పనే చెప్పాలా...' కాళ్ళు ఆడించుకుంటా బదులిచ్చినాడు బాలిరెడ్డి.

'నాది పాతకాలం చదువు. నేనేం చెప్పాలా? దాన్ని బాంబుల తయారు చేసేదానికి వాడ్తారని అనుకుంటా' సందేహంగానే చెప్పినాడు నాయ్డు.

'అదేంది న్నా... అట్లా చెప్పినావు? బాంబుల కా... అదేంటికి మన భూముల్లో పడింది. దీనెమ్మ... పడిపడి మంచిది పడిందే?' - అన్నాడు చలమారెడ్డి ఆందోళన పడ్తా.

'పులిందల్లో మన కాడుండే బాంబులు సరిపోవు అన్యట్లు యింగా ఈ బాంబుల్ని తయారు చేసే గని గూడా యిడ్నే పడిందా... బాగుండాది...' నిట్టూర్పు యిడ్సినాడు గౌసు.

'యింతకీ సర్వే జేసినారు. బాగానే వుండాది. అక్కడ యురేనియం వుండాదనా? లేదనా? దాని గురించి ఏం రాసినారు పేపర్లో' - మళ్ళీ తన సందేహాన్ని బయటబెట్టినాడు బాలిరెడ్డి.

'అది ముందు తెలియాల' వత్తాసుపలికినాడు శివారెడ్డి కూడా.

'దాని గురించి పేపర్లో ఏం రాయలేదు.' పేపర్‌ను మళ్ళీ పైనుంచి కిందికి చూస్తా సమాధానమిచ్చినాడు చలమారెడ్డి.

'మళ్ళ ఎమ్మెల్యే, ఎంపీ ఆఫీసుల దిక్కు పోయినప్పుడు విషయాలన్నీ కనుక్కోని వస్తాలే' విషయం తనకొది లేయమనట్లు చెప్పినాడు శివారెడ్డి.

'మంచిది. అట్నేలే శివాడ్డి. నువ్వు టౌన్లోకి పోయినాంక మర్చిపోకుండా సంగతంతా కనుక్కోని రావాల...' మునిరెడ్డి సూచన చేసినాడు.

'అట్నేలేన్నా...' తలాండించినాడు శివారెడ్డి.

'ఈ హెలికాప్టర్ సర్వే వల్ల ఏమైనా ప్రమాదం ఉండాదేమో అదీ కూడా కనుక్కోవలా... చుట్టు పక్క జనం ఏం జరుగుతాందో, ఏమైతాందో అర్థం కాకుండా చూస్తాండరు' మళ్ళీ యింకోమాట అన్నాడు బాలిరెడ్డి.

'ఇద్దరం పోదాం పా మామ. అన్నీ ఎమ్మెల్యే సారింట్లోనే మాట్లాడొచ్చు. నీ సందేహాలన్నీ తీర్తాయి. సర్పంచువు నువ్వేం చేస్తాండవని ఎవరన్నా అడిగినా రోంత జవాబు చెప్పేకి వుంటాది' - తనతో పాటూ రావల్సిందిగా శివారెడ్డి సలహా యిచ్చాడు.

'ఎమ్మెల్యే సారు!... హైద్రాబాదుకు పోయినాడో, ఇంటికాడ పులిందల్లోనే వుండాడో' కనుక్కో మన్యట్లు చెప్పినాడు.

'పార్టీ ఆఫీసు కాడికి పోతే ఎవరో ఒకరు వుంటారు పా... మామ. నీకు అన్నీ యిడ్నే చెప్పాలంటావు...' అన్యాడు కాళ్ళు ఆడించుకుంటానే శివారెడ్డి.

బాలిరెడ్డి నవ్వినాడు. గాలికి ఎగిరి పోతాండే పేపరుపైకి రాయితెచ్చి పెట్టినాడు మునిరెడ్డి.

• • •

శబ్దం.

దూరంగా ఆకాశంలో శబ్దం. నల్లరాతి గుట్టల దగ్గర నిన్న తాను పోగొట్టుకున్న వస్తువు కోసం వెతుక్కుంటూ వస్తోంది ఇనుప రెక్కల హెలికాప్టర్.

పిల్లోడెవరో బయటికివచ్చి ఆకాశానికేసి చూసి కుడిచేయి బొటన వేలును, దాని పక్క వేలును గుండ్రంగా మడిచి నోట్లో పళ్ళ మధ్యపెట్టుకొని గట్టిగా ఈల వేశాడు. పల్లెంతా ఒక్క సారిగా ఉలిక్కిపడింది.

హెలికాప్టర్ తోక భాగం నుంచి తెల్లటి వల విచ్చుకుంది. నల్లరాతి గుట్టల్లో తన పనితాను చేసుకపోతోంది హెలికాప్టర్.

అందరిండ్లలో మళ్ళీ ఎక్కడిపనులు అక్కడ ఆగిపోయాయి.

పిల్లోళ్ళు చెట్లకొమ్మ లెక్కుతాండరు. ఆడోళ్ళు మిద్దె లెక్కుతాండరు.

'ఏందంట మామ! మళ్ళా హెలికాప్టర్ వచ్చింది.' అడిగింది చంకలో ముక్కు నిండా చీమిడితో వుండే కొడుకును ఎత్తుకొని వెంకటేశు పెండ్లాం.

'సర్వే అంటవేమ్మ... ఏందో యురేనియం. దాని కోసరం సర్వే చేస్తావుండారని పేపరుకు ఈ రోజు వేసినారు' అరుగు పైకెక్కి ఆకాశంలోకి చూస్తా చెప్పినాడు మద్దిలేటి.

కుక్కలు మళ్ళా తమ పని మొదలు జేసినాయి.

'దీనెమ్మ... దీన్లతో పెద్ద రావిడైపోయా! అర్సుకుంటా' అని రాయి తీసుకొని విసురుగా దాన్లను కొట్టినాడు చిన్న పెద్దన్న.

అవి కుంటూ కుంటూ చీకిచెట్ల దిక్కు పోయినాయి మొరుగుతానే!

చిన్నపెద్దన్న కూడా అరుగు పైకెక్కి హెలికాప్టర్ దిక్కే చూస్తా వుండాడు.

'ఏరియల్ సర్వేలో ఎయిర్ గామా డిటెక్టర్స్ అన్వేషిస్తూ సంకేతాలు అందిస్తుంటాయి. తెల్లటి వల ద్వారా యురేనియం ఉనికికి సంబంధించిన ప్రాథమిక సమాచారం సేకరిస్తారు. అసలు యురేనియం ఈ ప్రాంతంలో వుందా? లేదా? అని సర్వే చేయడంలో భాగంగా హెలికాప్టర్ ఇక్కడికి వచ్చింది.' మోటర్ బైక్ లోంచి దిగిన విలేకరి విషయాన్ని పక్కనున్న రామ్మూర్తికి చెప్పినాడు.

విలేకరితో పాటూ కెమెరాతో వచ్చిన ఫోటోగ్రాఫర్ ఫోటోలు తీసుకున్నాడు.

మరో గంట పాటు ఆకాశంలో చక్కర్లు కొట్టిన హెలికాప్టర్ వెళ్ళిపోయింది.

● ● ●

మరో నాల్గురోజుల తర్వాత హైద్రాబాదు నుంచి పులిందల కొచ్చిన రెండు నీలం రంగు జీపులు తెల్లవార్తానే బయలు దేరినాయి. బెస్తపల్లి దాటుకున్యాయి. మబ్బుచింతలపల్లి దాటుకున్యాయి.

తుమ్మలపల్లి చేరుకున్నాయి. అక్కడ్నుంచి మరో రెండు కిలోమీటర్లు ముందుకే సాగాయి.

దాన్లలోంచి పన్నెండుమంది దిగారు. వారందరూ ఒకే రంగు దుస్తులు ధరించి వుండారు.

వాళ్ళ చేతిలో పొడవాటి పరికరాలు. వాళ్ళతోనే వచ్చిన జియాలజిస్టులు స్థలాలను పరిశీలిస్తున్నారు. కొన్ని చోట్ల తమ చేతిలోని మార్కర్లతో గుర్తులు వేస్తున్నారు. నల్లరాతి గుట్ట పరిసర ప్రాంతాల్లో జల్లెడ పడ్తూ గుర్తులు వేసుకుంటా పోయారు.

మిగిలిన వాళ్ళు చేతుల్లోని సైంటిల్లో మీటర్లుతో పరిశీలన సాగిస్తున్నారు. మధ్యాహ్నానికి కొంత పని జరిగింది. తర్వాత రెండువందల మీటర్ల వరకు గుర్తులు వేసిన చోటు నుంచి ముడి ఖనిజాన్ని సేకరించడం మొదలు పెట్టారు.

సాయంత్రం వరకు పలుచోట్ల నుంచి ఇలా అక్కడి భూమి పొరల్లోని మట్టిని, ముడిఖనిజాన్ని కొద్ది కొద్దిగా సేకరించుకొని నమూనాలుగా - ఒక్కో పాయింట్ నుంచి సేకరించిన దాన్ని ప్రత్యేకంగా విడివిడిగా ప్యాక్ చేసుకున్యారు.

జీపులు వెనక్కి కదిలాయి. నల్లరాతి గుట్ట నుంచి పులిందలవైపుకి బయలుదేరాయి. తుమ్మలపల్లి వద్ద ఎర్రమట్టిదారిలో దుమ్ము రేపుకుంటూ వెళ్తున్న జీపులను చూస్తుండి పోయినారు - స్థానిక ప్రజలు.

ఎర్రదుమ్మును బోరింగ్ కొట్టి ముఖాలు కడుక్కున్యారు.

హైద్రాబాదులో ల్యాబుకు చేరిన నల్లరాతి గుట్టలోని ముడిఖనిజ నమూనాలపై పరిశోధన మొదలైంది. దీన్ని పరిశోధకులు 'డిపాజిట్ గణన' అని పిలుస్తారు. అసలు ఆ ప్రాంతంలో యురేనియా ఎంత శాతంలో వుంది?

దాన్ని వెలికి తీయడానికి అయ్యే వ్యయం ఎంత? అసలు యిక్కడ తవ్వకాలు చేపట్టడం లాభమా? నష్టమా? అన్ని గణాంక వివరాల్ని లెక్కకడ్తారు. ఆ తర్వాత ఆ నివేదిక... యురేనియం కార్పోరేషన్ లిమిటెడ్‌కు చేరుకుంటుంది. వాళ్ళ లెక్కలు వాళ్ళకుంటాయి. వాళ్ళు కూడికలు, తీసివేతలు వేసి, తీసి సరిచూసుకొని రంగంలోకి దిగుతారు. వారు అడుగు పెడితే ఏమౌతుంది?

❖ ❖ ❖

'ఢిల్లీ నుంచి ఎంపీ సారొచ్చినాడని యిప్పుడే ఫోనొచ్చింది. ఏమైనా పనులుంటే చెప్పు. పోయి మాట్లాడుకొని వచ్చేదానికి' - బయట వేపచెట్టు నీడలోనులక మంచంపైన కూర్చుంటా అన్నాడు శివారెడ్డి.

'ఎమ్మెల్యే సారు హైద్రాబాదులోనే వుండాడంట. ఈ నెల వచ్చేదానికి కుదర్దని చెప్తాండరు. పోయి మాట్లాడి వచ్చేదానికి ఎంపీసారు కాడికి పోయేదే మేలుగా అనిపిస్తాంది.' లోగా ఇంట్లోంచి బయటికొచ్చినాడు సర్పంచి బాలిరెడ్డి.

'ఏం మాట్లాడాల?' -

'ఏముండాది! అదో మొన్న వచ్చిన హెలికాప్టర్, నిన్న వొచ్చిన యురేనియం ప్రాజెక్టు ఇంజనీర్లు... దీని సంగతేందో ఒక మాట రోంత కనుక్కుంటే బాగుంటాది' -

'అదీ నిజమే! టౌన్లో వుండేది వాళ్ళు. పల్లెలోబడి వుండేది మనం. ఒకటి పోయి ఒకటైతే ఎట్లా. కదులు పోయి... అడిగొస్తే సరిపోతాది' -

శివారెడ్డి, బాలిరెడ్డి స్కూటరేసుకొని టౌను దిక్కుకు కదిల్నారు.

ఎంపీ సారొచ్చినాడు. ఆఫీసు తెరిచేవుండాది. స్కూటరు పూలంగళ్ళకాడ నిలబెట్టుకొని ఆన్నుంచి నడ్సుకుంటా వచ్చినారు. లోపల జమ్మలమడుగు కాన్నుంచి వచ్చిన పార్టీ కార్యకర్తలతో చర్చలు ఏవో జరుగుతాండయి. బయట కుర్చీలో కూర్చున్నారు. ఇరవై నిమిషాలకు లోపలుండే కార్యకర్తలందరూ చమటలు తుడ్సుకుంటా బయటికొచ్చినారు.

వాళ్ళందరూ బయటికొస్తానే, శివారెడ్డి, బాలిరెడ్డి ఇద్దరూ గదిలోకి పోయినారు.

ఎంపీ సారూ ఎదురుగా కుర్చీలో కుర్చొనివుండాడు. నమస్కారం పెట్టిరి. తలాడించినాడు ఎంపీ.

వచ్చిన పని ఏమిటన్నట్లు ఒక చూపు చూశాడు. 'అదేన్నా... సర్పంచు బాలిరెడ్డిన్నా... రోంత ఏందో నీతో మాట్లాడాలంటా వుండాడు' -

'ఆ౹౹ చెప్పు బాలిరెడ్డి... ఏంది సంగతి' - ఏదో రాసుకుంటానే పలకరించినాడు ఎంపీ.

'అయ్యా! మొన్న రెండ్రోజులు నల్లరాతి గుట్టల దిక్కు హెలికాప్టర్ వచ్చింది. వాళ్ళు ఎవరో యురేనియం ప్రాజెక్టు ఇంజనీర్లంటా జీపులేసుకొని పల్లె దిక్కు వచ్చి పోతాండరు... విషయం మాకైతే ఏమీ తెల్దు' - చెప్పినాడు బాలిరెడ్డి కుర్చుంటా.

'ఏమో బాలిరెడ్డి... నాకు తెల్దు దాని విషయం. హైద్రాబాదుకు పోయి పెద్దాయనతో ఒకసారి మాట్లాడితే సరిపోతాది. విషయమంతా తెలుస్తాది. అయినా దీంట్లో మనం చేసేదేముంది? వాళ్ళపని ఏదైనా వుంటే వాళ్ళు చేసుకొని పోతాంటరు' మళ్ళీ రాసుకునే పనిలోనే నిమగ్నమైనాడు ఎంపీ.

'అంతేనా... యింకెమైనా వూర్లో సమస్యలుండాయా?' ఎంపీ నుంచి ప్రశ్న...

'ఏం లేవుయ్యా. అంతా బాగుంది' - బదులిచ్చినాడు బాలిరెడ్డి.

'సరే అయితే... పోయిరండి! ఏమైనా వుంటే మళ్ళా చిన్నాయన వుంటాడు. చెప్పుకోండి' -

'అట్నే లేయ్యా! మంచిది' - బయటికి కదిల్నారు ఇద్దరూ అన్నుంచి.

❖ ❖ ❖

రాష్ట్రముఖ్యమంత్రి కార్యాలయం సచివాలయం బిజీగా వుంది. న్యూఢిల్లీ నుంచి ఈ రోజు ఉదయమే వచ్చిన ఒక ప్రత్యేక బృందంతో ముఖ్యమంత్రి చర్చిస్తున్నాడు. మొత్తం ఆరుమంది సభ్యులు. సీఎండీ, ఛైర్మన్, డైరక్టర్, మెంబర్స్ చర్చల్లో పాల్గొనడానికి, ముఖ్యమంత్రిని కలవడానికి మరో గంట వరకు ఎవరికీ ప్రవేశం లేదని తేల్చి చెప్పేశారు.

వాళ్ళందరూ యురేనియం కార్పోరేషన్ సభ్యులు. వాళ్ళ చేతుల్లో విలువైన డాక్యుమెంట్లు. ముఖ్యమంత్రి మంచినీళ్ళు తాగి గాజు గ్లాసు టేబుల్‌పైన పెట్టాడు. మెడలో టై, కోటు, బూటు, సూటు వేసుకున్న డైరక్టర్ డాక్యుమెంట్ ఫైల్ తెరిచి చదువుతున్నాడు. ముఖ్యమంత్రి సావధానంగా వింటున్నాడు. 'మీ నియోజకవర్గంలోనే యురేనియం నిల్వలు బయటపడ్డాయి. మా సర్వే పూర్తయ్యింది. దాని వివరాలు మీకిస్తాను. యింకో శుభవార్త. ప్రపంచంలో అత్యధిక యురేనియం నిల్వలున్న 20 గనుల్లో మీ నియోకవర్గంలోని గని కూడా ఒకటి. చెప్పేది ఆపి అతడు తన టైని సరిచేసుకున్నాడు.

ముఖ్యమంత్రి ముఖంలో ఏదో కొత్తకాంతి. పెదవులపై చిరునవ్వు. 'భూగర్భంలో ఎన్నిటన్నుల వరకు వుండొచ్చు...' 'లక్ష టన్నులు' - సూటిగా జవాబిచ్చాడు డైరక్టర్. మరోసారి నీళ్ళ గ్లాసు చేతుల్లోకి తీసుకున్నాడు ముఖ్యమంత్రి.

'నాణ్యత' ఎట్లా వుంది? - మరో ప్రశ్న. '0.3 నుంచి 0.4 శాతంకు పైగానే వుంది' డైరక్టర్ సమాధానం.

ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ఫోన్ వచ్చింది.

ఇదే విషయం వాళ్లూ మాట్లాడారు. తర్వాత కేంద్ర హోంశాఖ నుంచి మరో ఫోన్ వాళ్ళూ ఇదే విషయం మాట్లాడారు.

'ఇది చాలా ప్రధానమైన అంశం. అందులోనూ మీ నియోజకవర్గానికే సంబంధించిన విషయం. మీరే ముందుండి నడిపించాలి... మా ప్రయత్నాలకు అడ్డంకులు రానీయకుండా...' నవ్వుతూ షేక్ హ్యాండ్ ఇచ్చాడు సీఎండీ.

'మా సంస్థ దాదాపు వెయ్యికోట్లకు పైగా ఖర్చు పెట్టి ఈ ప్రాజెక్ట్‌కు సిద్ధపడుతోంది. తవ్వకాలు చేపట్టడానికి స్థల సేకరణ అవసరం అవుతుంది. ఆ విషయం మీరే చూస్కోవాలి. సహకరించాలి.' చెప్తున్నాడు ఛైర్మన్.

ముఖ్యమంత్రి నిశ్శబ్దంగా తలాడిస్తున్నాడు.

మరో వారం రోజులకు 'రాజపత్రం' ప్రకటించబడింది. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం భూసేకరణ చట్టం 4(1) విభాగం కింద ప్రకటన వెలువడింది.

'ఈ కింది షెడ్యూలులో నిర్దిష్టపరచిన కడప జిల్లా, తుమ్మలపల్లె పరిసర ప్రాంతాల్లోని భూమి ప్రజాహిత కార్యక్రమాలకు అనగా యురేనియం ప్రాజెక్టు కొరకు అవసరమైందని ప్రభుత్వము భావించినందువల్ల 1923 భూసేకరణ చట్టము, 1923లో 38వ చట్టము ద్వారా సవరించిన విధంగా వుండి నిబంధనల మేరకు సంబంధిత వారందరికీ ఎరుక నిమిత్తం ఇందు మూలముగా నోటీసు ఇవ్వడమైనది. ఈ చట్టములోని 17వ విభాగపు (4)వ ఉపవిభాగపు కింద ఈ విషయంలో సత్వరమే చర్యలు తీసుకొనవలసిన అవసరము ఉన్న దృష్ట్యా ప్రత్యేక కలెక్టర్, భూసేకరణ విభాగం వారికి అధికారం యివ్వడమైనది. షెడ్యూలు ప్రకటించబడింది. క్రమ సంఖ్య, వర్గీకరణ, సర్వేనంబరు, పట్టాదారు పేరు, బంజరు / సాగు, రిమార్కుల వివరాలతో నోటిఫికేషన్‌ను జారీచేశారు.

ఎవరూ ఊహించని ప్రకటన ఇది. రాజపత్రం ఉదయాన్నే దినపత్రికలో ప్రచురితమైంది. ఎవరెవరి భూములు పోతున్నాయో పేర్లతో సహా యిచ్చారు. రైతుల కాళ్ళ కింది భూమి కదిలినట్లు అయ్యింది. ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి. ముఖ్యమంత్రి ఆయనే, నియోజకవర్గ ఎమ్మెల్యే ఆయనే, ఎంపీ ఆయన కొడుకే.

తలలు పట్టుకొని కూర్చున్నారు రైతులు.

జాబితాలో పేర్లు వుండేటోళ్ళందరూ రచ్చబండ దగ్గర గుమిగూడినారు. ఎవరెవరి భూమి ఎన్నెన్ని ఎకరాలు ప్రాజెక్టు పరిధిలోకి పోతాందో మాట్లాడు కుంటాండరు.

'మనం భూములియ్యమని వెనక్కి అడ్డం తిరిగితే ఏమైతాది...న్నా' తనలోని సందేహాన్ని నాగమునెయ్య బయటపెట్టాడు.

'యింగంతే! అడ్డం తిరగాల. జూద్దాం. ఏమైతాదో... భూములియ్యమని వెనక్కి తిరిగితే సరిపోతాది. అంతా వీళ్ళిష్టమేనా?' - గుర్రప్ప తన బాధ కూడా చెప్పినాడు.

'యిదేంది ప్రాజెక్టో... ఏందో... ఎవరికి తెలుస్తాంది? ఎవరు చెప్తాండరు. మన కాడికొచ్చి దీని గురించి రెండు ముక్కలన్నా చెప్పిన్నాకొడుకు లేడు. ఈ రోజు పేపర్లో నీ భూమి పోతాదని పేర్లు ఎస్తే ఏమనుకోవాల? కోపంతో ఎగిరిపడ్తాండడు రామిరెడ్డి.

'గవర్నమెంటోళ్ళతో పెట్టుకుంటే ఎట్లా? మునెయ్యగాడు అంటాండేటట్లు అడ్డం తిరిగితే యింగేంల్యా... కోర్టుకు పోయినా వాళ్ళదే నెగ్గుతాది. పోలీసోళ్ళతో తన్నిచ్చి పెరుక్కుంటారు' చెప్పినాడు వీరయ్య తాత. వీళ్ళను చూసి ఎగువ ఇండ్లలోని రైతులు కూడా రచ్చబండ దగ్గరికి వస్తాండరు.

'రేయ్... పాపోడా! ఇంటికాడ సర్పంచయ్య వుండాడేమో జూసిరాపో... వుంటే, నా పేరు చెప్పు. రచ్చబండ కాడికి రమ్మన్యానని...' కట్టపైన కూర్చుంటా ఈశ్వరరెడ్డి చెప్పంపినాడు.

సామేలు - గాడు సైకిలేసుకొని మట్టి దారంబడి పిల్సకరాను పోయినాడు.

దిగువిండ్లలోని శ్రీరాములు, కుల్లాయప్ప, మద్దిలేటి కూడా రచ్చబండ దగ్గరికి చేరుకున్యారు. ఎగువిండ్లలోని మునిరెడ్డి, చలమారెడ్డి, వెంకట నాయుడు కూడా వచ్చేసినాడు.

'ఆరోజు హెలికాప్టర్ వచ్చినప్పుడే... నేను మామతో చెప్పినా... కొండ దిక్కు భూముల్లో ఏందో ఖనిజం కోసం వెతికే దానికే వచ్చినట్లుండాదని. నా మాటే నిజమైంది'. కళ్ళద్దాలు సరిచేసుకున్నాడు ధర్మారెడ్డి.

‘ఎవరం అనుకున్యామని... మరుసటి దినం పేపరు జూసేదాక మాకూ తెల్డు. అయితే అంతలేన్ది హెలికాప్టర్ ఏంటికొస్తాదిలే అని అనుకుంటిమి.’ పంచె సరిచేసుకుంటా కట్టపైన కూర్చున్నాడు మునిరెడ్డి.

‘ఔ... అదేలే మనమారోజు అనుకునింది’ - నోట్లో సిగరెట్ పెట్టుకొని అగ్గిపెట్టెకోసం మద్దిలేటికి సైగ చేసినాడు చలమారెడ్డి.

మద్దిలేటి పై జేబులో తారాడుకొని అగ్గిపెట్టె లోంచి పుల్ల తీసి మండించి చలమారెడ్డి నోట్లోని సిగరెట్‌కు దగ్గరగా పెట్టినాడు. గుప్పు గుప్పుమని పొగ ఊదినాడు చలమారెడ్డి.

సిగరెట్ రగులుకుంది. సర్పంచు బాలిరెడ్డిని పిల్సకరాను ఇంటికాడికి పోయిన సామేలు గాడు వేగంగా సైకిల్ తొక్కుంటా ‘చెప్పొచ్చినానని’ వచ్చేసినాడు.

మరోసారి పేపర్లో వచ్చిన నోటిఫికేషన్‌ను పైనుంచి కింది దాకా ఎగాదిగా చూసినాడు రామాంజి.

‘రే... రామాంజి! మేము భూములు పోతాండయని దిగాలు జేస్తాంటే నువ్వు లెక్క ఎంతొస్తాదని ఆలోచన జేస్తాండవా..? పనికిమాలిన ముండా కొడుకా. రోంతన్నా బుద్ధీ జ్ఞానముండాదా లేదా? పదోతరగతి కాడికైనా చదువుకున్యావే.’

గదురుకున్యాడు చలమారెడ్డి సిగరెట్ పొగ గాల్లోకి రింగులు రింగులుగా వదుల్తా.

రామాంజి ఏంమాట్లాడితే ఏమంటారోనని తలొంచుకొని కట్టకు అవతల చింతచెట్టు కాడుండే బండపైకి ఎక్కికూర్చున్నాడు. పైకి చూసినాడు.

పై కొమ్మల్లో కాకిగూళ్ళు నాలుగైదు కన్పించినాయి.

శివారెడ్డి స్కూటర్‌లో వెనక కూర్చొని తెల్లని ఖద్దరు దుస్తుత్తో బాలిరెడ్డి రచ్చబండ దెగ్గరికొచ్చినాడు.

ఆయప్పను చూస్తానే కట్టపైన కూర్చొని వుండేటోళ్ళు సర్దుకొని మధ్యలో జాగా చూపిచ్చినారు. కింద మట్టి మీద కూర్చోని వుంటేటోళ్ళు నమస్కారాలు చేసుకున్నారు.

'ఏం మామా! యింతసేపు పట్యా వచ్చేదానికి నీ కోసం ఎగమల్లుకొని చూస్తా వుండాం' నవ్వుతా పలకరించినాడు మునిరెడ్డి.

'పొద్దున్నే పనులుంటాయి లేవోయ్! స్నానం గీనం చేసి రోంతసేపు పూజ చేస్కొని బయటికొస్తాగానీ...' చెప్పినాడు తన ఆలస్యానికి కారణాన్ని బాలిరెడ్డి.

'పేపరు జూస్తానే దిక్కు తెలీక నీకు ఫోన్ జేసింది అందుకే న్నా...' అన్నాడు నాయుడు.

'నువ్వే కాదు... వూర్లో శానామంది ఫోన్లు కొట్టినారు. అందుకే అందర్ని రచ్చబండ కాడికి రమ్మని చెప్పింది...'

భుజంపై నుంచి కండువా సరిచేసుకున్నాడు బాలిరెడ్డి.

'నాది రెండెకరాలు పోతాంది మామా... ప్రాజెక్టు కిందికి... పేపర్లో వేసినారు అదే చూస్కుంటాండ...' చెప్పినాడు కట్ట అరుగుపై చివర్లో కూర్చొని వుండే అంకిరెడ్డి.

'యింగ నాది కూడా ఆరు ఎకరాలు పోతందిలే మొగోడా! నీ దొక్కడిదే పోతండేటట్లు చెప్పకస్తాండవు. భూమి పోతాందనే యిప్పుడీడ కూర్చొనింది. మాట్లాడుకోనే...' నవ్వుతానే సమాధానమిచ్చినాడు బాలిరెడ్డి.

రావిచెట్టు కొమ్మలు గలగలా ఊగుతాండయి.

'ఎట్ట జేద్దాం... న్నా! భూములు పోగొట్టుకుంటే మన పరిస్థితి ఎట్లా. పిల్లోళ్ళు, సంసారాలు వుండేపని. ఉన్నింది రోంత పోగొట్టుకుంటే సంపాదించు కునే దెప్పుడు... పెద్దోళ్ళు యిచ్చి పోయినారు గాబట్టి సరిపోయింది. మనం సంపాదించాలంటే య్యాడైతాది? దీని కతేందో యింగ నువ్వే జెప్తాల....' చెప్పినాడు రామిరెడ్డి........ ఆవేదనగా.

‘నిజమే... రామిరెడ్డి, భూములు పోతాండయి అంటే ఎవరికైనా బాధే. నీదైతే ఒకటి. వేరే వాళ్ళదైతే యింకొకటా?’

మొన్న ఎంపీ సారొచ్చినప్పుడు నేనూ, శివారెడ్డి యిద్దరం పోయి కల్సి మాట్లాడితిమి. నాకూ తెల్దు. పెద్దాయనతో మాట్లాడి కనుక్కుంటాలే అన్యాడు. యిప్పుడు జూస్తే ఇట్లా నోటిఫికేషన్ పేపరుకేసినారు...’ తను చేసిన ప్రయత్నాన్ని చెప్పినాడు బాలిరెడ్డి.

‘వచ్చేవారం హైద్రాబాదు నుంచి సారొచ్చినాంక అందరం పోయి కనపడి మన సమస్య చెప్పుకుంటే సరిపోతాది లే...న్నా. నోటిఫికేషన్ వచ్చిన సంగతి ఆ పెద్దాయనకుకూడా తెల్సే వుంటాది. ఏం జెప్తాడో విందాం. సరిపోతాది...’ సలహా ధోరణిలో చెప్పినాడు చలమారెడ్డి.

‘యింగ అంతేలే..... అంతకంటే మనం చేసేది గూడా ఏం లేదు. పెద్దాయిన రానీ అన్నీ ఆయప్పకాడ్నే మాట్లాడితే - ఆయనే య్యాదో ఒక దారి చూపిస్తాడు...’ శివారెడ్డి మద్దతుగా పలికినాడు.

‘నేనూ అదే అనుకుంటాండ. పెద్దాయనకే మొరపెట్టుకుంటే సరిపోతాది. ఆ రోజు వూర్లో వాళ్ళందరం పోదాం. చెప్పుకుందాం. యింగ ఏమైనా గానీ...’ ఒక కొలిక్కి వచ్చినట్లు చెప్పినాడు బాలిరెడ్డి.

‘కాదు...న్నా... పెద్దాయిన హైద్రాబాదు నుంచి పులిందలకు వచ్చేదానికి ఎప్పుడైతాదో తెలీడం లేదు. ఈ లోగా సోమారం రోజు కలెక్టర్నైనా కలిసి మన గోడు చెప్పుకుందాం... పాండి’ - చింత చెట్టుకాడ కూర్చొని నిశ్శబ్దంగా అన్నీ వింటాండే రామాంజి నోరు విప్పినాడు.

రావి చెట్టు కొమ్మలు గాలికి ఊగుతా శబ్దం చేస్తావుండాయి... కట్టపైన.

రచ్చబండ అరుగు మీదుండే బాలిరెడ్డి నీళ్ళు తెమ్మనేటట్లు సైగ చేసినాడు తాగేదానికి.

'రామాంజి గాడు చెప్పేది కూడా రోంత బాగానే వుండాది. నోటిఫికేషన్ ఇచ్చిండేది కలెక్టరే గాబట్టి ఆయప్పకు దీని కతంతా బాగా తెల్సింటాది. పోతే చెప్పనన్నా చెప్తాడు...' అంటా కళ్ళు పులుముకున్నాడు అంకిరెడ్డి.

కట్ట దగ్గర కాసేపు నిశ్శబ్దం.

'మన భూములకు నష్టపరిహారం ఇయ్యాల్సింది, మంజూరు చేయాల్సింది కూడా కలెక్టరే. ఆయప్పను ఓసారి కల్సివస్తే మనకుండే అనుమానాలన్నీ ఆటికి తెగిపోతాయి. ఈ లోగా పెద్దాయిన గూడా వస్తాడు. మాట్లాడుకోవచ్చు తన మాటగా నాయుడ్డు చెప్పినాడు.

ధర్మారెడ్డి కొడుకు పెద్ద ఇత్తడి చెంబుతో కుండలో నీళ్ళు పట్టుకొచ్చినాడు. బాలిరెడ్డి అందుకున్నాడు. రామాంజి చింతచెట్టు దగ్గర్నుంచి కట్ట దగ్గరి అరుగు పైకి వచ్చినాడు. బాలిరెడ్డి నిమ్మళంగా నీళ్ళు తాగి తేన్చినాడు.

'ఇది గూడా రోంత బాగానే వున్నట్లుండాది చూడు మామ! కలెక్టర్ను ముందు కల్సి ఒకమాట అడిగి జూద్దాం. ఏం చెప్తాడో...' జతగా పలికినాడు రామిరెడ్డి.

బాలిరెడ్డి ఏం మాట్లాడలేదు. శివారెడ్డి వైపుకు తిరిగి చూసినాడు.

దిగువిండ్లలోని మద్దిలేటి, కుళ్ళాయప్ప మట్టి మీద పుల్లతో ఏదో గీసుకుంటాండరు.

నాగమునెమ్మ, లక్షుమ్మ ఆకువక్క కట్లపొడి నోటినిండా వేసుకొని నములుతాండరు.

'అట్నేలే... కలెక్టర్ని కల్సను పోతే సరిపోతాది. పోయేదేం వుండాది. తప్పేముండాది. ఆయప్ప ఏం జెప్తాడో తెల్సుకొని వస్తే మళ్ళా వారం పెద్దాయిన వచ్చినాంక కూకొని మాట్లాడుకుంటే సరిపోతాది' చెప్పినాడు శివారెడ్డి కాళ్ళు ఆడించుకుంటా.

'సోమారం రోజు నాకు టౌన్లో రోంత పనుండాది గానీ, మీరూ శివారెడ్డితో కల్సి కలెక్టరు కాడికి పోయి రాపోండి. ఏం జెప్తాడో అదిగూడా తెల్సిపోతాది. మళ్ళా కావాలంటే పెద్దాయనతో చెప్పిస్తే సరిపోతాది' - మీసాలు సరిచేసుకుంటా చెప్పినాడు బాలిరెడ్డి.

రావి చెట్టుపై కొమ్మల్లోంచి ఎండుటాకులు ఆగి ఆగి రాలిపడ్తా వుండాయి. నాగమునెమ్మ తన కొంగు మూటలోంచి రెండు తమలపాకుల్ని పెరికి ఆకు అడుగున కొసలను తుంచి పడేసి, ఆకుల్ని నోట్లోకి పెట్టుకుంది.

'సోమారం మొదటి బస్సుకే పల్లెకాన్నుంచి కదులుదాం. మళ్ళా మళ్ళా జెప్పేది ఏం లేదు. బస్సుకాడికి అందరూ రావాల...' తేల్చి చెప్పినాడు శివారెడ్డి.

భుజంపై నుండే కండువా విదిల్చుకొని పైకి లేచినాడు బాలిరెడ్డి. శివారెడ్డి స్కూటర్ స్టాట్ చేసినాడు.

చింతచెట్టు పైనుండే కాకులు అర్సడం మొదలు పెట్టినాయి.

• • •

సోమవారం. ఉదయం పది గంటల సమయం. సభాభవన్ ప్రాంగణం. కలెక్టరేట్ అర్జీలు రాసుకొచ్చిన పల్లెజనంతో రద్దీగా వుంది.

ఏవేవో సమస్యలు. ఒక్కొక్కరిది ఒక్కో గోడు.

దూరంగా కొంత మంది వేపచెట్టు నీడలో నిల్చుని వున్నారు. యింకొందరు తూర్పు దిక్కుండే కానుగ చెట్టు కింద కూర్చొని వున్నారు.

వాడిపోయిన ముఖాలు. మాసిపోయిన మనుషులు. పల్లె నుంచి ఉదయాన్నే మొదటి బస్సుకే బయలుదేరి టౌనుకొచ్చిన వాళ్ళు... అర్జీలు అరుగు మీద కూర్చొని రాసే వ్యక్తి దగ్గరికెళ్ళి పది రూపాయల నోటు అతడి చేతిలో పెట్టి, తమ సమస్య ఏదో వివరంగా విన్నవించుకొని అర్జీ కాయితం రాయించుకుంటున్నారు.

దుమ్ము, ధూళి నిండిన దేహాలతో ఎండ పడని ప్రదేశాల్లో కాస్త చోటుకోసం మరికొందరు వెతుక్కుంటున్నారు. చంకలో పిల్లాడిని ఎత్తుకొని, వాడి ఏడుపును కూడా సముదాయించే ఓపిక లేక, తన ఏడుపు ఎవరితో చెప్పుకోవాలో దిక్కు తెలియక గేటు దగ్గరికి, గదుల దగ్గరికి అటూ ఇటూ తిరుగుతోంది ఆడమనిషి. ఈ జనం మధ్యలోనే ఉడకేసిన అనపకాయల తట్ట నెత్తి మీద పెట్టుకొని అమ్ముకుంటున్నాడు ముసిలాయన.

గదిలోపలికి జాయింట్ కలెక్టర్ వచ్చాడు. డీఆర్వో వచ్చాడు. డీఆర్డీఏ పీడీ వచ్చాడు. ఎస్సీ కార్పోరేషన్ ఈడీ వచ్చాడు. యిక రావలసింది కలెక్టర్ ఒక్కడే! అందరూ ఆయన కోసమే ఎదురు చూస్తూ కూర్చొని వున్నారు అసహనంగా.

ఈరోజు ప్రజావాణి కార్యక్రమంలో 'డయిల్ యువర్ కలెక్టర్' ప్రోగ్రాం కూడా వుంది. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తమ సమస్యల్ని ఫోన్ ద్వారా చెప్పుకోవచ్చు.

ఎడమవైపు ఏర్పాటు చేసిన చెక్క బెంచీపై వున్న విలేకర్లు ఫోన్లలో మాట్లాడుకుంటూ కాలక్షేపం చేస్తున్నారు.

గదిబయట క్యూ గేటు వరకు వుంది. తోసుకుంటున్నారు. అందులో కొందరు వికలాంగులు కూడా వున్నారు. ఇంకొందరు రోగగ్రస్తులు. ముంపు గ్రామాల వాళ్ళు. రోడ్ల విస్తరణలో దుకాణాలు కోల్పోయిన వాళ్ళు. నిరుద్యోగులు, కరువు నష్టపరిహారం కోరే రైతులు, పించన్ల కోసం, రుణాల కోసం, మన చుట్టూ మన మధ్య వలలు వలలుగా విస్తరించిన సమస్యలెన్నో... జీవితం కంటే అందమైనది పేదరికం కంటే భయంకరమైంది - మరొకటి వుందా?

కలెక్టర్ కారు హారన్ కొట్టుకుంటా ఆవరణలోకి ప్రవేశించింది. జనంలో కదలిక. హడావిడి. అంతకు ముందున్న వాతావరణం హఠాత్తుగా మార్పుకు లోనైంది.

పదిన్నరకు 'డయిల్ యువర్ కలెక్టర్' ప్రోగ్రాం మొదలైంది.

మొదటి ఫోన్ కాల్ -

'సార్ మా వీధిలో ఎడమవైపు గవర్నమెంటు బడివుంది, కుడివైపు గుడి వుంది. మధ్యలో వైన్‌షాపుకు పర్మిషన్ ఇచ్చినారు. ప్రొద్దున లేచినప్పటి నుంచి తాగుబోతులు రోడ్డులోనే తాగి కొట్టుకుంటావుండారు. రోడ్లోనే అడ్డంగా పడి పోతావుండారు. ఆ షాపును అక్కడ్నుంచి మార్చండి సార్' చెప్పింది ఒకామె ఆవేదనగా కడప నుంచి.

'మంచిదమ్మ... తప్పకుండా ఆ వైన్‌షాపు మార్చమని చెప్తాను. కడపలో ఏ వీధి మీది?' అడిగాడు తన డైరీలో సమస్యను నోట్ చేసుకుంటా కలెక్టర్.

'గాంధీ నగర్ సార్!' కలెక్టర్ తల గోక్కున్నాడు.

శివారెడ్డి ఖద్దరు చొక్కా మెర్సిపోతోంది. అంకిరెడ్డి, మునిరెడ్డి, చలమారెడ్డి పక్కనున్న చెక్క బెంచిపై కూర్చోని వుండారు. కుళ్ళాయప్ప, మద్దిలేటి గోడవారన నిలబడి ఏదో మాట్లాడు కుంటున్నారు. నాగమునెమ్మ, లక్షుమ్మ, బాలమ్మలు మెట్ల దగ్గర కూర్చొనుండారు.

మధ్యాహ్నం ఒకటిన్నరకు పిలుపొచ్చింది. తుమ్మలపల్లె వాళ్ళను సార్ రమ్మంటాండని కేక. అందరూ లోపలికి పోయినారు. అధికార్లందరూ కలెక్టర్‌కు రెండువైపులా వరసగా ఆసీనులై వుండారు.

'ఏమిటి మీ సమస్య' అన్నట్లు కలెక్టర్ ఎగాదిగా చూశాడు.

శివారెడ్డి ముందుకు కదిల్నాడు. తన చేతిలోని అర్జీ కాయితం చూపించి నాడు. వెనుక చేతులు కట్టుకొని నిలబడిన స్థానికులను కూడా కలెక్టర్ చూశాడు.

కలెక్టర్ ముఖంలో రంగులు మార్తున్నాయి. అవునవును అన్నట్లు కలెక్టర్ తలాడిస్తున్నాడు. కళ్ళు టపటపటలాడిస్తున్నాడు. వెనక్కి తిరిగి పిఏని పిలిచాడు. ఏదో చెప్పాడు.

వెంట వెళ్ళిన స్థానికులందర్ని కొంచెం ముందుకు రమ్మని పిల్సినాడు కలెక్టర్. చెప్పడం మొదలు పెట్టినాడు.

“మన జిల్లాకు యురేనియం ప్రాజెక్టు వచ్చింది. ఇది చాలా ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టు. జిల్లా చేసుకున్న అదృష్టం. ప్రత్యేకంగా చెప్పాలంటే మీ పల్లె చేసుకున్న పుణ్యం. మనకు గర్వకారణం. నోటిఫికేషన్ కూడా నాల్గురోజుల కితం పేపర్లో ఇచ్చాం. మీరు కూడా చూసే వుంటారు. పేర్లు, భూముల వివరాలు కూడా వివరంగా ఇచ్చాం. ఇది మన రాష్ట్ర ముఖ్యమంత్రి గారి బంగారు కల. అందునా వారు మీ ఎమ్మెల్యే. ఈ ప్రాజెక్టుకు అనుమతి మంజూరు చేశారు. ఇది మీరు దృష్టిలో వుంచుకోవాలి. ప్రభుత్వానికి తప్పనిసరిగా సహకరించాలి. మరో వారం రోజుల్లో మీకివ్వాల్సిన నష్టపరిహారం కూడా అందజేస్తాం. మీకు ఎప్పుడు ఏమి కావాల్సినా, మీ యోగక్షేమాలు చూస్కోవడానికి మేమున్నాం. ఏ దిగులూ పెట్టుకోవద్దు. మేమే నాల్గు రోజుల్లో మీ పల్లెకు వస్తాం. మీ భూములకు నష్టపరిహారం కూడా బాగా యివ్వడానికి మా వంతుగా ప్రయత్నాలు కూడా చేస్తున్నాం. నేను చెప్పేది మీకు అర్థమౌతోంది కదా!’ నుదురుముడి వేస్తూ కలెక్టర్ ముఖం పెట్టాడు.

శివారెడ్డి ‘అట్నే సార్, మీరు ఎట్లా జెప్తే అట్లా’ అని తలాడించినాడు.

వెంట పోయినోళ్ళందరూ కూడా అట్నే ఊకొట్టినారు.

‘ఏమ్మా! నేను చెప్పింది వినపడిందా? లేదా?’ కలెక్టర్ మళ్ళీ అడిగాడు. ‘వినపడింది సార్... వినపడింది...’ చేతులు కట్టుకొని తలకాయలు ఊంచినారు. పిఏ ఏదో కాయితం తెచ్చి కలెక్టర్ కిచ్చినాడు. దాన్ని కలెక్టర్ తీసుకొని అద్దాలు పెట్టుకొని చూసినాడు. ఇదో దీన్ని మీ దగ్గర వుంచుకోండి. ఎమ్మార్వోకు కూడా చెప్తాను. గ్రామ సచివాలయంలో నోటీసు బోర్డులో తగిలించండి. చెప్పాడు కలెక్టర్.

ఏమిటా కాయితం? అదే మొన్న పేపర్లో వచ్చిన నోటిఫికేషన్. భూములు పోతున్న వారి పేర్లు, వివరాలు. శివారెడ్డి పేపర్ను కలెక్టర్ నుంచి అందుకున్నాడు.

కలెక్టర్ మరోసారి అందరి ముఖాల్ని పరిశీలనగా చూశాడు.

'మీరు నేను చెప్పేది అర్థం చేస్కోండి. మీ భూములకు మంచి నష్టపరిహారమే ఇస్తాం. దాని గురించే ఆలోచించొద్దు. త్వరలోనే ఆ డబ్బులు చెక్‌లు కూడా మీకు అందుతాయి' - చేతులు తిప్పుతా కలెక్టర్ చెప్పినాడు.

బయట క్యూలైన్లో వాళ్ళు కేకలేస్తాండరు. యింకా ఎంత సేపు మీదే పంచాయితీ. పొద్దున వచ్చినాం మేము... అని గుసగుసలాడ్తాండరు.

'యిక వెళ్ళిరావచ్చనే' చిరునవ్వును కలెక్టర్ తన పెదవులపైన చూపించాడు.

'నమస్కారం' చేస్కొని పోయినోళ్ళందరూ చమటలు తుడ్సుకుంటా బయటికొచ్చేసినారు.

కలెక్టర్ యిచ్చిన నోటిఫికేషన్ పత్రాల్ని తన చేతిలోని చిన్న లెదర్ బ్యాగ్‌లోకి మడతేసి పెట్టుకున్నాడు శివారెడ్డి. కలెక్టరేట్ పై అంతస్థులోని ఇనుప చువ్వల గేట్లలోంచి బయటికి చూస్తే ఎండ అగ్గికురుస్తాంది. ఆకాశం నుంచి నిప్పులు కురుస్తున్నట్లుగానే వుండాది.

• • •

జీపొచ్చింది. ఎమ్మార్వో టౌన్నుంచివచ్చినాడు. సర్పంచును పిలిపించినాడు. గ్రామ సచివాలయం ఆఫీసు తాళాలు తెరిపించినాడు. తన వెంట తెచ్చిన భూముల 'డ్రాఫ్ట్ డిక్లరేషన్ నోటిఫికేషన్ కాయితాల్ని బయటి గోడలకు అతికింప చేసినాడు అప్పటికప్పుడు. స్థల సేకరణ నిమిత్తం మాట్లాడేదానికి డీఆర్వో, జాయింట్ కలెక్టర్ వస్తాండరని చెప్పినాడు.

చేలల్లో, తోటల్లో, పొలాల్లోకి పనులకు పోయిన రైతుల్ని కూడా పిల్సకరమ్మని చెప్పినాడు.

బాలిరెడ్డి - మబ్బు చింతలపల్లె దిక్కు మస్తాను గాడ్ని, రాచకుంటపల్లె దిక్కు సామెలు గాడ్ని సైకిళ్ళపైన పంపించినాడు రైతుల్ని తోడుకొని రమ్మని. మిగిలినోళ్ళకు వరండాలో కూర్చొని ఫోన్లు కొట్టినాడు. దిగువ ఇండ్లలోని మద్దిలేటి దావలో కనపడితే ఊర్లో విషయం చెప్పమని చెప్పంపినాడు.

ఎమ్మార్వోకు తనకలాటగా వుండాది. లోపలికి బయటికి తిరుగుతాండడు. ఐదు నిమిషాలకొకసారి బాలిరెడ్డిని పిలుస్తాండడు.

'రచ్చబండ కాడ సాయంత్రం యురేనియం ప్రాజెక్టు భూముల విషయమై చర్చ వుండాదని' కదిరప్పను పిలిచి పలకదండోర కట్టించేందుకు పురమాయించి నాడు. వాడు పలక భుజానికి తగిలించుకొని కొడ్తా చుట్టు పక్క వుండే పల్లెల దిక్కు పోయినాడు.

రచ్చబండ మీద రెండు పెద్ద టేబుళ్ళు వేయించినారు. పది కుర్చీలు అందరి ఇండ్లల్లోయి తీసకచ్చి వేసినారు. టౌన్నుంచి కూల్‌డ్రింక్ సీసాలు తెప్పించినారు. ఏర్పాట్లన్ని జరిగిపోతాండయి.

డీఆర్వో సుమో వచ్చింది పల్లెలోకి. ఎమ్మార్వో, ఎండీవో ఎదురెళ్ళి పిల్సకచ్చినారు. ఆఫీసులో కూర్చోబెట్టినారు.

చుట్ట ప్రక్క పల్లెల్నుంచి వస్తాండే జనాన్ని రచ్చబండకు ఎదురుగా వుండే మైదానంలో కూర్చోబెడతాండరు.

డీఆర్వో ఫైల్‌లో మునిగి పోయి కాగితాలేవో తిప్పుతాండడు.

పొలాల్లో పనులకు, కూలీలకు పోయినోళ్ళందరూ ఒక్కొక్కరుగా వస్తాండరు. దూరంగా యింకా కదిరప్ప కొడ్తాండే తప్పెట దండోరా విన్పిస్తానే వుంది. ఆఫీసు వెనకాల మద్దిచెట్టు నీడలో వుండే బోరింగు కొట్టుకొని వచ్చిన పల్లె జనం నీళ్ళు తాగి దాహం తీర్చుకుంటా వుండారు. రావిచెట్టు గాలికి ఊగుతాంది.

జాయింట్ కలెక్టర్ కారొచ్చి ఆగింది. కారు దిగంగానే వేగంగా ఆఫీసులోకి వెళ్ళిపోయాడు ఆయన. బయట బాలిరెడ్డి, మద్దిలేటి, రామిరెడ్డి, నాయుడు, గౌస్ వచ్చిన జనాన్ని క్రమ పద్ధతిగా కూర్చొబెడుతున్నారు. నిశ్శబ్దంగా వుండేలా చూస్తున్నారు. టౌన్నుంచి వచ్చిన అధికారులతో కాసేపట్లోనే వేదిక నిండి

పోయింది. బాలిరెడ్డికి కూర్చోడానికి కూడా అవకాశం కలగలేదు. ఎవరూ మాట్లాడలేదు. జాయింట్ కలెక్టర్ పైకిలేచి నడుముకున్న బెల్ట్ సర్దుకొని, చేతిలోని పచ్చింకి పెన్ను జేబులో పెట్టుకుంటూ...

'అందరికీ నమస్కారం! పోయిన వారం మీ వూర్నుంచి కలెక్టరేట్‌కు కొంతమంది రైతులు వచ్చినారు. కలెక్టర్‌ను కూడా కలిసినారు. వాళ్ళందరూ మళ్ళీ పల్లె కొచ్చిన తర్వాత అక్కడ చెప్పిన విషయాలన్నీ చెప్పి వుంటారని అనుకుంటాను. మీ భూములు పోతున్నందుకు మీరేం బాధపడవలసిన అవసరం లేదు. దేశం కోసం ఎవరెవరో వారికి తోచిన సేవ చేస్తుంటారు. మీరు కూడా దేశం కోసం కొంత త్యాగం చేయవలసి వస్తోంది. ఇలాంటి అదృష్టం కూడా అందరికీ రాదు. మీకు మాత్రమే వచ్చినందుకు గర్వపడండి. ఆనందపడండి. కలెక్టర్‌గారూ కూడా మీకు ఇదే సందేశాన్ని యిమ్మని చెప్పారు.

భూమి లోపల రకరకాల గనులు వుంటాయి. బొగ్గు, బెరైటీస్, సున్నంరాయి గనులు ఎట్లా వుంటాయో యిక్కడ యురేనియం అనే ఖనిజం వుంది. దాన్ని బయటికి తీయడానికి భారత ప్రభుత్వం యిప్పుడు మీ భూముల్ని కొనుగోలు చేస్తోంది. దీనికి మీరందరూ తప్పనిసరిగా సహకరించాలి.' చెప్పుక పోతున్నాడు జాయింట్ కలెక్టర్.

'సార్! యురేనియం ఫ్యాక్టరీ వస్తే ప్రమాదమని, అణుధార్మికత వస్తుందని, నీటి కాలుష్యం, విషవాయువుల వల్ల క్యాన్సర్ వస్తుందని కొన్ని రాజకీయ పార్టీలు మొదట్నుంచి చెప్తున్నాయి. దీనికి మీరేమంటారు?' - పక్కన రాతి అరుగు మీద కూర్చొని రాసుకుంటున్న ఒక విలేకరి లేచి అడ్డు తగిలినాడు.

జాయింట్ కలెక్టర్ ఒకసారి తీక్షణంగా అతడివైపు చూశాడు. కొంత తనలో తానే సర్దుకొని -

'మీరే చెప్తున్నారు కదా బ్రదర్! రాజకీయపార్టీలు అంటున్నాయని. వాళ్ళు ఎన్ని మాటలైనా చెప్తారు. అవన్నీ వట్టి భయాలు. అపోహలు, మీ లాంటి పత్రికల వాళ్ళే ముందుకొచ్చి ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయాలి....' చెప్పాడు.

బాలిరెడ్డి - శివారెడ్డి వైపు చూశాడు. శివారెడ్డి - మద్దిలేటి దిక్కు చూశాడు. వాడ్ని చూస్కొని మిగిలిన వాళ్ళందరూ చప్పట్లు కొట్టిరి. అంతా ముందుగానే మాట్లాడుకొని వ్యూహం చేసుకున్నట్లే కనపడ్తాంది.

'మంచిదమ్మ... మీరు అలాంటి అపోహల్ని నమ్మకండి. మిమ్మల్ని ఎవరెవరో వాళ్ళ రాజకీయ ప్రలోభాల కోసం రెచ్చగొడతారు. నమ్మొద్దు. ప్రభుత్వం ఎప్పుడూ మీ వెనుక వుంటుంది. మీకే సమస్యలొచ్చినా నా దగ్గరికి రండి.

టౌన్లో ఎమ్మార్వోను కల్సండి. మీ సర్పంచుకు చెప్పండి' - గ్లాసులోని నీళ్ళు ఎత్తి గొంతులో పోసుకున్నాడు జేసీ.

'సరే... యిప్పుడు యిక్కడికి నేనెందుకు వచ్చానో, కలెక్టర్ గారు నన్నెందుకు పంపారో చెప్తాను వినండి. యురేనియం ఫ్యాక్టరీ కోసం మొత్తం రెండువేల రెండు వందల పద్దెనిమిది ఎకరాల స్థలం అవసరం అవుతోంది. ఇందులో వెయ్యిన్ని తొంభై ఎకరాలు ప్రభుత్వ స్థలం వుంది. దీన్ని ఎకరా యాభై వేలకు మేము యురేనియం సంస్థకు యిచ్చేస్తున్నాం. యిక పోతే నాల్గొందల అరవైఏడు ఎకరాలకు పట్టా భూముల రైతులు సహకరించాల్సి వుంటుంది. దానికి సంబంధించి ఏఏ రైతు భూమి, ఎన్నెన్ని ఎకరాలు తీసుకుంటున్నది డ్రాఫ్ట్ డిక్లరేషన్ మీ పంచాయితీ ఆఫీసు గోడలకు అతికించినాం. పేపరుకు కూడా వేశాం. మీకు సాగుభూమికైతే ఎకరాకు ఒక లక్షా ఎనిమిది వేలు, మెట్ట భూమికైతే ఎకరాకు ఒక లక్షా రెండువేలు చొప్పున యివ్వడానికి ముందుకొచ్చాం. అభ్యంతరాలు ఏమీ లేవని మీరందరూ లిఖిత పూర్వకంగా ఒక పేపరు మీద రాసి సంతకాలు చేసిస్తే రెండు, మూడు రోజుల్లోనే చెక్కులు యిచ్చేస్తాం. ఏమంటారు?' చేతులు కట్టుకొని ప్రశ్నించినాడు జేసీ.

విలేకరి ఏదో అడగాలనుకొని పైకి లేచి మళ్ళీ కూర్చొండి పోయాడు. మద్దిలేటితో పాటి జనాలందరూ చప్పట్లు కొట్టారు.

మీరందరూ ఇదే ఉత్సాహంతో వుండి మాకు సహకరిస్తే జిల్లా కలెక్టర్ గారి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణను మరోవారం రోజుల్లో నిర్వహించ డానికి సిద్ధపడతాం. అదే వేదికపైనే భూములిచ్చిన రైతులకు చెక్కుల పంపిణీ

కూడా చేస్తాం. చాలా సంతోషం. వుంటాను...' అని జేసీ వేదిక దిగాడు. తర్వాత ఎవరూ మాట్లాడింది లేదు. కార్యక్రమం ముగిసింది. విలేకర్లు చుట్టు ముట్టారు. ఏవేవో ప్రశ్నలు సంధిస్తున్నారు. ఆయన దేనికీ జవాబిచ్చే పరిస్థితిలో లేడు. వాళ్ళందరికీ - ఒక 'నమస్కారం' మాత్రం పెట్టాడు. కారు కదిలింది.

సాయంత్రం గూళ్లకు చేరుకున్న పక్షులు రావిచెట్టు కొమ్మల మీద నుంచి రకరకాల అరుపుల్ని విన్పిస్తున్నాయి.

● ● ●

పొద్దున్నే పదకుండున్నర బస్సుకు పల్లెలోకి ఎనిమిది మంది సభ్యుల బృందం వొకటి దిగింది. వచ్చి కట్ట మీద కూర్చున్నారు. ఆ దారిలో పోతున్న వాళ్ళను, రైతుల్ని పిల్చి తమతో పాటూ కూర్చోబెట్టుకున్నారు. తాము జిల్లా కేంద్రం నుంచి వస్తున్నామని, తమది ప్రజా సంక్షేమ హక్కుల సంఘమని చెప్పారు. యురేనియం తెచ్చే చెడు పరిణామాలను విడమర్చి చెప్పడం ప్రారంభించారు.

'అన్ని గనుల్లోంచి ముడి ఖనిజాన్ని తీసుకొని పోయినట్లు యురేనియం గనుల్లోంచి తీసుకొని పోవడం సాధ్యం కాదని, అత్యంత ప్రమాదకరమైన అణుధార్మికత వ్యాప్తి వల్ల ప్రజలందరూ అనారోగ్యాల పాలవుతారని' చెప్పారు.

'త్రవ్విన తర్వాత గని మూసివేసినా అప్పటికే వాతావరణంలో కలిసిపోయిన విషవాయువుల వల్ల ప్రజలు విపరీతమైన హానికి గురవుతారని' తాముతెచ్చిన కరపత్రాల్ని పంచుతున్నారు.

'దేశంలోని వివిధ అణుకేంద్రాల ప్రాంతాల్లోని ప్రజలు అనారోగ్యాలకు ఎలా గురికాబడుతున్నారో చూపించే కలర్ ఫోటోల ఆల్బమ్‌ను కూడా తీసి, ఆయా ప్రదేశాల గురించి క్షుణ్ణంగా' చెప్తున్నారు.

'యురేనియం ప్రభావం పదికిలోమీటర్ల నుంచి నూటాయాభై కిలోమీటర్ల వరకు ఉంటుందని, భూగర్భంలో నీళ్ళు కలుషితమౌతాయని, వ్యవసాయ బోర్లు ఎండిపోతాయని, అమెరికా, కెనడా, జపాన్ లాంటి దేశాలే యురేనియం

తవ్వకాలను నిలిపి వేయాలని భావిస్తున్న సమయంలో మన దేశంలో వీటిని చేపట్టడం అర్థంలేదని ఆందోళనకు సిద్ధం కావాలని' బృందంలోని మహిళా సభ్యులు పిలుపు నిచ్చారు.

అట్లనే దిగువ ఇండ్లలోకి కూడా వీళ్ళు కరపత్రాలు పంచుకుంటా పోయారు.

'మానవాళికి ప్రమాదకారిగా మారిన యురేనియం ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకునే దానికి ప్రజల్లో చైతన్యం తీసుకరావడానికి ప్రయత్నం చేస్తామని, యురేనియం అనర్థాలను ప్రజలకు వివరించేందుకే యిక్కడికి వచ్చామని, యురేనియం రేడియేషన్ ప్రభావం కారణంగా జీర్ణకోశ, చర్మవ్యాధులు, అంగవైకల్యంతో పాటూ క్యాన్సర్ కూడా వచ్చే ప్రమాదం వుందని, తాగునీరు - సాగునీరు కలుషితం అవుతాయని, భూములు కోల్పోయిన వారికి ఫ్యాక్టరీలో ఉద్యోగాలు ఇస్తామని సంస్థ చెప్తోందని ఇది సాధ్యం కాదని ప్రజల్ని అవగాహన పర్చి, ప్రజల పక్షాన పోరాట ఉద్యమం నడపడమే తమ లక్ష్యమని' బృందం సభ్యులు దారిలో కన్పించిన విలేకర్లకు చెప్పారు. కరపత్రాలు పంచారు. వార్త రాసుకొని విలేకర్లు టౌను దిక్కు వెళ్ళిపోయినారు.

కుళ్ళాయప్ప మామ వచ్చిన బృందానికి తాగేదానికి చల్లటి మంచినీళ్ళు యిచ్చినాడు. వేడి వేడి మిరపకాయ బజ్జీలు చేయించి పెట్టినాడు. ఇంటికాడికే శ్రీరాములు కూడా వచ్చినాడు. ఇండ్లలోకి పోయి జనాన్ని పిల్సక రమ్మని చెప్పంపినాడు చిన్న పెద్దన్నను కుళ్ళాయప్ప మామ.

పనులకు పోయినోళ్ళందరూ సాయంత్రానికి ఇండ్లకొచ్చినారు.

వాళ్ళందర్ని రాముడి గుడి వరండాలో కూర్చొబెట్టుకొని యురేనియం ఎంత హానికరమైందో వివరంగా చెప్తాండరు.

'టన్ను ముడి యురేనియాన్ని శుద్ధి చేస్తే 2.94 గ్రాముల యురేనియం మాత్రమే బయటికి తీస్తారు. రోజుకు 20 టన్నుల నుంచి 30 టన్నుల వరకు ముడి యురేనియాన్ని వెలికి తీయాలనుకుంటున్నారు. దీని వల్ల మూడుకోట్ల

టన్నుల వ్యర్థ పదార్థాలు బయటికొస్తాయి. దీనివల్ల ఏర్పడే రేడియేషన్, అణుధార్మికత వ్యాపించి వివిధ రోగాలు వస్తాయని' యాభైఐదేళ్ళ పెద్దాయన, బృందం నాయకుడు విశ్లేషణాత్మకంగా వివరించాడు.

'ప్రజల నెత్తిన కుంపటి లాంటిది ఈ యురేనియం ఫ్యాక్టరీ. ముప్పై సంవత్సరాలు యురేనియం శుద్ధి చేసి పనులు ఆపేసినా మరో వంద ఏళ్ళు ఆ ప్రభావం వుంటుందని ప్రజలు దీన్ని గుర్తించి చైతన్యవంతులు కావాలని' మరో సభ్యుడు సూచించాడు.

'మీరందరూ అధికార్లు చెప్పే అబద్దాల్ని వదిలేసి కనీసం యికనైనా కనువిప్పుతో యురేనియం ఫ్యాక్టరీ ఏర్పాట్లను అడ్డుకోవాలని, ప్రజాభిప్రాయ సేకరణలో వ్యతిరేకిస్తూ తీర్మానం చేసుకోవాలని' బృందం చివరి సారిగా తమ అభిప్రాయాన్ని ప్రకటించింది.

పల్లె నుంచి టౌనుకు పోయే ఆఖరి బస్సులో బృందం వెళ్ళిపోయింది. దిగువ ఇండ్లలోని వాళ్ళు బస్సు దగ్గరికి పోయి ఎక్కించి వచ్చారు.

భోజనాలు అయినాంక మిద్దెపైకెక్కినారు చాపలు, దిండ్లు తీసుకొని వెంకటేశు కుటుంబం. పడుకున్న తర్వాత వెంకటేశు కొడుకు ఐదవ తరగతి చదివే సాంబుడు ఒక ప్రశ్న వేసినాడు.

'నాయనా... యిందాక వాళ్ళందరూ చెప్పిన యురేనియం అనేది మన భూముల్లోనే ఎందుకు పడింది?' అని అడిగినాడు. ఆకాశంలో నక్షత్రాలు మినుకు మినకు మంటూ మెరుస్తాండయి. కొడుకు అడిగిన ప్రశ్నకు వెంకటేశు గుండెల్లో రాయి పడినట్లైంది. ప్రశ్న వుంది. దానికి జవాబు తన దగ్గర లేదు. తన భూమి కూడా ఎకరంన్నర ప్రాజెక్టు కిందికి పోతాంది. కొడుకు సాంబుడు యిడ్సి పెట్టేట్టులేడు. భుజం పట్టి తట్టి తట్టి అడుగుతున్నాడు.

'ఏంటికి మన భూముల్లో పడిందంటే మీ నాయన ఏం జెప్తాడు... దేవుడిచ్చినాడు!' యింగ నువ్వు పండుకో అని సాంబుడ్ని తన దగ్గరికి లాక్కొని జోకొట్టడం మొదలు పెట్టింది.

వెంకటేశుకు తలనిండా ఏవేవో ఆలోచనలు. నిద్రపట్టడం లేదు. ఆకాశాన్ని తను చూస్తున్నాడా? తనని ఆకాశం చూస్తుందా?

● ● ●

ప్రజాభిప్రాయ సేకరణ కోసం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినారు. వారం రోజుల్నుంచి జిల్లా అధికార యంత్రాంగం అంతా తుమ్మలపల్లెలోనే మకాం వేసింది. చుట్టు ప్రక్క పల్లెల్లోకి ఒకరు పోతే మరొకరు ప్రజా సంఘాలు, హక్కుల సంఘాలు, పర్యావరణ ఉద్యమకారులు తిరుగుతూనే వున్నారు. ప్రజలకు యురేనియం అనర్థాల గురించి వివరంగా చెప్తున్నారు.

వాళ్ళమాటల్ని ఒక చెవితో విని యింకోచెవితో వదిలిపెట్టండి అని అధికార్లు తేల్చిపారేస్తున్నారు. సర్పంచు బాలిరెడ్డికి నిమిషం కూడా ఖాళీ సమయం లేకుండా వుండాది. ఎంపీ సారు పిలిపించినాడు. వెంటనే టౌనుకు పోయి కలిసినాడు. ఆయన నవ్వినాడు. కుర్చోబెట్టినాడు.

'నేను హైద్రాబాదుకు పోయినప్పుడు ఈ యురేనియం ప్రాజెక్టు గురించి పెద్దాయన్తో మాట్లాడినా బాలిరెడ్డి... పల్లెలో ఎవరెవరో ప్రజా సంఘాలోళ్ళు, ప్రతిపక్ష రాజకీయ పార్టీలోళ్ళు దీన్ని అడ్డుకోవాలని చూస్తాండరంట. మన పార్టీ వాళ్ళందర్ని తీసుకపో... మీ పల్లెలోనే పెట్టుకో. నీకు తోడుగా చిన్నాయనను పంపిస్తా. మన నియోజకవర్గంలో వాళ్ళ పెత్తనం ఏందంట? తమాషాలు పడ్తాండరంటనా? పోలీసులకు కూడా ఫోన్ చేసి చెప్పినా...

చుట్టుపక్క పల్లెల్లోని మనోళ్ళందరితో మీటింగు పెట్టుకోండి. ఎట్లా చేయాలో మాట్లాడుకోండి. ఏదైనా సమస్యంటే నాకు ఫోన్ చేయండి. కలెక్టర్ కూడా నిన్న ఇదే విషయం మీద నాకు ఫోన్ చేసినాడు. రెండ్రోజుల్లో మీ వూర్లోనే ప్రజాభిప్రాయ సేకరణ సభను కలెక్టర్ అధ్యక్షతన పెడ్తా వుండారు. మనోళ్ళందరూ దగ్గరుండి విజయవంతం చేయండి. కార్యకర్తల్ని పిల్సకపోండి. వాళ్ళే అంతా చూస్కుంటారు. ఏమంటావ్?' కళ్ళు ఎగరేసినాడు ఎంపీ.

పార్టీ ఆఫీసులో ఆయన ఎదురుగా కుర్చోబెట్టుకొని యింతసేపు మాట్లాడింది ఎప్పుడూ లేదు. తనెంత... కేవలం ఒక వూరి సర్పంచ్! బాలిరెడ్డికి ధైర్యమొచ్చింది. వంద ఏనుగుల బలం. పెద్దోళ్ళే రంగంలోకి దిగినారు. తనకింకేం కావాలి? అన్ని ఏర్పాట్లు పూర్తయ్యిపోయాయి. అనుకున్నట్లుగానే రెండ్రోజుల్లో తుమ్మలపల్లె సరిహద్దులోని మైదానంలో కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ సభ ప్రారంభమైంది. జిల్లా కేంద్రం నుంచి వివిధ ప్రజా సంఘాలు, మానవ హక్కుల సంఘాలు, పర్యావరణ ఉద్యమకారులు, ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు, అధికార పార్టీ కార్యకర్తలతో సభా ప్రాంగణం కిక్కిరిసి పోయింది. చుట్టు ప్రక్కనున్న భూమయ్యగారిపల్లె, రాచకుంటపల్లె, మబ్బుచింతలపల్లె, కె.కె. కొట్టాల, తుమ్మలపల్లె ప్రజలందరూ పాల్గొన్నారు.

జేబులకు నల్ల రిబ్బన్ బ్యాడ్జిలతో, నల్లజెండాలతో నినాదాలతో నిరసనలు వ్యక్తం చేస్తున్నారు - ప్రజా సంఘాల వారు.

వేదికపైనున్న జిల్లా స్థాయి అధికార్లు, కలెక్టర్ పోలీసులకు సూచన చేశారు. కేకలేస్తున్న వాళ్ళను ప్రాంగణం నుంచి బయటికి తీసుకెళ్తున్నారు... బలవంతంగా!

'యురేనియం వ్యతిరేక ఉద్యమం' పేరుతో ప్రచురించిన పోస్టర్లు పైకెత్తి ప్రదర్శిస్తున్న వారిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నల్లజెండాల్ని చేతుల్లోంచి లాక్కొని ఒక చోట కుప్పగా పోస్తున్నారు.

కలెక్టర్ పైకి లేచి మైక్ తీసుకున్నాడు. ఎవరో 'డౌన్ డౌన్' అనే నినాదాలు ఇస్తున్నారు. అతడ్ని చూస్కొని మరికొందరు పైకిలేచి పిడికిళ్ళు బిగించి నినాదాలు యిస్తున్నారు. సభ గందరగోళంగా వుంది. స్థానిక ప్రజలు వీళ్ళ మధ్యలో ఎక్కడో ముడుక్కొని జరుగుతున్నదంతా చూస్తున్నారు - బిక్కు బిక్కు మంటూ!

'నమస్కారం. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రెవిన్యూ అధికారులు రెండు వేలరెండువందల పద్దెనిమిది ఎకరాల సేకరణ ప్రారంభించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు యాభైవేలతో వెయ్యిన్ని తొంభై ఎకరాలను ప్రభుత్వ భూమిని యిచ్చేస్తోంది.'

కరపత్రాల్ని ఎవరో వేదిక వైపుకు విసిరేశారు. అవి గాల్లో ఎగురుతున్నాయి. కలెక్టర్ చేతిరుమాలు జేబులోంచి తీసిముఖం తుడుచుకున్నాడు.

'ప్రపంచంలోనే అతిపెద్ద యురేనియం ప్రాజెక్టు మన జిల్లాలో పెట్టడం గర్వకారణం' కలెక్టర్ అంటుండగానే వెనుక ప్లాస్టిక్ కుర్చీని ఎవరో విసిరేశారు. ఇంకొకరు నేలకేసి కొట్టారు. మరో ఇద్దరూ అదే పని చేశారు. పోలీసులు దూసుకొచ్చి వాళ్ళందర్నీ మెడపట్టి బయటికి లాక్కుపోయారు.

ప్రజా సంఘాల కార్యకర్తలు కుర్చీలోంచి కిందకూర్చొని నినాదాలు ఇస్తూ కలెక్టర్ ప్రసంగాన్ని అడుగడుగునా అడ్డుకుంటున్నారు.

'యురేనియం వెలికితీతకు సంబంధించి నాల్గువందల అరవై కోట్లతో పనులకు ఈ నెలలోనే టెండర్లను సంస్థ కోరుతోంది' - కలెక్టర్ ప్రసంగం మరోసారి ఆగింది.

మళ్ళీ నాల్గు పాస్టిక్ కుర్చీలు పైకెత్తి విసిరేశారు. 'యురేనియం ప్రాజెక్టును అడ్డుకుంటాం' అనే నినాదాల హోరు.

'మబ్బుచింతలపల్లె మలుపు నుంచి కొండ ప్రాంతం మీదుగా తవ్వకాలు జరిపే బ్లాస్టింగ్ ప్రదేశం రెండువేల రెండొందల నలభై ఎకరాల యురేనియం భూములకు చుట్టూ ఇనుపకంచె ఏర్పాటుకు 10 కోట్లతో టెండర్లు పూర్తయ్యాయి' అని కలెక్టర్ చెప్తుండగానే ఎవరో రాయి ఒకటి వేదికపైకి బలంగా విసిరారు.

మరొక రాయి. ఇంకొక రాయి. కలెక్టర్ కుర్చుండి పోయాడు. పోలీసులు అందరూ సమావేశం స్థలంలోకి వచ్చేశారు. లాఠీ చార్జీ మొదలైంది. అందరూ పరుగులు పెడ్తూ బయటికి వెళ్ళిపోతున్నారు. చిక్కినోళ్ళందరికి పోలీసులు తమ బలమెంతో చూపిస్తున్నారు.

నల్లబ్యాడ్జిలతో వచ్చిన వాళ్ళందర్నీ వెతికి వెతికి బయటికి ఈడ్చుక పోయారు. బూట్ల కాళ్ళతో తన్నారు. ఏడుపులు, పెడబొబ్బలు, హాహాకారాలతో సభా స్థలి దద్దరిల్లిపోయింది.

పోలీసుల వలయంలో జిల్లా అధికారులు, కలెక్టర్ వాహనాల వద్దకు చేరుకున్నారు.

'యురేనియం ప్రాజెక్టుకు తమకెలాంటి అభ్యంతరం లేదని చుట్టుప్రక్క ఐదువూర్లోని వాళ్ళు రాసి, సంతకాలు చేసిచ్చిన కాగితాల్ని' సర్పంచు బాలిరెడ్డి కలెక్టర్‌కు అందజేసినాడు. కార్లో కూర్చొని కలెక్టర్ షేక్‌హ్యాండ్ ఇచ్చినాడు. 'అభిప్రాయ సేకరణ' విజయవంతంగా ముగిసింది. కారు దుమ్మురేపుకుంటా ముందుకు కదిలి పోయింది.

❖ ❖ ❖

కలెక్టర్ నివేదిక తయారు చేస్తున్నాడు. నల్లరాతి గుట్టల చుట్టూ ప్రక్కలవున్న పల్లెలు - తుమ్మల పల్లె, రాచకుంటపల్లె, మబ్బుచింతలపల్లె, భూమయ్యగారిపల్లెల్లోని ప్రజలు ప్రజాభిప్రాయా సేకరణలో పాల్గొన్నారు. ప్రతిష్టాత్మకమైన యురేనియం ప్రాజెక్టు ఏర్పాటుకు తమకెటువంటి అభ్యంతరం లేదని లిఖితపూర్వకంగా రాసి సంతకాలు చేసిచ్చారు. అంతా సవ్యంగా వుంది.

యిక మీరు ముందుకెళ్ళి పోవచ్చు. అడ్డంకులు ఏవీ లేవు. మున్ముందు కూడా రావు. అంటూ 'క్లియరెన్స్ సర్టిఫికెట్' తయారైంది. అధికార రాజముద్ర పడింది. నివేదిక సాయంత్రానికే కేంద్రానికి పంపబడింది.

మర్నాడు జిల్లా కలెక్టరేట్ ఎదురుగా ధర్నాకు దిగారు ఐక్య ఉద్యమ కార్యాచరణ కమిటీ వాళ్ళు.

యురేనియం ప్రాజెక్టు దగ్గర నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ ఒక బూటకం. అసలక్కడ ఏం జరిగింది? ఎవరు అంగీకరించారు?

పోలీసుల జులంతో, లాఠీఛార్జీలతో ఆడ-మగ అనే తేడా లేకుండా అందరిపైన దాడులు చేశారు. అక్రమ అరెస్టులు చేశారు. ప్రజల హాహాకారాల్ని లెక్కచేయలేదు. ఇది దారుణం. దీన్ని వ్యతిరేకిస్తున్నాం. అంటూ మీడియా ముందు తమ ఆక్రోషాన్ని వెల్లగక్కారు. పోస్టర్లు విడుదల చేశారు. బ్యానర్లు కట్టారు.

ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి సన్నాహాలు మొదలయ్యాయి. యురేనియం సంస్థ సీఎండీ, ఛైర్మన్, డైరక్టర్, మెంబర్స్ మరోసారి ముఖ్యమంత్రి కార్యాలయంలో సమావేశమయ్యారు.

కలెక్టర్ అత్యంత వేగంగా స్పందిస్తూ నివేదిక 'క్లియెరెన్స్ సర్టిఫికెట్' పంపిన విషయంతో పాటూ ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా చోటుచేసుకున్న హింస గురించి కూడా మాట్లాడుకున్నారు.

ఐక్య కార్యాచరణ కమిటీ పేరుతో ప్రజాసంఘాలు, హక్కుల సంఘాలు, పర్యావరణ ఉద్యమకారులు చేస్తున్న ధర్నాలు, ర్యాలీలు, గోడలకు అతికిస్తున్న పోస్టర్లు, బ్యానర్లు, పంచుతున్న కరపత్రాలు వీటన్నింటి గురించి కూడా చర్చించారు.

ప్రధానమంత్రి కార్యాలయం ఎప్పటికప్పుడు జరుగుతున్న పరిణామాలన్నింటిని తెలుసుకుంటూనే వుంది. కేంద్ర హోం శాఖ జిల్లా ఎస్పీ నుంచి అక్కడ జరిగే వ్యతిరేక పోరాటాల గురించి నివేదికలు తెప్పించుకుంటూనే వుందనే విషయాలు సంస్థ సభ్యులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళారు.

కాఫీ వచ్చింది. మెరుస్తున్న తెల్లటి పింగాణీ కప్పులు. ప్రక్కనున్న టీవీలో ఆగకుండా వస్తున్న వార్తలు. ఎదురుగా గోడకున్న జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటం.

'నిజం చెప్పాలంటే మీరుండబట్టే అక్కడ ఫ్యాక్టరీ ఏర్పాటుకు యింత త్వరగా సిద్ధపడగలిగాం. లేకుంటే యింకా చాలా అవరోధాలు, అడ్డంకుల్ని స్థానికంగా ఎదుర్కొనవలసి వచ్చేది. ' కాఫీ అందుకుంటూ సీఎండీ అన్నాడు.

ముఖ్యమంత్రి చిన్నగా నవ్వాడు.

'అవును. ప్రత్యేకించి అది మీ సొంత నియోజకవర్గం కాబట్టి యిదంతా సాధ్యమైంది. లేదంటే రాజకీయ పరంగా కూడా మేము వ్యతిరేకత ఎదుర్కోవలసి వచ్చేది' మద్దతుగా చెప్పాడు డైరక్టర్.

'వచ్చే నెలలో ఒక రోజు మీ చేత ప్రాజెక్టును ప్రారంభింప చేయాలని సంస్థ భావిస్తోంది. దీనికి మీరు అంగీకరించాలి'- పూర్తయిన కాఫీ కప్పును కింద పెట్టాడు ఛైర్మన్.

'నాదేముంది. మీరు ఆలోచించుకోండి. నన్ను రమ్మంటే నాకేం అభ్యంతరం లేదు. సెంట్రల్ న్నుంచి ఎవరైనా మినిస్టర్ వస్తారేమో చూస్కోండి. బాగుంటుంది' తన మాటగా చెప్పాడు ముఖ్యమంత్రి.

'స్థానికంగా లేని పోని గొడవలు జరుగుతాయి. ప్రతిపక్ష రాజకీయ పార్టీల ఆందోళనలు చూడాల్సి వుంటుంది. అన్నీ ఆలోచించిన తర్వాతే మీరైతే ఏ సమస్యలుండవని మేము ఒక నిర్ణయానికి వచ్చాం' కొంత ముందుకు జరిగి చెప్పాడు ఛైర్మన్.

'మీ ఇష్టం. ఏర్పాట్లు చూస్కోండి' - గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడు సిఎం. సమావేశం ముగిసింది.

• • •

యురేనియం ప్రాజెక్టు కోసం భూములు పోయినోళ్ళందరికీ గవర్నమెంటు నుంచి చెక్‌లు వచ్చాయి. దాని పంపిణీ కోసం డీఆర్వో వస్తున్నాడు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల దగ్గరికి పేర్లుండేవాల్లందర్నీ రమ్మని చెప్పంపించారు.

'ఏమంటావురా వెంకటేశు... పోయిన భూమికి లెక్కలిస్తాండరంట. తీసుకుందామా? వద్దా?' ఇంట్లో నులక మంచం పైన కూర్చొని కేకేసినాడు సంజీవుడు.

'నాకేం తెల్సు...న్నా! పెద్దోడివి నువ్వే చెప్పాలా... యిప్పుడు లెక్క తీస్కోకుంటే మళ్ళా రొంత పెంచి యిస్తారేమో ఆలోచన చెయ్యి...' లోగా ఇంట్లోంచే జవాబిచ్చినాడు వెంకటేశు.

ఇద్దరివీ ఎదురెదురు ఇండ్లు.

'వచ్చిన లెక్కలు వెనక్కిపోతే దాన్ల కోసం మళ్ళా టౌన్లో ఆఫీసర్ల చుట్టికారం ఎన్ని నెలలు తిరగాలో అది కూడా చూస్కోళ్ళి'... హెచ్చరిస్తా చెప్పింది సంజీవుడి పెండ్లాం ఓబుళమ్మ.

'ఏం వెంకటేశు... వింటా వుండావా? మీ అక్క ఏందో చెప్తాంది!' సంజీవుడు మళ్ళీ కేకేసినాడు.

'ఔ...న్నా! అక్క చెప్తాండేది గూడా నిజమే. వచ్చిన లెక్క ఎనక్కి పోతే ఆనాకొడుకుల చుట్టికారం తిరిగి తిరిగి చావాల...' నవ్వుకుంటా బయటికొచ్చినాడు వెంకటేశు.

'మీకు మీరే పెద్దోళ్ళ తిన్నా వుండారే. ఆ ఎగువ ఇండ్లలో కట్ట కాడికి పోతే వాళ్ళందరూ ఏం మాట్లాడు కుంటా వుండారో ఏం ఆలోచనలు జేస్తాండరో తెలుస్తాది. ముందు కనుక్కో పోండి...' బయట వసారాలో అరుగు మీద పండుకొని వుండే సంజీవుడి తల్లి శ్యామలమ్మ సలహా ఇచ్చింది.

'సంజీవన్న...' అమ్మ జెప్తాండేది బాగుంది గానీ. లెయ్ ఎగువ ఇండ్ల దిక్కు కట్ట కాడికిపోదాం...' కడ్డీకి తగిలించిన చొక్కా తొడుక్కున్నాడు వెంకటేశు.

ఓబుళమ్మ తెచ్చిచ్చిన చొక్కా తొడుక్కుంటా బయటికి కదిల్నాడు సంజీవుడు కూడా.

సందులో బండ మోట్లో రాయి దగ్గర నిలబడి బట్టలు ఉతుకుతాండే సుబ్బమ్మ కాసేపు ఆగింది వీళ్ళ మీద నీళ్ళు పడ్తాయని.

వాళ్ళు దాటుకున్నారు.

ఎదురుగా కుళ్ళాయప్ప మామ. అరటిచెట్ల తోటలోంచి బయటికొస్తా... 'లెక్క తెచ్చుకోను పోతాండరా!' - పలకరించినాడు. 'పోదాం పా... మామ' - వెంకటేశు. 'పొళ్ళి... పొళ్ళి... ఇంటికాడికి పోయి పయ్యి మీద రోన్ని నీళ్ళు పోసుకొని వస్తా' - హడావిడిగా వెళ్ళిపోయాడు.

ఎగువిండ్ల దగ్గర కట్ట పైన ఎవరూ కన్పించలేదు. అట్నే పైకి మట్టి దారెంబడి మాట్లాడుకుంటా ఇద్దరూ పోతున్నారు.

దూరంగా హైస్కూలు దగ్గర రెండు జీపులు ఆగివుండాయి. ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తాంది హారన్ కొట్టుకుంటా. బడి దగ్గర ఆగింది. కొంతమంది దిగారు.

రోడ్డు వారకు జర్కున్నారు. అది ఎర్రదుమ్ము రేపుకుంటా పల్లె దిక్కు పోయింది.

బడి గేటు తెరిచి వుంది. లోపల స్టేజి మీద టేబుల్ వేసుకొని ఆఫీసర్లు కూర్చొని వుండారు. పల్లె జనమంతా ఎక్కడా చూసినా గుంపులు గుంపులుగా చేరి మాట్లాడుకుంటున్నారు.

'న్నో... సంజీవన్న... మన పల్లోలందరూ ఇడ్నే వుండాం. ఇట్రండి...' చేయిపైకెత్తి పిల్సినాడు చిన్నపెద్దన్న. ఆవైపుకే పోయినారు.

'ఏమంట్ర సామీ... ఎవరెవరికి లెక్కలొచ్చినాయి. ఎంతెంత ఇస్తాండరు' జారిపోతాండే గళ్ళలుంగీ పైకి ఎగదోసుకుంటూ అడిగినాడు వెంకటేశు.

'యింగా డీఆర్వో సారు రాలేదు లేన్నా... సారుకోసమే చూపెట్టుకొని వుండాం' - పక్కనున్న గుర్రప్ప ఆవలిస్తా చెప్పినాడు.

రెండవ శనివారం కాబట్టి హైస్కూలుకు సెలవిచ్చినారు. పిల్లోళ్ళు ఎవరూ లేకపోవడంతో బడి బోసిపోయి కన్పిస్తాంది. బడి వెనకుండే మైదానంలో క్రికెట్ ఆడ్తాండే పిల్లోళ్ళ కేకలు అప్పుడప్పుడూ విన్పిస్తున్నాయి.

'సర్పంచయ్య వచ్చినాడా... ఏడి... కనపడ్డం లేదే...' కళ్ళతోనే చుట్టూ వెతుకుతా అడిగినాడు సంజీవుడు.

'వచ్చేవారం హైద్రాబాదు కాన్నుంచి ముఖ్యమంత్రి సారు వస్తాండడంట. మనూర్లోనే కార్యక్రమం ఏందో పెడ్తాండరంట. ఎంపీ సారు కాన్నుంచి ఫోనొస్తే టౌనుకు పొద్దున్నే పోయినాడు' - జేబులోని పొద్దు తిరుగుడు విత్తనాలు తీసి, చేతిలోకి వేసుకొని కొరుక్కొని తింటా చెప్పినాడు రామాంజి.

'వస్తాడా... రాడా... యిప్పుడు?' - సంజీవుడు.

'లెక్కిస్తాంటే రాకుండా అయప్ప ఏంటికి వుంటాడు. ఆయన ప్రాణమంతా ఈడ్నే కొట్టుకుంటా వుంటాది' - రామాంజి.

మాటల్లో వుండగానే కారు బడి గేట్లోంచి లోపలికి దూసుకొచ్చింది. డీఆర్వో సారొచ్చినాడు. స్టేజి మీదుండే ఎమ్మార్వో, ఎండీవో ఎదురీకి స్వాగతం పలికే దానికి పోయిరి.

డీఆర్వో నాల్గు కాయితాలు తీసిచ్చినాడు. దాన్లను బయట బడి గోడలకు అతికించమన్నాడు. పట్టా భూముల్లో రెండొందల యాభై ఎకరాలకు ఇప్పుడు నష్టపరిహారం మంజూరైంది. మిగతా వాళ్ళకు రెండవ విడత మరో పదిరోజుల్లో యిస్తారు. అని చెప్తాండడు డీఆర్వో.

ఇప్పుడు మంజూరైన వాళ్ళ పేర్లు గోడకి అతికించినారు. వచ్చినోళ్ళందరూ ఎగబడినారు.

వాళ్ళ పేర్లు వుండాయా? లేవా? తెలుసుకోవాలనే ఆరాటం. తోసుకుంటా, ఒకరి మీద ఒకరు పడ్తా పేర్లు వెతుక్కున్నారు.

పేర్లు వుండాయని తెల్సుకున్నోళ్ళు స్టేజి మీదుండే డీఆర్వోను కలుస్తాండరు.

రికార్డుల్లో పేర్లు రాసుకొని, దాన్లకు ఎదురుగా ఒక్కొక్కరితో సంతకాలు, వేలిముద్రలు వేయించుకొని చెక్కులిచ్చేసినారు.

యింతలో సర్పంచు బాలిరెడ్డి కూడా వచ్చేసినాడు. చెక్కుల కోసం గుంపులుగా మీద పడకుండా వరసగా నిలబడి ఒకరి తర్వాత ఒకరు తీసుకోవాలని ఎమ్మార్వో అరుస్తాండడు.

ఆయన మాట ఎవరింటాండరు? అట్లా తోసుకుంటానే పేర్లుంటే టోళ్ళందరూ పని ముగించుకున్నారు.

వీరయ్యతాత డికేటి భూమి ప్రాజెక్టు కిందికి పోయింది. ఆయప్పకు యాభైవేలు వచ్చినాయి. కళ్ళ కద్దుకొని తీసుకున్నాడు. గౌస్‌కు తూర్పు దిక్కున ఎకరా పాత తోట వున్నింది. నిమ్మచెట్లు పెట్టి వున్నాడు. సగం బతికినాయి.

సగం పోయినాయి. ఆ తోటకు లక్షా నలభైవేలు వచ్చినాయి. సంజీవుడికి నల్లరాతిగట్ట దిగదాల మెట్టభూమి ఎకరా పోయింది. ఒక లక్షా ఇరవై వేలు దక్కింది.

వెంకటేశు కు ఈ దఫా రాలేదు. వచ్చినోళ్ళ ముఖాలన్నీ వెలిగి పోతాండయి. రానోళ్ళు తిట్టుకుంటా, ముఖాలన్నీ ముడ్సుకొని ఇంటిదావ పడ్తాండరు.

పొలం పనులకు పోయిన రైతులు కూడా జాబితాలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వుంటే బడి లోపలికి వస్తున్నారు. లేకుంటే అట్నుంచి అటే వెళ్ళిపోతున్నారు.

కుళ్ళాయప్ప మామ స్నానం చేసుకొని కొత్త రంగుల చొక్కా తొడుక్కొని దసరాబుల్లోడు లాగా మోటర్‌బైకు మీదొచ్చినాడు. లిస్ట్‌లో పేరు లేదు. బండి చెట్టు కింద నిలబెట్టినాడు. 'వార్ని... ఇదేందిరా... సామీ... మాకెప్పుడిస్తారంటా' అనుకుంటా ఆఫీసర్లను కలిసేదానికి లోపలికి పోయినాడు. పదిరోజుల్లో యిస్తామని వాళ్ళు చెప్తాండరు. ఈ మామ ఆన్నాన్నే తిరుగుతాండడు. బాలిరెడ్డిని పక్కికి పిల్సి చెవిలో మాట్లాడినాడు.

'ల్యా! శానామందికి మన పల్లెలో వాళ్ళకు రాల్యా... పది రోజుల్లో మళ్ళా యిస్తారంట' భుజం తడ్తా సున్నితంగా చెప్పినాడు బాలిరెడ్డి. 'అట్నే అట్నే లెమ్మని' తల తిప్పుతూ కుళ్ళాయప్పమామ పెదాలు కొరుక్కుంటా బయటికొచ్చినాడు. నడ్సుకుంటా పోతాండే తిరుమలయ్యను వెనక ఎక్కించుకొని దిగువిండ్ల దిక్కు పోయినాడు.

గ్రౌండ్లో పిల్లోడు కొట్టిన క్రికెట్ బంతి బడిపైన పడి ఆన్నుంచి దొర్లుకుంటా రోడ్లో కొచ్చి పడింది. పిల్లోళ్ళు కేకలేస్తాండరు గట్టిగా.

• • •

యురేనియం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి వస్తున్నారు. భద్రతా కారణాల రీత్యా ఎవరికీ ప్రవేశం లేదు. కొంతమంది అధికార్లకు, పార్టీ సభ్యులకు తప్ప మిగిలినవారికి అనుమతి లేదని తేల్చి చెప్పారు. ఫ్యాక్టరీ చుట్టూ

ముళ్ళ ఇనుపకంచె ఏర్పాటైంది. బయట పొడవైన, ఎత్తుటి బోర్డు కూడా శాశ్వతంగా వుండేలా ఏర్పాటు చేశారు. 'నిషేధించబడిన ప్రాంతము. అనుమతి లేదు' అని పటిష్టమైన ప్రహరీ గోడ ప్రాజెక్టు చుట్టూ నిర్మితమైంది. యూనిఫాం ధరించి కాపలా కాసే జవాన్లు. లోపలికి రావడానికి, బయటికి పోవడానికి రెండు దారులకు రెండు పొడవైన ఇనుపగేట్లతో ప్రాజెక్టు ప్రవేశద్వారం.

'వెయ్యిన్ని నూటాఆరు కోట్లతో నిర్మితం చేస్తున్న యురేనియం ప్రాజెక్టును ప్రారంభించడానికి ముఖ్యమంత్రి వస్తుంటే ఎవరికీ ఆహ్వానాలు లేకుండా యింత రహస్యంగా ఎందుకు ఏర్పాట్లు చేస్తున్నారు?'

ప్రశ్నించాయి ప్రజాసంఘాలు, ఎవరిస్తారు సమాధానం?

నిన్న ఉదయం పల్లెలోకి ప్రజా సంఘాల నాయకులొచ్చారు. చుట్టు ప్రక్క ఐదు గ్రామాల ప్రజల్ని రమ్మని చెప్పంపించారు. ప్రాజెక్టు పరిధిలో భూములు కోల్పోయిన రైతుల్ని పిలిపించారు. ముఖ్యమంత్రి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

పల్లె జనం వచ్చారు. రావిచెట్టు కింద కూర్చొబెట్టారు. ప్రజాభిప్రాయ సేకరణ సభ జరిగిన విధానం నుంచి ఇప్పటి వరకు ఉన్న పరిస్థితుల్ని సమీక్షించారు. తెల్లగడ్డంతో, ఎత్తుగా సన్నగా వున్న ప్రజాసంఘ నేత వేదికపై నుంచి మాట్లాడడం మొదలు పెట్టినాడు...

'రెండ్రోజుల్లో యురేనియం ప్రాజెక్టును ప్రారంభించడానికి ముఖ్యమంత్రి గారు యిక్కడికి వస్తున్నారు. హానికరమైన ఈ ప్రాజెక్టును మనం మొదట నుంచి వ్యతిరేకిస్తూ వస్తున్నాం. దీన్ని వాళ్ళు పట్టించుకోలేదు. కనీసం భూములు కోల్పోయిన నిర్వాసితులకైనా నష్టపరిహారం ఎక్కువ యివ్వాలని పిలుపునిచ్చాం. దాన్ని వాళ్ళు పరిగణించలేదు. ఇలా వుంది మన వ్యవస్థ. ఆర్.అర్. పాలసీ అనేది ఒకటుంది. 'రిహాబిలిటేషన్ - రీసెటిల్‌మెంట్'. దీని ప్రకారం ప్రాజెక్టు ఫ్యాక్టరీలో మీకు ఉద్యోగాలు ఇవ్వాల్సి వుంటుంది. కనీసం దీనినైనా మీరు సాధించుకోవాలి... 'ఏమంటారు?' ప్రశ్నించాడు అతను.

'ఔను ఔను...' అని కేకలేస్తా జనం చప్పట్లు కొట్టారు.

'భూమి తీసుకున్యారు. లెక్క యిచ్చినారు. ఆరోంత లెక్క అయిపోయి నాంక మేం య్యాడికి పోయి బతకాల సామి... ఏందో ఇంట్లో చదువుకున్య పిల్లోడు వుంటాడు. వాడికి ఉద్యోగం యిస్తే మా జీవితం యిట్నే ముసలి మొబ్బున గడ్సిపోతాది...' పైకిలేచి కళ్ళల్లో కన్నీళ్ళతో చెప్పుకుంది సుబ్బమ్మవ్వ.

'అదే అవ్వ... నేను చెప్తాండేది. ఎంపీకీ, కలెక్టర్‌కు అర్జీ కాయితాలు యివ్వండి. ముఖ్యమంత్రికి చెప్పండి. ప్రారంభోత్సవానికి వచ్చేరోజు మీరందరందరూ అడ్డుకోండి. నిలదీయండి. మీకు రావాల్సినవి మీరే సాధించుకోవాల...' మరింత ఉత్సహంగా నేత చెప్తునే వున్నాడు.

పల్లెజనంకు అర్థమైంది. పోరాటానికి సిద్ధమైనారు.

అర్జీ కాయితాలు తయారైపోయినాయి. ముఖ్యమంత్రి పర్యటనకు ముందు రోజు భూములు పోయిన మిగిలిన వాళ్ళందరికీ కబురొచ్చింది. డీఆర్వో చెక్కులు తీసుకొని వస్తున్నాడని, గ్రామ సచివాలయం దగ్గర చెక్కులు పంపిణీ కార్యక్రమం పూర్తయ్యింది.

'నష్టపరిహారం సంగతి సరే సార్! ఫ్యాక్టరీలో పిల్లోళ్ళకు ఉద్యోగాలు ఎట్ల...' అడిగినారు మిగిలినోళ్ళు.

'అది నా చేతిలో లేదు. కలెక్టర్నొచ్చి కల్సమని' చెప్పినాడు డీఆర్వో... తప్పించుకుంటా!

'యురేనియం ప్రాజెక్టు పరిధిలోకి వచ్చిన నాల్గొందల అరవై ఏడు ఎకరాలకు సంబంధించి పట్టా భూములకు నష్టపరిహారం యివ్వడం పూర్తయ్యింది' అని ఒక్కమాట విలేకర్లకు చెప్పి అన్నుంచి డీఆర్వో దాటుకున్నాడు.

తెల్లారితే ముఖ్యమంత్రి కార్యక్రమం. ప్రతిష్టాత్మకమైన యురేనియం ప్రాజెక్టు ప్రారంభోత్సవం. ఏర్పాట్లు ఫ్యాక్టరీలోపల ఏం జరుగుతున్నాయో, ఎలా జరుగుతున్నాయో బయట ఎవరికీ తెలియవు.

‘భూమిపూజ’ చేసిపోతాడు. ఫ్యాక్టరీ ప్రారంభించాలంటే మిషనరీ యింకా రావలసివుంది. దానికి ఐదారేళ్ళు పడ్తుంది. అంతవరకు యురేనియం ఉత్పత్తి సాధ్యం కాదని’ ఎంపీ పార్టీ ఆఫీసు దగ్గర చెప్పుకుంటున్నారు.

ఉదయాన్నే పదిగంటలకు పులిందలన్నుంచి సీఎం కాన్వాయి కదిలింది. దారి పొడవునా రోడ్డు కిరువైపులా పోలీసులు.

ప్రజా సంఘాలు బ్యానర్లు కట్టుకొని అక్కడక్కడ నిరసన వ్యక్తం చేశాయి.

ఎర్రటి మట్టిరోడ్లు. దుమ్ము తెరలు తెరలుగా చుట్టుకుంటోంది. వాహనాలు ఒకదాని వెనక ఒకటి రయ్‌మంటూ ముందుకు సాగిపోతున్నాయి.

బెస్తపల్లి దగ్గర ప్రజలు రోడ్డు మీది కొచ్చారు. అర్జీ కాయితం యిచ్చారు. మరికొంత దూరం రాగానే మబ్బుచింతలపల్లె దగ్గర ప్రజలు అడ్డుకున్నారు. అర్జీ కాయితం యిచ్చారు.

తుమ్మలపల్లె దగ్గర కూడా అలాగే, అలాంటి అర్జీ కాయితాన్నే ప్రజలు సీఎంకు అందజేశారు. సీఎం కాన్వాయి యురేనియం ఫ్యాక్టరీలోకి దూసుకెళ్ళింది. సంస్థ డైరక్టర్ పూలబొకేతో ఎదురొచ్చి స్వాగతమిచ్చాడు.

ప్లాంట్‌లో దగ్గరుండి జరుగుతున్న పనుల్ని, యురేనియం వెలికితీతకు సంబంధించిన పద్ధతుల్ని, ప్రక్రియకు సంబంధించిన దశల్ని ఒక్కొక్కటిగా చూపిస్తూ, ఫోటో ఎగ్జిబిషన్ ద్వారా సీఎంకు ఇంజనీర్లు వివరించారు.

ప్రజల్లో ప్రాజెక్టు పట్ల వున్న భయాందోళనలను, అపోహల్ని తొలగించడానికి ప్రయత్నిస్తున్నట్లు కూడా సంస్థ ప్రతినిధులు తెలిపారు.

అణుధార్మికత, జలకాలుష్యం, విషవాయువులు, రేడియేషన్, క్యాన్సర్ వంటి అనుమానాల్ని తీర్చడానికి విస్తృతంగా కృషి చేస్తున్నట్లు కలెక్టర్ చెప్పాడు.

‘నష్టపరిహారం’ గురించి సీఎం ప్రశ్నించాడు. మొత్తం దాదాపు అందరికీ నష్టపరిహారం అందిందని ప్రక్రియ మొత్తం నిన్నటితో పూర్తయి పోయిందని కూడా కలెక్టర్ సీఎం దృష్టికి తీసుకెళ్ళాడు.

అయితే యిప్పుడు మార్గమధ్యంలో కాన్వాయి ఆపి ప్రజలిచ్చిన అర్జీలు ఏమిటని సీఎం ప్రశ్నించాడు.

'ప్లాంటులో భూములు కోల్పోయిన వారి పిల్లలకు ఇంటికో ఉద్యోగం కోరుతూ యిచ్చిన అర్జీలని, దాని గురించి ప్రాజెక్టు ప్రతినిధులతో చర్చించాల్సి వుందని...' కలెక్టర్ వివరణ యిచ్చు కున్నాడు.

సీఎం, సంస్థ డైరక్టర్ వైపుచూసి కళ్ళు ఎగరేసాడు... సమాధానం ఏమిటన్నట్లు!

'స్థానికులకు ఉద్యోగాలు యివ్వడానికి తమకేం అభ్యంతరం లేదని, దశల వారీగా అందరికీ అవకాశం కల్పిస్తామని' భరోసాగా చెప్పాడు డైరక్టర్.

'అదే విషయం వివరంగా అర్జీదారులకు స్పష్టం చేయమని' సీఎం సూచించాడు.

కలెక్టర్ తన డైరీలో నోట్ చేసుకున్నాడు. ప్లాంట్ నిర్వహణను, ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు సీఎం.

ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ముగించుకొని బయలుదేరే సమయంలో విలేకర్లు చుట్టుముట్టారు. రకరకాల ప్రశ్నలు సంధిస్తున్నారు. పరిస్థితి గందరగోళంగా వుంది. పోలీసులు వారినందర్ని వెనక్కి నెడుతున్నారు. సీఎం కాసేపు ఆగి...

'నా నియోజక వర్గానికి ఏదైనా ప్రమాదం జరిగే పని వస్తే నేను ఒప్పుకుంటానా? నా నియోజకవర్గ ప్రజలకు నేను ఎప్పుడైనా అన్యాయం చేశానా? ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగానే నేను ముందుకెళ్తాను. అపోహలన్నింటిని వదిలి పెట్టండి.' తన మాటగా చెప్పి కారెక్కాడు. కాన్వాయి వేగంగా ముందుకు కదిలింది.

• • •

'న్నో... రామాంజన్న! రేత్రి టౌనుకు పోతాండ. గుడికాడ బ్రహ్మోత్స వాలుగాని, నువ్వు వస్తావా...' కుర్చీ లాక్కొని కుర్చున్నాడు వెంకటేశు.

'ఏం బ్రహ్మోత్సవాలు రా... య్యా గుళ్ళో' రాగి సంకటి, గోగాకు పప్పు కలుపుకుంటా అడిగినాడు రామాంజి.

'పులిందల శ్రీరంగనాథస్వామి గుళ్ళో ఈ రోజు కాన్నుంచే బ్రహ్మోత్సవాలు...' వసరాలోని గూట్లో పెట్టిన పాతపేపరు పెరుక్కొని చూస్తా బదులిచ్చినాడు వెంకటేశు.

పులిందలలో విజయనగర రాజుల కాలంలో శ్రీరంగనాథస్వామి ఆలయాన్ని నిర్మించినారు. ప్రతి సంవత్సరం తొమ్మిది రోజుల పాటూ ఘనంగా బ్రహ్మోత్సవాలు జరుగుతాయి.

పగటిపూట సూర్యప్రభ, రాత్రిపూట చంద్ర ప్రభ వాహనాలపైన స్వామి వారిని ఊరేగిస్తారు. హరికథలు, బుర్రకథలు, నాటకాలు వేయిస్తారు. గరుడవాహనసేవ, కల్యాణోత్సవం, బ్రహ్మరథోత్సవం, సింహవాహనం, శేషవాహనం, హనుమత్ వాహనం, అశ్వవాహనం జరుపుతారు. వసంతోత్సవం నిర్వహించిన తర్వాత హంసవాహనం పై ఊరేగిస్తారు.

'ఏంరా... వున్నెట్టుండి భక్తిపుట్టినట్లుండాదే నీకు...' సందేహంగా అడిగాడు రామాంజి.

'నాకు కాదున్నా... మా నాయనకు పుట్టింది. అదో యురేనియం ఫ్యాక్టరీలో పనికోసం అప్లికేషన్ రాసి పెట్టింటే దాన్ని రేత్రి గుడికి తీసకపోయి దేవుడికాడ పూజల చేయించాలని అంటాండడు. పూజ అయిన తర్వాత ఫ్యాక్టరీ వాళ్ళకు ఇస్తాడంట...' చేతిలోని పేపరు పక్కకేసినాడువెంకటేశు.

'నీది డిగ్రీ అయిపోయిందా... రా' ఆశ్చర్యంగా అడిగినాడు రామాంజి.

'యింగా ఏందిన్నా... డిగ్రీ, ఆర్ట్సుకాలేజ్‌లో పి.జి ఫస్టియర్ గూడా జేరింటే...'

'మళ్ళ కాలేజీకి పోయి సదువుకోకుండా ఫ్యాక్టరీలో పనికి జేర్తావా...'

'నాకేం తెల్సున్నా... మా నాయన కనుక్కొని వచ్చినాడు. వాళ్ళు అప్లికేషన్ కాయితం యిచ్చినారు. దాన్ని రాసుకొని తీసక పోతాండడు...'

'భూములు పోయినోళ్ళందరికీ మళ్ళా ఉద్యోగాలు గూడా యిస్తాండరా? యింగ ఆ మాట పొద్దున్నే చెప్పింటే నేను ఆ ఫ్యాక్టరీ కాడికి పోయి అప్లికేషన్ తెచ్చుకొనిందు కదూ...' ప్లేట్‌లోని రెండు ముద్దలు దిగమింగి చేతులు కడుకున్నాడు రామాంజి.

'నాకు నిజంగానే తెల్దున్నా... మా నాయన తీసకచ్చినాడు' చెప్పినాడు వెంకటేశు.

చింతచెట్టు మోట్లోని బోరింగ్ దగ్గర నీళ్ళు కొట్టుకొని ప్లాస్టిక్ బిందెను నడుముకెత్తుకొని గసపెడ్తా ఇంటి కొచ్చింది రామాంజి భార్య వరలక్ష్మి.

చుట్టుప్రక్కల ఇండ్లల్లో అందరూ రాత్రి టౌన్లో గుడికి బ్రహ్మోత్సవాలు చూసేదానికి పోతున్నారని, మనం కూడా పోవాలని అక్కడ్నుంచే మనస్సు లోపల ఒక నిర్ణయం బలంగా తీసుకొని వచ్చి రామాంజితో అదే విషయాన్ని చెప్తింది.

ఇప్పుడే వెంకటేశు కూడా ఇదే విషయం చెప్తాండని గుర్తు చేశాడు రామాంజి.

'పక్కింట్లో ఆడుకుంటున్న పిల్లల్ని పిలుచుకు రావడానికి వేగంగా, ఉత్సాహంగా బయటికెళ్ళి పోయింది వరలక్ష్మి.

'న్నా... పులిందలకు ఆ పేరు ఎట్లొచ్చిందో నీకు తెల్స...' మళ్ళీ యింకో మాట విసిరాడు వెంకటేశు.

రామాంజి ప్రశ్నార్థకంగా ముఖం పెట్టాడు.

'నేను ఇంటర్ కాడికే సచ్చీ బతికీ సదుకున్న్యాను బ్బీ... నన్ను అడిగితే నా కెట్లాతెలుస్తాది' గూట్లోని అరటిపండ్లు నుంచి ఒకటి తను తీసుకొని, ఇంకొకటి వెంకటేశుకు యిచ్చి కుర్చీలో కూర్చున్నాడు రామాంజి.

'చెప్పుబ్బీ! ఎట్లొచ్చింది ఆ పేరు' తెలుసుకోవాలనే ఆతృత తో అడిగినాడు రామాంజి.

అరటి పండు తింటున్నాడు వెంకటేశు.

‘వూర్కే అడుగుతాండవా? ముందు నీకు తెల్స...’ సందేహంగా మళ్ళీ రామాంజినే అన్నాడు.

‘న్నో... నాకెందుకు తెలీదు. కాలేజీలో మా హిస్టరీ లెక్చరర్ దస్తగిరి సార్... చెప్పినాడు’ అరటిపండు నముల్తానే చెప్పినాడు.

‘ఏమని చెప్పినాడు... బ్బీ!’

‘ఒకప్పుడు ఈ ఏరియాలో య్యాడజూసినా పులులు మందలు మందలుగా తిరుగుతా వున్యాయంటా. ‘పులిమందల’ అని పిలుస్తావున్యారంట. అదే, ఇప్పుడు ‘పులిందల’ అని పలుకుతాండం. చెప్పి తొక్క బయట విసిరేసి వచ్చినాడు.

‘మంచి విషయం చెప్పినావు బ్బీ! నీకు యురేనియం ఫ్యాక్టరీలో ఉద్యోగం గ్యారంటిపో... ముందే నా నాలికకు మచ్చలుండాయి. మాటంటే జరిగి తీర్తాది’ - మూతి తుడ్సుకుంటా పైకిలేచినాడు రామాంజి.

‘అది సరే గానిబ్బీ! యురేనియం అంటే ఏంది? దాని గురించి నీకు ఏం తెల్సు రోంత జెప్పు...’ కుర్చీ దగ్గరికి లాక్కొని కూర్చొని అడిగినాడు రామాంజి.

‘నాకూ దాని గురించి పెద్దగా తెల్దున్నా... యురేనియం ఒక రసాయనిక మూలకం. దాని గుర్తు 'U' పరమాణు సంఖ్య 92. ఆ మూలకాన్ని విడకొట్టడం వల్ల విస్ఫోటనం చెందుతాది. దాన్ని అణువిద్యుత్‌కు, అన్ని బాంబుల తయారీకి వాడుకుంటా వుంటారని’ తెలుసు. లోతుగా తెల్దు. చెప్పినాడు తనకు తెల్సినంత వరకు వెంకటేశు.

‘నీకన్నా ఆరోంతైనా తెల్సు, నాకు అదీ తెల్దు. రేపు ఫ్యాక్టరీ వాళ్ళు ఇంటర్వ్యూ అప్పుడు అడిగితే ఏం జెప్పి సావలో...’ తలగోక్కున్నాడు రామాంజి.

కరెంటు పోయింది. పేపరు తీసుకొని విసురుకుంటూ బయట వసారాలోకి వచ్చినారు.

‘మళ్ళ... మనూర్లో యురేనియం ఫ్యాక్టరీలో ఏం జేస్తారు... బ్బీ!’ ఇంకో ప్రశ్న వేసినాడు మంచం వంచుతా.

'మన భూమిలో ముడియురేనియం లోపలుంటాదిన్నా... దాని లోపలికి పోయి మట్టితో సహా తీసకస్తారు. దాంట్లోంచి పిండి, జల్లెడ పట్టి యురేనియాన్ని తీస్తారు. దాన్ని నిల్వచేసి ఎక్కడైనా పెట్టుకుంటారు. అవసరానికి వాడుకుంటా వుంటారు.' చెప్పినాడు వెంకటేశు.

నీళ్ళు మోసుకుంటా వీధిలో ఆడోళ్ళు అటూ - ఇటూ తిరుగుతా వుండారు.

'ఐతే... మనకేంటికి రోగాలు, జబ్బులు, క్యాన్సర్లు వస్తాయని చెప్తాండరు?' మళ్ళీ అడిగినాడు రామాంజి. 'యురేనియాన్ని భూమి లోపలికి పైకి తీసకొస్తారు. గుట్టలు గుట్టలుగా డంప్ చేసి పెట్టుకుంటారు. శుద్ధి చేసిన తర్వాత ఆ పిప్పి మట్టిని బయటికి తెచ్చి పారబోస్తారు. ఈ పని జరిగేటప్పుడంతా రేడియేషన్ ఏర్పడతాది. ఆ పని పూర్తి కావడానికి వాడుకునే నీళ్ళు బయటికి వస్తాయి కాబట్టే జలకాలుష్యమని వస్తాదని చెప్పాండరు.' జవాబిచ్చినాడు వెంకటేశు.

'నువ్వు బాగా కనుక్కున్యావు కదుబ్బీ! అన్ని సంగతులు.' మెచ్చుకోలుగా చూశాడు రామాంజి.

'అదే ఆరోజు ప్రజా సంఘాల వాళ్ళు మన పల్లెలోకి వచ్చినప్పుడు, వాళ్ళ కాడ కూకొని అన్ని విషయాలు తెల్సుకుంటి. వాళ్ళిచ్చిన కరపత్రం కాగితాలు చదువుకుంటి. ఏకాలం ఎట్టొస్తాదోనని...' చెప్పినాడు వెంకటేశు.

'తెల్సుకొని మంచిపని జేసినావు. రేపు ఫ్యాక్టరీ వాళ్ళు ఏమైనా అడిగితే నోరు తెరిచి చెప్పే దానికైనా...'

'ఔ ...న్నా!' మా నాయన ఎట్లైనా గానీ ఫ్యాక్టరీలో నేను ఉద్యోగం తెచ్చుకోవాలని పంతం పట్టిండాడు.'

'ఆ ఫ్యాక్టరీలో పనిలో జేరితే మనకేం ప్రమాదం లేదాబ్బీ!. ఏదైనా జరిగితే ముందు సచ్చేది అక్కడ మనమేనేమో...' నవ్వుతాండడు రామాంజి.

'నువ్వు ఊర్కోన్నా... సామీ... భయపడిచ్చి సంపగాకు. ముందే ఆడ ఉద్యోగమంటేనే గుండె అదిరిపోతాంది. మా నాయన యిడ్సిపెట్టడం లేదు.'

‘ఇద్దరం జేర్దాం పా...బ్బీ!’ నాకు నువ్వు తోడు. నీకు నేను తోడు. ఎట్టైయేది అట్ట అయితాది. ఇట్లా వీళ్ళిద్దరూ మాటల్లో వుండగానే -

‘న్నో... మీ నాయనా నిన్ను పిలుస్తాండడు. ఇంటికంట రావాలంట.’ అని గాను దొర్లించుకుంటా ఎదిరించి ఆంజనేయులు కొడుకు నాగులు గాడు వచ్చి చెప్పిపోయినాడు.

వెంకటేశు అన్నుంచి కదిల్నాడు ఇంటికి.

దూరంగా బోరింగ్ కొడ్తాండే శబ్దం ఆగి ఆగి విన్పిస్తాంది.

❖ ❖ ❖

యురేనియం ఫ్యాక్టరీ దగ్గరికి అప్లికేషన్స్ పూర్తి చేసుకొని తీసుకపోయిన వాళ్ళు క్యూగా నిల్చొని వున్నారు.

విద్యార్హతలు, అనుభవం వంటి వాటన్నింటిని పరిశీలించి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

అసలు ఫ్యాక్టరీలో ఎన్ని ఖాళీలున్నాయో, ఎంతమందికి ఉద్యోగ అవకాశాలు వున్నాయో, వాళ్ళకు కావలసిన విద్యార్హతలు కూడా ఎవరికీ తెలియడం లేదు. భూములు పోయిన వాళ్ళ కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇస్తామని సంస్థ హామీ ఇచ్చింది. ఆ హామీని నిలబెట్టుకోవడం కోసం ఇప్పుడిలా దరఖాస్తులను స్వీకరిస్తోంది.

‘మళ్ళా ఇంటర్వ్యూలు ఎప్పుడుంటాయి సార్!’ కిటికీ బయటన్నుంచి జిరాక్స్ సర్టిఫికెట్స్ కుట్టి, అప్లికేషన్ ఇస్తూ అభ్యర్థులు అడుగుతున్నారు. లోపల కౌంటర్లో కూర్చున్న గుబురు గడ్డం మనిషి కనీసం తలెత్తికూడా ఎవర్నీ చూడ్డం లేదు.

ఇస్తున్న అప్లికేషనన్నీ తీసుకుంటూ, వాటన్నింటిని ఒక మూలకు పడేస్తున్నాడు.

అప్లికేషన్ స్వీకరించినట్లు కూడా ఏ ఆధారం ఇవ్వడం లేదు.

‘ఎన్ని ఉద్యోగాలు ఖాళీవుండాయి సార్!’

యింకో నిరుద్యోగి అడిగాడు. అట్నుంచి జవాబు లేదు.

సర్పంచు బాలిరెడ్డి తమ ఇండ్లలోని వాళ్ళ అప్లికేషన్స్‌తో వచ్చినాడు. గేటు తీసుకొని సరాసరి లోపలికెళ్ళి పోయినాడు.

కౌంటర్లోని మనిషి నవ్వినాడు.

వాటన్నింటిని తీసుకొని సంతృప్తిగా యిక మీరువెళ్ళిపోవచ్చు అన్నట్లు చూశాడు.

బాలిరెడ్డి కళ్ళతోనే ‘తర్వాత కలుద్దాం’ అన్నట్లు చూస్తూ వెళ్ళిపోయాడు. క్యూ ఇంకావుంది.

పైన ఎండ నిప్పులు కక్కుతోంది.

‘సగం మంది వుండి, మిగిలినోళ్ళందరూ రేపు రాపోండి!’ కేకేసినాడు గడ్డం మనిషి.

అభ్యర్థులెవరూ కదలడం లేదు. తమ కెవరికీ వినపడనట్లు అలాగే వుండిపోయారు.

‘మీ ఇష్టం మీరుంటే వుండండి... ఎండకు! నాదేం పోతాంది.... మధ్యాహ్నం వచ్చిన తర్వాత తీసుకునేది....’ చేతులు వేగంగా ఆడిస్తూ అప్లికేషన్స్ తీసుకుంటున్నాడు.

వెంకటేశు తన దరఖాస్తు అందించాడు. చకచకా తిప్పేసి ‘సరిపోయింది’ పొమ్మని కౌంటర్ కిటికీ మూసేశాడు. భోజనం చేసి మళ్ళీ మూడు గంటలకు వస్తానని కేక వేశాడు.

క్యూ అలాగే వుంది. ఎండ మండిపోతోంది.

• • •

వసారాలోని నులక మంచాన్ని లోపలికి తీసుకొచ్చాడు రామాంజి. దానిపై బొంత పర్చుకొని పడుకున్నాడు. టీవీలో ఏదో కార్యక్రమం వస్తోంది. అటూ ఇటూ ఛానల్లు మార్చి మార్చి చూస్తున్నప్పుడు న్యూస్ ఒకటి కనపడింది. 'జపాన్‌లో పేలిన పుకుషిమా అణు విద్యుత్కేంద్రం' అనే వార్త చెప్తున్నారు. సునామీ ధాటికి కకావికలమైన జపాన్‌లో ఒక అణు విద్యుత్ కేంద్రం భవనం పేలిపోయింది. లోపల ఉన్న అణురియాక్టర్, దాని చుట్టూ ఉన్న కంటెయినర్ లకు భారీ ప్రమాదం పొంచి వుందని... న్యూస్!

రామాంజికి ఛానల్ మార్చాలని అన్పించలేదు. తుమ్మలపల్లెలోకి యురేనియం ప్రాజెక్టు వచ్చి నప్పటినుంచి అణువు అనే మాట విన్పిస్తే చాలు దాని గురించి తెల్సుకోవాలని అన్పిస్తోంది.

భూకంపం తాకిడికి గుర్రైన పుకుషిమాలోని ఐదు అణుధార్మిక కేంద్రాల్లో శీతలీ కరణ వ్యవస్థలు పని చేయకుండా నిలిచి పోయాయి. దియాఇచి అనే అణుకేంద్రంలోని యూనిట్ భవనం పేలింది. అణు కేంద్రం పేలుడు వలన ఆ ప్రాంతంలో అణు ధార్మికత సాధారణ స్థాయికన్నా వెయ్యిరెట్లు పెరిగినట్లు వార్తలు వస్తున్నాయి.

రోజూ మధ్యాహ్నం పూట దాయాలాట ఆడేందుకు వచ్చే ఆంజనేయులు కూడా వచ్చి పక్కన కూర్చోన్నాడు.

'ఏంది... టివీలో ఏదో పెద్దవార్తనే చెప్తాండరే....' అని అన్నాడు ఆసక్తికరంగా చూస్తూ...

ఔనన్నట్లు తల ఎగరేశాడు రామాంజి

'అణు కేంద్రానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయి శీతల జలాలు ఆవిరై పోవడంతో హైడ్రోజన్ వాయువు విడుదలైంది. అది కంటెయినర్‌కు అణుకేంద్రం గోడలకు మధ్య వున్న ఖాళీ స్థలంలోకి వెళ్ళి ఆక్సిజన్‌తో కలవడం వల్ల పేలుడు జరిగి గోడలు కూలిపోయాయి' అని జపాన్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి యుకియో ఎడనో మీడియా ముందుకొచ్చి వివరణ ఇస్తున్నాడు టీవీలో.

అణు కేంద్రాలున్న ప్రాంతాల్లో జపాన్ ప్రభుత్వం ఎమర్జెన్సీని ప్రకటించింది. నలభై అయిదువేల మంది ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ఆదేశాలు జారీ చేశారు. రియాక్టర్‌ను చల్ల పరిచేందుకు సముద్ర జలాలు, బోరిక్ ఆమ్లాన్ని ప్రయోగిస్తున్నారు. అణు కర్మాగారం వద్ద రేడియో ధార్మిక సెసియం-137, అయోడిన్-131లను గుర్తించారు.

ఫుకుషిమా అణు కర్మాగారానికి 20 కిలోమీటర్ల వ్యాసార్థంలో లక్షల మందిని ఖాళీ చేయిస్తున్నట్లు వార్తల్లో చూపిస్తున్నారు.

యురేనియం ప్రాజెక్టుకు సంబంధించిన అధికార్లకు, ఇంజనీర్లకు కూడా ఈ వార్తలు ఆసక్తికరంగా మారాయి. ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని తెలుసుకుంటూనే వున్నారు.

'జపాన్ దీన్ని ముందుగానే అంచనా వేసి ఉండాల్సిందని ది సిటిజన్స్ న్యూక్లియర్ ఇన్‌ఫర్మేషన్ సెంటర్' వెల్లడించింది. ఇది అత్యంత ప్రమాదకరమైన పరిశ్రమని గ్రీన్‌పీస్ సంస్థ తెలిపింది.

సైకిల్ గంగమ్మ గుడి మోట్లోని జువ్విచెట్టు కింద పెట్టి లోపలికి వచ్చినాడు వెంకటేశు.

'డిష్‌లో పవన్ కల్యాణ్ సినిమా' వేసినారంట దాన్ని చూడనే నేను వచ్చింది...' అంటూ వచ్చి టివి ముందు కూర్చున్నాడు.

'నువ్వుండురా... జపాన్‌లో భూకంపం వచ్చింది. జనం చచ్చిపోతా వుండారు. ఆ వార్తలే చూస్తాండేది' చెప్పినాడు రామాంజి.

రియాక్టర్లలో వరసగా జరుగుతున్న పేలుళ్ళు, జనం ఆందోళనలను వార్తలను ఆశ్చర్యంగా అందరూ చూస్తుండి పోయారు.

అణు విచ్ఛిత్తి వలన తీవ్రస్థాయిలో ఉష్ణం వెలువడుతుంది. దీని ద్వారా నీటిని వేడి చేసి దాని ఆవిరి ద్వారా టర్బైన్లను తిప్పుతారు. దీని వలన విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. అణు విద్యుత్ ఉత్పత్తి సూత్రం ఇది. దీనికొక రియాక్టర్ అవసరం అవుతుంది. ఇందులోని కోర్ భాగంలో శుద్ధి చేసిన యురేనియం ఉపయోగిస్తారు.

దీనిని న్యూట్రాన్లతో ఢీకొట్టిస్తారు దీంతో చైన్ రియాక్షన్ మొదలవుతుంది. ఈ ప్రక్రియను నియంత్రించడానికి రియాక్టర్ ఛాంబర్‌లో క్యాడ్మియం కడ్డీలను వాడతారు. విచ్ఛిత్తి కారణంగా రియాక్టర్ భారీ స్థాయిలో వేడెక్కుతుంది. దీన్ని చల్లబరడానికి శీతల వ్యవస్థ వుండాలి. ఇందుకోసం నీటిని ఉపయోగిస్తారు. రియాక్టర్లను చల్లపర్చడానికి అవసరం అయిన నీటిని పంప్ చేయక పోవడంవల్ల కోర్‌లో తీవ్రస్థాయిలో ఉష్ణోగ్రత పెరిగింది. దీంతో ఇంధనం కరిగిపోయింది. పీడనం పెరిగి అణుధార్మికత వెలువడింది. ఈ విధంగా ఫుకుషిమా ప్రమాదం సంభవించింది.

అన్ని న్యూస్ ఛానళ్ళలోనూ ఇదే న్యూస్!

రామాంజి పైకి లేచి కుండలోనీళ్ళు తాగివచ్చి మళ్ళీ టీవీ ముందు కుర్చున్నాడు.

దృశ్యాలు దృశ్యాలుగా కదిలి పోతున్న జీవితం. అపార ఆస్తి, ప్రాణనష్టాలు. సెందాయ్ విమానాశ్రయాన్ని సముద్రపు అలలు చుట్టు ముడుతున్న దృశ్యం...

హృదయానికి భారంగా ఉంది.

జపాన్‌లో అణుకేంద్రాల చుట్టు పక్కల వారిని తక్షణం సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. భూకంపం జరిగిన చోటికి సమీపంలో ఉన్న నాలుగు అణు విద్యుత్ కేంద్రాల్ని మూసేశారు. ఒనగావా ప్లాంటులో పదకుండు రియాక్టర్లు, ఫుకుషిమాలో రెండు ప్లాంట్లు, టొకొయ్‌లో ఒక ప్లాంటు మూసేశారు. అంతర్జాతీయ సూచిపై ఈ అణు ప్రమాదాన్ని ఆరుగా పేర్కొన్నారు. అణు విద్యుత్ కేంద్రంలో పేలుళ్ళ కారణంగా వాతావరణంలో కలిసిన రేడియో ధార్మికత అందర్ని వణికించింది. ఫుకుషిమా అణువిద్యుత్ కేంద్రానికి ముప్పై కిలోమీటర్ల దూరంలో వున్న వారందరూ ఇళ్ళలోనే ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. ఇరవై కిలోమీటర్ల దూరంలో వున్న వారిని ఖాళీ చేయించారు. అణు రియాక్టర్లను చల్లబరిచేందుకు సైనిక హెలికాప్టర్లతో సముద్రం నుంచి

నీటిని సేకరించి టన్నుల కొద్దీ కుమ్మరించారు. దైచి అణువిద్యుత్ కేంద్రంలో ఇంధన కడ్డీలను చల్లపర్చడానికి సముద్రం నుంచి నీటిని తీసుకెళ్తున్న సి.హెచ్.47 యుద్ధ విమానాలను టీవీలో చూపిస్తున్నారు.

జపాన్ సంఘటన చూస్తున్న వాళ్ళందరూ మన దేశంలో పరిస్థితి ఏమిటో అని చర్చ చేసుకుంటున్నారు. ఆలోచనలు చేస్తున్నారు. ఒక్కొక్కరుగా మాట్లాడేదానికి ముందుకొస్తున్నారు.

● ● ●

మునిరెడ్డి పొద్దున్నే రచ్చబండ రావిచెట్టు కిందకి ఆరోజు దినపత్రిక చేతిలో పట్టుకొని వచ్చినాడు. పేపర్నిండా జపాన్ అణు విస్ఫోటనం వార్తలే వుండాయి.

'ఇదేందిరా... సామీ! ఈ ఫోటోలు చూస్తాంటేనే భయమెత్తుకుంటా వుండాది' అన్నాడు పేపరు చూస్తా అంకిరెడ్డి.

"యురేనియం వెలికి తీత, విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుపై స్థానికులు, పర్యావరణ నిపుణులు, ప్రజాసంఘాల నుంచి మన రాష్ట్రంలో కూడా తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. నిక్షేపాలు వెలికి తీసేటప్పుడు, రవాణాలో రేడియేషన్ వ్యాపిస్తుందనే భయం వుంది. రేడియేషన్ వల్ల భారీగా ప్రాణ నష్టంతో పాటూ పుట్టబోయే బిడ్డలు శారీరక, మానసిక వికలాంగులు అవుతారు. పర్యావరణం దెబ్బ తింటుంది. పంటలు వుండవు. సాంకేతికంగా అంతగా ఎదగని భారతదేశంలో ఇవి మరింత ప్రమాదకరం. అణు విద్యుత్ చట్టంలో అనేక విషయాలను ప్రభుత్వం రహస్యంగా ఉంచుతోంది. మన దగ్గర ఎక్స్‌క్లూజివ్ జోన్, ఎమర్జెన్సీ ప్రొటెక్షన్ల జోన్ల గురించి ప్రజలను చైతన్యవంతం చేయడం లేదు. ఏ చిన్న ప్రమాదం జరిగినా భారీ నష్టం వుంటుందని -

ప్రముఖ పర్యావరణ నిపుణుడు ఈఏఎస్ శర్మ చెప్పిన మాటల్ని గట్టిగా పైకి చదివి విన్పించాడు రామిరెడ్డి.

'న్నా! జోన్లు అనే మాట వచ్చింది కదా...,

దాన్ల గురించి ఏందైనా వుంటే చదువు...

తెలుసుకోవాలనే ఆసక్తి అడిగినాడు అంకిరెడ్డి.

'ఔ... నువ్వు అడిగే జోన్ల గురించి కూడా రాసిండారు. మూడు జోన్లు వుంటాయంట. మొదటిది ఎక్స్‌క్లూజివ్ జోన్. అణు విద్యుత్ ప్రాజెక్టుకు ఒకటిన్నర కిలోమీటర వరకు వుంటుంది. దీని పరిధిలో ఎవరూ నివసించడానికి వీలుండదు. రెండవది స్టెరిలైజ్డ్ జోన్. ఆపైన ఐదు కిలోమీటర్ల వరకు వుంటుంది. నివసించడానికి అవకాశం వున్నా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టరు. యింక మూడోది ఎమర్జెన్సీ ప్రొటెక్షన్ జోన్. ఆపైన పదహారు కిలోమీటర్ల వరకు వుంటాది. ఏ చిన్న ప్రమాదం జరిగినా అక్కడి వారందర్నీ తరలిస్తారు.'

వార్త చదివి విన్పించాడు రామిరెడ్డి.

చలమారెడ్డి సిగరెట్ వెలిగించినాడు.

'నువ్వు వార్తలు చదువు తాంటే గుండె అదిరిపోతాంది' అంటా పొగ గాల్లోకి వదిల్నాడు.

'ఇదేం జూసినావు మామా! యింగో వార్త వుండాది. చదివితే పల్టీకొడ్తావు. ఇట్నే 1986 ఏప్రిల్ 28వ తేదీన అప్పటి రష్యాలో వుండే చెర్నోబిల్‌లో జరిగిన వార్త చదువుతా నిమ్మలమై విను...'

చదవడం మొదలెట్టాడు రామిరెడ్డి.

'చెర్నోబిల్ అణురియాక్టర్ నాల్గవ దాంట్లో జరిగిన పొరపాటు కారణంగా అణుకేంద్రంలో యాభైమంది సిబ్బంది. కార్మికులు మరణించారు. అనంతరం క్యాన్సర్ ముప్పుతో నాలుగు వేలమంది దాకా మరణించారు. అసలు ఈ సంఘటన ఎలా జరిగిందంటే... సురక్షిత పరీక్ష కోసం ఆ రోజు ఉదయాన్నే రియాక్టర్‌లో ఉత్పత్తిని నిలిపి వేశారు. రియాక్టర్‌లో విద్యుత్ ఉత్పత్తి దాదాపుగా సున్నాస్థాయికి పడిపోయింది. సాధారణ స్థితికి తీసుకరావడానికి కొన్ని నియంత్రణ కడ్డీలను తొలగించారు. విద్యుత్ ఉత్పత్తిని పెంచారు. సురక్షిత పరీక్ష కోసం టరెన్ ఫీడ్ వాల్వులను మూసేయడంతో శీతల వ్యవస్థలో ఒత్తిడి పెరిగింది. నియంత్రణ కడ్డీలు చెదిరిపోవడంతో లోపల రెండు పేలుళ్ళ సంభవించాయి. రియాక్టర్‌పై భాగం ఎగిరి పోయింది. బయటి గాలి లోపలికి ప్రవేశించింది.

కార్బన్ మోనాక్సైడ్ ఏర్పడి మంటలు పుట్టాయి. పొగ ద్వారా రేడియో ధార్మికత పరిసర వాతావరణంలో కలిసి పోయింది. రియాక్టర్‌ను చల్లపర్చడానికి లిక్విడ్ నైట్రోజన్‌ను లోపలికి పంపారు.

మంటలు అదుపులోకి వచ్చాక రియాక్టర్ చుట్టూ మూడు లక్షల మెట్రిక్ టన్నుల కాంక్రీటును ఉపయోగించి భారీ స్థాయిలో సర్కోఫేగస్ గోడను నిర్మించారు. అణుకేంద్రానికి సమీపంలోని ప్రిప్యట్ పట్టణంతో పాటూ కొన్ని లక్షల మందిని ఖాళీ చేయించి వారందరికి వేరే చోటు నివాసం ఏర్పాటు చేయాల్సి వచ్చింది.'

రామిరెడ్డి ఉత్సాహంగా చదువుతూనే వున్నాడు. చలమారెడ్డి అయిపోయిన సిగరెట్ ముక్కను బండకేసి ఆర్పి పక్కనేశాడు.

'మునిరెడ్డి పొద్దున్నే ఈ పేపర్ తెచ్చి ఎంతపని చేసినావ్... నాకు ఆ వార్తలు వింటాంటేనే అదిరిపోతాంది...' ఆందోళన పడ్తా రామిరెడ్డి అన్నాడు.

'మంచిదేలేన్నా... విషయాలన్నా తెల్సుకుంటివి' సమర్థించినాడు పక్కనున్న అంకిరెడ్డి.

బాలిరెడ్డి చేతిలోకి ఇంకో పేపర్ తీసుకున్నాడు.

'న్నో! ఈడేందో త్రీమైల్ ఐలాండ్ అనే దాని గురించి గూడా రాసిండారు. చదవమంటావా...' అన్నాడు.

'ఏది... ఏందంట దాని విషయం... దాని గురించి గూడా చెప్పు. తెల్సుకుంటే సరిపోతాది...' ఇంక్కొంచెం దగ్గరికి వచ్చినాడు శివారెడ్డి.

గాలికి ఎగుర్తాండే పేపర్ను క్కొంచెం మడతేసి పట్టుకున్నాడు బాలిరెడ్డి. చదవడం ప్రారంభించాడు.

'అమెరికా పెన్సిల్వేనియాలోని త్రీమైల్ ఐలాండ్ అణు విద్యుత్ కేంద్రంలో 1979లో భారీ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో ఎవరూ మరణించక పోయిన పదమూడు మిలియన్ క్యూరీస్ రేడియో ధార్మిక వాయువు విడుదలైంది.

మానవ పొరపాట్లు, శిక్షణ లేకపోవడం, ఇంజనీరింగ్ నిర్మాణ లోపాలు వంటివి ప్రమాదానికి కారణాలుగా గుర్తించారు. ప్రమాదం జరిగిన టిఎంఐ-2 రియాక్టర్‌లో ఇంధనాన్ని పూర్తిగా తొలగించి, శాశ్వతంగా మూసేశారు.

'బతికించినారు. వీళ్ళు చేసే తప్పులకు జనం ప్రాణాలు పోకుండా మంచే జరిగింది....' తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసినాడు అంకిరెడ్డి.

'ఈ యురేనియం ఎక్కడెక్కడ ఎట్టా ఎంతమందిని పొట్టన పెట్టుకుందో దాని కతంత మనకెందుకు? మన తుమ్మలపల్లె పరిస్థితి ఏందో ఆలోచించు కోవాల...' తన మనసులో మాట బయట పెట్టినాడు రామిరెడ్డి.

'ఔ... నువ్వనేది నిజమేన్నా!

మన తుమ్మలపల్లె ఒకటే గాదు. చుట్టు పక్క వుండే మబ్బుచింత పల్లె, రాచకుంటపల్లె, భూమయ్యగారిపల్లె, కనంపల్లె... అందరూ మన లాగానే ఆందోళన పడ్తాండరు. దిక్కు తెలీక తనకలాడ్తావుండారు' అందుకున్నాడు అంకిరెడ్డి.

అరుగుపైన గాలికి ఎగిరిపోతాండే పేపరుపైకి రాయి తెచ్చి పెట్టినాడు చలమారెడ్డి.

'నిన్న యురేనియం తవ్వకాల వచ్చే అనర్థాలను వివరిస్తూ పౌరహక్కులు, చైతన్య మహిళా సంఘాలవాళ్ళు కరపత్రాలు తీసుకొనివచ్చి వేముల మండలంలో పంచి పోయినారు' తనకు తెలిసిన విషయం చెప్పినాడు రామిరెడ్డి.

'కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జరగాల్సిన ప్రజాభిప్రాయ సేకరణ మామూలుగా అయితే యిప్పుడే జరిగిండు. యిక్కడ ఉప ఎన్నిక వుంది కాబట్టి జరపడం లేదని, బాధిత రైతుల డిమాండ్లను చర్చించి ముందుకు పోతామని' యురేనియం సంస్థ ప్రతినిధులు ప్రకటించిన విషయాన్ని బాలిరెడ్డి గుర్తు చేసినాడు.

గాలి వేగంగా వీస్తోంది.

• • •

నీళ్ళు రావడం లేదు. బోరు ఎండిపోయింది. చెన్నారెడ్డి దిగులు పడి వుండాడు. అయిదెకరాల అరటితోటకు నీళ్ళిచ్చే బోరు ఎండిపోవడంతో ముఖం నిండా దుఃఖం నింపుకొని వుండాడు. అప్పు చేసి సాగుచేసిన పంట. కళ్ళ ముందు ఎండిపోతా వుండాది. అరటి పంటను బతికించుకోవడానికి నానా అవస్థలు పడ్తావుండాడు.

'ఇదన్నా యింగ రొంత మేలు. ఆ క్రిష్ణారెడ్డి తోట చూడుపో.... ఆరుబోర్లు ఎండిపోయి..! చుక్క నీరుపడింటే ఒట్టు. దిమ్మతిరిగిపొతాంది.' జువ్విచెట్టుకు అవతల కనపడిన నారాయణస్వామి గుర్తు చేసినాడు.

చేసిన అప్పు కళ్ళ ముందు కనపడ్తావుండాది. పొలంలో ఇప్పుడు మళ్ళీ బోరింగు వేయించడానికి అప్పు ఎక్కడ పుట్టించాలి? అనే ఆలోచనే ఆవరించి వుంది.

వీస్తున్న గాలికి అరటి ఆకులు అదేపనిగా శబ్దం చేస్తున్నాయి.

పల్లెలోకి ఎమ్మెల్సీ వస్తున్నట్లు అంగడి దగ్గర ఎవరో మాట్లాడుకుంటూ వుంటే చెన్నారెడ్డి విన్నాడు.

కాసేపటికి ఎమ్మెల్సీ కారు పల్లెలోకి వచ్చింది. అక్కడున్న వాళ్ళను పలకరించాడు.

అలాగే ముందుకు నడుచుకుంటూ వచ్చి రావిచెట్టు అరుగు దగ్గరికి వచ్చాడు.

యురేనియం ప్రాజెక్టు పైన మీ అభిప్రాయాలు తెల్సుకోవాలని వచ్చినట్లు చెప్పినాడు.

'దాని గురించి మాకేం తెలుస్తాదిన్నా! చదువుకున్నోళ్ళే దాని లాభ నష్టా లేందో మీరే చెప్పాల...' గుంపులోంచి ఎవరో చిన్నగా అన్నారు.

ఎమ్మెల్సీ నవ్వినాడు.

‘ప్రజలకు ప్రాణాంతకమైన యురేనియం ప్రాజెక్టును వెంటనే మూసి వేయాలని నేను కోరుకుంటా వుండాను. అన్ని పల్లెలు తిరుగుతాండను. జనాల్లో అసంతృప్తి వుంది. వ్యతిరేకత వుంది.’ చెప్తాండడు అరుగు మీద కూర్చొని.

ఎమ్మెల్సీ వెనకాల వాళ్ళ పార్టీకి చెందిన మండలస్థాయి నాయకులు లందరూ వుండారు.

‘నాకు ఈ మండలం నుంచి వచ్చిన రిపోర్టు ప్రకారం యురేనియం తవ్వకాలకు ముందు బోరుబావుల్లో అయితే ఎనభై అడుగుల్లో నీళ్ళుండేవి. వీళ్ళు తవ్వకాలు మొదలు పెట్టినప్పటి నుంచి ఆరొందల నుంచి ఏడొందల అడుగుల లోతుకు బోర్లు వేసినా నీళ్ళు పడడం లేదు. చుట్టు పక్క ఇప్పటి వరకు నూటా ముప్పై బోర్లు ఎండిపోయినట్లు తెలుస్తాంది.’ అని పైకి లేచి నిలబడి మాట్లాడ్తా వుండాడు.

‘న్నా! ప్రాజెక్టులో భూములు పోయినోళ్ళకు ఉద్యోగాలు యింతవరకు ఇవ్వకుండా తిప్పుకుంటా వుండారు’ గుంపులోంచి మరొకరు తమ ఆవేదన బయట పెట్టారు.

‘అవును... ఆ విషయం కూడా నా దృష్టికి వచ్చింది. దీన్ని కూడా మన డిమాండ్లలో చేర్చినాం. తాగునీరు కూడా కలుషితమై పోతాంది. దీని మీద పోరాటం తప్పదు.’ ఆవేశంతో హామీ ఇచ్చాడు.

చప్పట్లు కొట్టారు అక్కడున్న వాళ్ళు.

ఎమ్మెల్సీ కారు కదిలి పోగానే అక్కడ్నుంచి అప్పు కోసం రామిరెడ్డిని వెతుక్కుంటా చెన్నారెడ్డి ఎగువ ఇండ్ల దిక్కు వచ్చేసినాడు.

యురేనియం తవ్వకాల్లో భూములు కోల్పోయిన బాధితులకు న్యాయం జరగక మునుపే, భూగర్భ జలాల పెంపునకు చర్యలు తీసుకోక మునుపే ‘రెండవ మైనింగు’ ప్రతిపాదనలు తయారవుతున్నట్లు రామిరెడ్డి చెప్పినాడు.

ఉలిక్కి పడ్డాడు చెన్నారెడ్డి.

'నిజమా' మళ్ళీ రెట్టించి ప్రశ్నించాడు.

'ఔ... నిన్న ఎంపీ దగ్గరుండే మనుషులు అనుకుంటా వుంటే విన్యా.'

సమస్యలన్నీ పరిష్కరించిన తర్వాత రెండవ మైనింగు మొదలు పెట్టుకొంటామని వాళ్ళు కూడా చెప్పినారంటలే'

వచ్చిన పని ఏమిటన్నట్లు కళ్ళు ఎగరేశాడు రామిరెడ్డి.

పొలంలో బోరింగు ఎండిపోయిన సంగతి చెప్పినాడు.

'అయితే ఇప్పుడేమంటావు.'

'లెక్క గావాల'

'ఏంటికి?'

'మళ్ళా... కొత్త బోరింగు వేయిచ్చేదానికి'

'నీకు రోంతన్న బుద్ధి వుండాదా?'

'అది వుంటే నేను భూమిని ఎందుకు నమ్ముకుంటా!'

'ఇప్పటికి మూడు బోర్లు వేసినావు. అన్నీ ఎగిరిపోతాండయి. కింద నీళ్ళు వుంటే కదూ! రవ్వన్నా ఆలోచన వుండాల.'

'న్నా! ఈసారి నాల్గవ బోరు. కచ్చితంగా నీళ్ళు పడ్తాయి. నామాట నమ్ము. అరటితోట బాగుంది. సాయం జెయ్యి.'

'ఇట్లా మాటలు జెప్పే మూడుసార్లు అప్పు యిప్పించక పోయినావు. ఇప్పుడు మళ్ళా వచ్చినావు.'

'నీ లెక్క య్యాడికీ పోదూ... అసలు, వడ్డీ కాయలు అమ్ముతానే పూలల్లో పెట్టి యిస్తా! నన్ను నమ్ము.'

రామిరెడ్డికి ఇట్టాటి మాటలు కొత్తగాదు. చెన్నారెడ్డికి పాత గాదు.

యురేనియం ప్రాజెక్టు పరిధిలో భూములు కోల్పోయి ఇంకా ఉద్యోగాలు రాని నిర్వాసితులు దాదాపు నూటా ఇరవై మంది వరకు వుండవచ్చని తేలింది.

వీళ్ళందరికి ఉద్యోగాలు కల్పించాలని గ్రీవెన్స్ కమిటీ సూచించింది. యురేనియం తవ్వకాలకు సంబంధించి మొదటి, రెండవ రీచ్‌లలో భూములు కోల్పోయిన నిర్వాసితుల్లో ఉద్యోగాలు రానివారి జాబితాను కూడా భారత యురేనియం సంస్థకు అందజేశారు.

పులివెందులలో సమావేశమైన గ్రీవెన్స్ కమిటి పెండింగ్ సమస్య లన్నింటిపైన చర్చించింది.

రెండవ ప్రాజెక్టుకు ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ఆర్డీవో, యురేనియం అధికారులు బాధితులతో చర్చించడానికి సిద్ధమైనారు.

ఎంపీ దృష్టికి విషయం వెళ్ళింది.

స్థానికంగా వున్న ఒక్కొక్క సమస్యను పరిస్కరించుకుంటూ రెండవ మైనింగు కోసం ప్రజాభిప్రాయ సేకరణ జరుపుకోవాలని, ప్రాజెక్టు కోసం భూములు వదులుకున్న రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని భారత అణుశక్తి సంఘం ఛైర్మన్‌కు స్వయంగా చెప్పవలసి వచ్చింది.

నాలుగు నెలల నుంచి సుమారు నూటముప్పై అయిదు బోర్లు ఎండిపోయిన విషయంపై రైతుల్లో ఆందోళన మొదలైంది.

భూమయ్య గారి పల్లె రైతులందరూ పంచాయితీ పెట్టుకున్నారు. వాళ్ళతో చుట్టు పక్క నుండే రైతులు చేతులు కలిపారు.

ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్‌గా వున్న జిల్లా కలెక్టర్‌ను కలిశారు. 'తాగడానికి, పశువులకు, వ్యవసాయ పంటలకు నీళ్ళు ఎక్కడి నుంచి తెచ్చుకోవాలని' గ్రామస్థులు తమ గోడు వెల్లబోసుకున్నారు.

'తమ సమస్యలు పరిష్కరించకుంటే తలలైనా నరుక్కుంటాం కానీ యురేనియం ప్రాజెక్టు రెండవ దశ పనులు జరగనివ్వమని' మూకుమ్మడిగా ప్రకటించారు.

రెండు రోజుల తర్వాత వేముల మండలంలోకి భూగర్భజల వనరుల శాఖ అధికారులు వచ్చారు.

అయిదు గ్రామాల్లో భూగర్భజలాల పరిస్థితిని పరిశీలించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ సూచించడంతో వీళ్ళందరూ పల్లెబాట పట్టారు. వ్యవసాయ బోరు బావులను పరిశీలించారు.

'న్నా! మన చుట్టు ప్రక్క పల్లెల్లో ఇట్టా భూములు పోయినా ఉద్యోగాలు రాని ముప్పై అయిదు మంది హైకోర్టులో కేసు వేసినారంట' చెప్పినాడు సంజీవుడు.

'మంచి పనే జరిగింది... ల్యాకపోతే మనల్ని పట్టించుకోకుండా తిప్పుకుంటా వుంటే...' సమర్థించినాడు రామాంజి.

ఇతర గ్రామాలకి చెందిన రైతులు, ఇతర ప్రాంతాల వారు తుమ్మలపల్లె పరిసర ప్రాంతాల్లో అప్పట్లో భూములను కొనుగోలు చేశారు. స్థానికులు కాదు అనే వాదనతో వీరికి ఉద్యోగాలు ఇవ్వడానికి ప్రాజెక్టు ఒప్పుకోలేదు. ఇంకా వివరంగా చెప్పాలంటే యురేనియం ప్రాజెక్టు లో భాగంగా తవ్వకాలతో పాటూ, శుద్ధి కర్మాగారాన్ని ప్రారంభించడానికి ముందు ఇందుకోసం భూములు కోల్పోయిన వారికి పరిహారం ఇస్తూ ఉద్యోగ అవకాశం కల్పిస్తామని సంస్థ హామీ ఇచ్చింది. హామీ మేరకు ఉద్యోగానికి సంబంధించిన పత్రాన్ని నష్టపరిహారంతో పాటూ ఇచ్చారు. దశల వారీగా సంస్థ అధికారులు నిర్వాసితులను ఇంటర్వ్యూలకు పిలుస్తూ వచ్చారు. తుమ్మలపల్లె, రాచకుంటపల్లె, మబ్బు చింతలపల్లె, కొట్టాల గ్రామాల్లోని సుమారు రెండొందల పదిమందికి ఉద్యోగాలు ఇచ్చారు. స్థానికులు కాదనే అంశంపై ఇంటర్వ్యూలకు వెళ్ళిన నూటా తొంభై ఆరు మందిని వెనక్కి పంపించేశారు. ఇందులోని ముప్పై అయిదు మంది బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్ స్వీకరించి విచారించిన హైకోర్టు నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు ఎందుకు కల్పించ కూడదో తెలపాలని ప్రాజెక్టు అధికారులకు నోటీసులు పంపింది.

పల్లెలో ఇప్పుడు ఇట్లాటి విషయాలే మాట్లాడుకుంటున్నారు.

యురేనియం సంస్థ తన చూపు రెండవ ప్రాజెక్టు పైన పెట్టింది.

చుట్టుపక్క గ్రామాల్లో ఇంకో నాల్గు వందల యాభై ఎకరాలు సేకరించాలని ప్రయత్నం.

కొత్త బోరు వేయించడానికి చెన్నారెడ్డి సిద్ధమైనాడు. రామిరెడ్డి అప్పిచ్చి ఇంకో బాండు రాయిచ్చుకున్నాడు.

అరటి తోటలో బోరు వేస్తున్న శబ్దం విన్పిస్తోంది.

విలేకర్లు చాలా కాలం నుంచి యురేనియం ప్రాజెక్టు మేనేజింగ్ డైరక్టర్‌తో ప్రెస్ మీట్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. దానికి ఎవరూ సరిగ్గా స్పందించడం లేదు. తమకూ అవగాహన లేని సబ్జెక్టు కావడం, జిల్లా కేంద్రంలోని పత్రికలు దీనిపై లోతైన వివరాలతో వార్తా కథనాలు, వ్యాసాలు రాయమని స్థానిక విలేకర్లను కోరుతుండడంతో దిక్కు తెలియని పరిస్థితి. తెలిసిన సమాచారం, దొరికిన వివరాలతో వార్తలు పంపడం తప్ప తాము జేయగలిగింది ఏముంటుంది?

ఎట్టకేలకు మేనేజింగ్ డైరక్టర్ ప్రెస్‌మీట్‌కు వచ్చారు.

'భారత దేశంలో మొట్టమొదటి సారిగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో యురేనియం ఉత్పత్తిని చేపట్టాలనే సంకల్పంతోనే తుమ్మలపల్లెలో యురేనియం ప్రాజెక్టు ఏర్పాటు చేశాం. ఇక్కడి గనుల్లో మరో ముప్పై ఏళ్ళపాటు తవ్వకాలకు సరిపడ ముడి యురేనియం నిల్వలు ఉన్నాయి. ప్రారంభంలో రోజుకు మూడువేల టన్నుల చొప్పున ముడి సరకు వెలికి తీయడం జరిగింది. ఏడాదికి రెండొందల యాభై టన్నుల యురేనియం ఉత్పత్తి చేయలనేది లక్ష్యం.

దేశంలో విద్యుత్ కొరత తీవ్రంగా వున్న ప్రస్తుత పరిస్థితుల్లో అణు విద్యుత్ తప్పని సరిగా అవసరం. ఇప్పటికే దేశంలో బొగ్గు నిల్వలు బాగా తగ్గిపోయాయి. విద్యుత్ సమస్య పరిష్కారం కోసం యురేనియం అత్యవసరం. రెండవ ప్లాంట్ పైదృష్టి పెట్టాం. దీనికి స్థానిక ప్రజల సహకారం ఆశిస్తున్నాం.' తను చెప్పదల్చుకున్నది చెప్పాడు.

ప్రెస్ మీట్ ముగిసింది.

జిల్లా సచివాలయంలో సర్వోన్నతాధికారి యురేనియం ప్రాజెక్టు రెండవ ప్లాంట్‌పై చేపట్టాలనుకున్న ప్రజాభిప్రాయ సేకరణను వాయిదా వేశారు. స్థానిక ప్రజలు లేవనెత్తిన సమస్యలకు సంబంధించిన వివరాలు సమగ్రంగా లేక పోవడంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను కోరిన వివరాలు ఏవీ లేకుండా ప్రజాభిప్రాయ సేకరణ సరికాదని ఆయన తెగేసి చెప్పారు.

సమావేశం నుంచి ఏజేసీ, ఆర్డీఓ ఇతర అధికారులు చేసేదేమీ లేక అక్కడ్నుంచి వెనుతిరిగారు.

ఇది ఇట్లా వుండగానే యురేనియం ప్రాజెక్టు లోపల పని చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ నిద్రపోతున్న ఇద్దరి కార్మికులకు మెమోలు ఇచ్చారు.

ఈ వివాదం చిలికీ చిలికీ గాలీ వానలాగా మారింది. ఆగ్రహించిన కార్మికులు వాటిని ఉపసంహరించుకోవాలని కోరుతూ ఆందోళనకు దిగారు.

'ఇది కేవలం కక్షసాధింపులో భాగం. అనవరసంగా కార్మికులకు జారీ చేసిన మెమోలను వెంటనే వెనక్కి తీస్కోవాలి' అని ధర్నాకు కూర్చున్నారు.

ప్రాజెక్టు అధికారులు ఇందుకు అంగీకరించలేదు.

వివాదం మరింత రాజుకుంది.

చర్చలు మరొక్కసారి వాయిదా పడ్డాయి.

చర్చలు జరపడానికి ముందుకొచ్చిన ఎస్ఐ, తహసీల్దార్ లిద్దరూ సమస్య పరిష్కార సాధన కోసం రాత్రి నుంచి కూడా ప్రయత్నాలు చేస్తూనే వున్నారు.

కానీ ఒక కొలిక్కి రావడంలేదు.

నినాదాలు, కేకలు... ప్రాజెక్టు గేటు ముందు ఆందోళనకు సిద్ధమైన కార్మికులు.

వాతావరణం మారిపోయింది.

ఈ ఆందోళనలో ప్రాజెక్టు అధికారిని ఏవో చెడుమాటలతో దుర్భాష లాడాడని మరో మెమో జారీ చేశారు.

వివాదం మరింత వేడెక్కింది.

ప్రాజెక్టు చుట్టు పక్క వాతావరణం ఆందోళనగా మారింది.

ఉదయాన్నే మళ్ళీ చర్చలు మొదలైనాయి.

ఎస్ఐ, తహసీల్దార్ ప్రాజెక్టు లోపలికి వెళ్ళారు. అధికారులతో చర్చలు జరిపారు.

ముందు మెమోలు తీసుకొని సమాధానం ఇవ్వాలని అధికారులు పట్టుపట్టారు.

అందుకు కార్మికులు ఒప్పుకోలేదు.

చర్చలు రాత్రి తొమ్మిదిన్నర వరకు జరిగాయి.

ఎలాగోలా మధ్యవర్తిత్వం జరిపి చర్చలు సఫలం చేశారు.

ముగ్గురు కార్మికులకు ఇచ్చిన మెమోలను వెనక్కి తీసుకోవడానికి ప్రాజెక్టు అధికారులు అంగీకరించారు.

కార్మికులు పనికెక్కడానికి సిద్ధమైనారు. వివాదం ముగిసింది.

నీళ్ళ కోసం ఎదురు చూస్తున్నారు. చిత్రావతి నది నుంచి నీళ్ళు రావాలి. నీళ్ళు వస్తే గానీ ముందుకు అడుగు పడదు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి యురేనియం ప్రాజెక్టు నీళ్ళు వచ్చాయి. అరవైరెండు కోట్ల రూపాయలు ఖర్చు చేసి వేసిన ప్రత్యేక పైప్‌లైన్ ద్వారా నీళ్ళు వస్తున్నాయి.

యాభై కిలోమీటర్ల దూరం నుంచి వేసిన పైప్‌లైను ద్వారా నీళ్ళు వస్తున్నాయి.

చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజార్వయర్ ఇంటెక్ వెల్ నుంచి రెండొందల ఇరవై హార్స్‌పవర్ గల మోటర్లతో దగ్గర్లోని కొండ మీదికి రోజూ నీటిని పంపింగ్ చేస్తారు. అక్కడి నుంచి గ్రావిటీ లైను ద్వారా కోమన్నూతల సమీపంలోని

ఇంటర్మీడియట్ పంపింగ్ స్టేషన్‌లోకి నీరు చేరుతుంది. అక్కడ ఐదొందల ముప్పై ఆరు హార్స్‌పవర్‌గల మోటర్లతో నీటిని రోజూ పంపింగ్ చేస్తారు. అక్కడ్నుంచి యురేనియంప్రాజెక్టుకు నీళ్ళు చేర్తున్నాయి.

సాయంత్రం నుంచి గాలి రేగింది. చినుకులు కురిసేటట్లుగానే వుండాది.

యురేనియం ప్రాజెక్టు పట్ల అపోహలు వున్న వాళ్ళకు, ఆందోళన చెందుతున్న వాళ్ళకు, భూములిచ్చిన వాళ్ళకు జార్ఖండ్‌లోని జాదుగూడ యురేనియం ప్లాంట్ చూపించడానికి అధికార్లు ముందుకొచ్చారు.

జార్ఖండ్‌లోని జాదుగూడ యురేనియం ప్లాంట్‌లో జరుగుతున్న పనితీరు, అక్కడ తీసుకుంటున్న భద్రతాచర్యలు, చేస్తున్న ఏర్పాట్లు వంటి వాటి నన్నింటిని చూపిస్తామన్నారు.

పోనూరానూ ఏర్పాట్లతోపాటూ అక్కడ వసతి తదితర అంశాలన్నింటిని ప్రాజెక్టు అధికారులే బాధ్యతగా స్వీకరించారు. ఇండ్లలోని పెద్దవాళ్ళు, తెలుసు కోవాలనే ఉత్సాహం వున్న వాళ్ళు జార్ఖండ్ వెళ్ళడానికి ప్రయాణం అయ్యారు. చుట్టుపక్క పల్లెల్లోని కొంతమంది రైతులుఆసక్తిగా ముందుకు వచ్చారు.

'మనం మన లెక్క పెట్టుకొని పోయి అక్కడంతా తిరిగి రావాలంటే ఎట్లా అయితాది? వాళ్ళే పిల్సకపోయి జూపించుకొని వస్తామంటా వుంటే... పోయేదానికి మనకేం వుండాది?' అని మల్లారెడ్డి మామ అన్నాడు.

'తప్పేం వుండాది లే... జార్ఖండ్ పోయి జూస్తే అక్కడ వాళ్ళు ఎట్లా పనులు జేస్తాండరో, ఎట్లెట్లా ప్రజలకు సదుపాయాలు, భద్రత కల్పిస్తాండరో చూసొస్తే మనకు వుండే భయం పోతాదని' రామిరెడ్డి అన్నాడు.

ఒక్కొక్కరే తోడుగా మారి జార్ఖండ్‌కు పోయేవాళ్ళ జాబితా తయారైంది.

ఒక మంచి రోజు వీరి యాత్ర ప్రారంభమైంది.

బీహార్ నుంచి కూలీకి వచ్చి గనిలో పనిచేస్తాండే కూలీలు కూడా కొంతమంది తుమ్మలపల్లెలోనే వుండారు.

వాళ్ళలో ఒకతనికి నిన్న భూగర్భ గనిలో పనిచేస్తాండేటప్పుడు ప్రమాదం జరిగిందని కార్మికులు అనుకుంటా వుండిరి.

కొంత మంది అక్కడికక్కడే ఆ బిహారీ కార్మికుడు మృతి చెందినట్లు చెప్పుకుంటా వుండిరి.

ప్లాంట్ దగ్గరికి కొంతమంది విలేకర్లు ఈ వార్తను కనుక్కోవడానికి వెళ్ళారు.

సరియైన సమాచారం వారికి అందలేదు.

ఇది ఇట్లా వుండగానే వేముల మండలం పరిధిలోని మబ్బుచింతల పల్లె గ్రామానికి చెందిన రైతు పొలంలోంచి భారత యురేనియం సంస్థ అధికారులు టెయిల్ పాండ్ కోసం పైపులైను వేశారు. రెండు ఎకరాల్లో బండరాళ్ళు, మట్టిని వేశారు. కానీ అతడికి ఎలాంటి నష్టపరిహారం అందలేదు.

ప్రాజెక్టు అధికారుల చుట్టూ ఎంత తిరిగినా ప్రయోజనం కలగలేదు.

అతడింకేం చేస్తాడు?

జిల్లా మానవ హక్కుల కన్వీనర్‌ను కలిశాడు. వాళ్ళు అతనికి ఆసరగా నిలబడ్డారు. తమ వంతు ప్రయత్నాలు చేశారు.

కానీ అవేవీ ఫలించ లేదు.

చేసేదేం లేకపోవడంతో ఆఖరికి బాధిత రైతుతో హైకోర్టులో పిటిషన్ వేయించారు. కోర్టు తహసిల్దారుతో విచారణ చేయించింది. బాధిత రైతుకు నష్టపరిహారం ఇవ్వడంలో ఎందుకు నిర్లక్ష్యం చేశారని కోర్టు ప్రాజెక్టు ఈడీని ప్రశ్నించింది.

బాధిత రైతుకు సంబంధించిన భూమిపై సమగ్ర విచారణ జరిపించి బాధితుడికి న్యాయం చేయాలని హైకోర్టు జిల్లా జడ్జికి ఆదేశాలు జారీ చేసింది.

కాలం గడుస్తూ వస్తోంది!

చూస్తుండగానే యురేనియం ప్రాజెక్టులో కార్మికులు ఆందోళనకు దిగారు. సెక్యూరిటీ ఎస్ఐ, మరో ఇద్దరు కానిస్టేబుళ్ళు యురేనియం ప్రాజెక్టు ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ లీడర్‌ను చితకబాదడంతో కార్మికులు ధర్నాకు దిగారు.

కార్మికుల ఆందోళనతో మైనింగ్, శుద్ధి కర్మాగారంలో ఎక్కడి పనులు అక్కడ ఆగిపోయాయి. యూనియన్ నాయకుడు ప్రాజెక్టు లోనికి వెళ్తుండగా ఎస్.ఐ అతడి చేతిలోని సెల్‌ఫోన్ లాక్కోవడం వివాదానికి కారణంగా మారింది. ఈ విషయం తోటి కార్మికులకు తెలిసి వారు గేటు వద్ద ధర్నాకు దిగారు.

ధర్నాకు దిగిన వారితో యురేనియం ప్రాజెక్టు అధికారులు జరిపిన చర్చలు విఫలమైనాయి.

కేవలం సెల్‌ఫోన్ విషయమై యూనియన్ నాయకుడిని సెక్యూరిటీ వాళ్ళు చితక బాదడం దారుణమని గేటువద్ద ధర్నాకు దిగిన కార్మికులతో ప్రాసెసింగ్ చీఫ్ సూపరింటెంటు, మెకానికల్ డీజీఎం, మిల్లు చీఫ్ సూపరింటెంటు, పర్సనల్ మేనేజర్‌లు చర్చలకు వచ్చారు.

ఈ విషయం చుట్టు పక్కల పల్లెలకు కూడా తెలిసి ప్రాజెక్టు వద్దకు స్థానికులు చేరుకున్నారు.

'విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి, సెక్యూరిటీ సిబ్బందిపైన చర్య తీసుకుంటామని' ప్రాజెక్టు అధికారులు హామీ ఇచ్చి ధర్నాను ఆపించారు.

జార్ఖండ్‌లోని జాదుగూడా వెళ్ళి వచ్చిన రైతుల బృందం అక్కడి విశేషాలను పల్లెల్లోని వారందరికి చెప్పింది.

'అక్కడ చేసినట్లు ఏర్పాట్లు, వసతులు, సంరక్షణ, చర్యలు యిక్కడ మనకు ఎప్పుడు చేస్తారనే' ప్రశ్న మాత్రం అందరిగుండెల్లో సమాధానం లేకుండా వుండి పోయింది. ఈ బాధ తట్టుకోలేక పర్యటన కమిటీ సభ్యులు కొందరు తమ ఆవేదన పత్రికల దృష్టికి కూడా తీసుకెళ్ళారు.

'యురేనియం ప్రాజెక్టు ఏర్పాటు చేసేముందు అధికారులు ఒక మాట చెప్పారు. ప్రాజెక్టు ఏర్పాటు తర్వాత మరో మాట చెప్పి బాధితులను మభ్యపెడు తున్నారని' తమ బాధను భయటపెట్టారు.

'ఎకరాకు ఒక ఉద్యోగం ఇస్తామని అందరిని ఆశపెట్టారు. నష్టపరిహారం కూడా అందరికీ దక్కలేదు. జార్ఖండ్‌తో పోలిస్తే ఇక్కడ అభివృద్ధి చాలా తక్కువగా ఉన్నందున బాధితులను ఆదుకోవాలి' రైతులు తమ డిమాండ్‌ను బలంగా విన్పించారు.

సాయంత్రం ఉన్నట్లుండి ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటాయి. వర్షం రాదు. ఉదయం పూట ఎండ అగ్గిలాగా కురుస్తోంది. కానీ ఈ రోజు వివపరీతంగా గాలి పెడ్తోంది.

అరటి పంట కోత దశలో వుంది. రైతుల ఆశలన్నీ కుప్పకూలాయి.

యింకో పదిరోజుల్లో పంట దిగుబడి వచ్చి అప్పులన్నీ తీరిపోతాయని అనుకుంటున్న సమయంలో ఈ 'దెయ్యంగాలి' పంటను నాశనం చేసింది. చేతికి అందొచ్చిన అరటి గెలలు నేలపాలైనాయి.

దెబ్బతిన్న అరటి పంటను చూసి రైతులు గుండెలు బాదుకున్నారు.

ద్వారకనాథ రెడ్డికి చెందిన మూడు ఎకరాలు, భాస్కరరెడ్డికి చెందిన నాలుగు ఎకరాలు, రామాంజనేయ రెడ్డికి అయిదు ఎకరాలు, పార్వతమ్మకు చెందిన రెండు ఎకరాలు, సూర్య నారాయణకు చెందిన నాలుగు ఎకరాల పంట నేలమట్టమైంది. ఇలాగే చాలామంది రైతుల అరటి తోటలు కూడా విషాదాన్ని నింపాయి.

యురేనియం ప్రాజెక్టులో ఎల్‌డీసీ అకౌంటెంట్‌గా వున్న ఒక ఉద్యోగిని జార్ఖండ్‌కు బదిలీ చేయడంతో మరో కొత్త వివాదం మొదలైంది. అతడి బదిలీని ఆపాలంటూ కార్మికులు ప్రాజెక్టు వద్ద ధర్నాకు కూర్చున్నారు. పరిశ్రమ లోకి కార్మికులు వెళ్ళక పోవడంతో పూర్తిగా పనులు నిలిచి పోయాయి. ఉదయం ఎనిమిది గంటలకు మొదలైన ధర్నా రాత్రి ఎనిమిదైనా కొనసాగింది.

బదిలీని ఆపేంత వరకు ఆందోళన విరమించే ప్రసక్తే లేదని కార్మిక సంఘాలు తేల్చి చెప్పాయి.

ప్రాజెక్ట్ అధికారులు చర్చలకు వచ్చారు.

జీఎం, సీఐ అధికారులు సర్ది చెప్పారు.

కానీ కుదర్లేదు.

'జరిగిన బదిలీని పదిరోజుల పాటు పెండింగ్ పెట్టి విధులకు హాజరయ్యేలా చూస్తామని' అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

దీంతో రాత్రి షిఫ్ట్ పనులకు ఆటంకాలు తొలగిపోయాయి. కార్మికులు విధులకే హాజరయ్యారు.

పల్లెల్లో మొన్న వచ్చిన గాలీ, వానకు అరటి రైతులకు వచ్చిన నష్టాన్ని ప్రభుత్వం ఇచ్చి ఆదుకోవాలని తహసిల్దార్ దృష్టికి రైతులు తీసుకెళ్ళారు. గాలులకు పల్లెలో విద్యుత్ స్తంభాలు కూడా విరిగి పడ్డాయి. రామలింగారెడ్డి వద్ద వున్న అయిదు గొర్రెలు కూడా పిడుగుపాటుకు మృతి చెందాయి. కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీని వేస్తామని చెప్తావుండిరి.

యురేనియం భూగర్భ గనిలో రాత్రి ప్రమాదం చోటు చేసుకుంది. ఒక కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. గనిలో బ్లాస్టింగ్ చేసిన తర్వాత క్రేన్ ఎక్కి బండరాళ్ళను గునపంతో కొడుతుండగా బండరాళ్ళు మీద పడ్డాయి. దీంతో ఆ కార్మికుడికి తీవ్రగాయాలు అయినట్లు చెప్పుకుంటా వుండిరి.

మరో రెండు రోజులకు యురేనియం ప్రాజెక్టు ప్రాంత పరిశీలనకు జిల్లా కలెక్టర్ వస్తున్నట్లు దండోరా కొట్టబడింది.

తమ నష్టపరిహారం, కష్టాలు, నష్టాలు, ఉద్యోగాల గురించి చెప్పుకోవాలని బాధిత రైతులు ఎదురు చూస్తావుండిరి.

కలెక్టర్ రాగానే స్థానికులు, బాధిత రైతులు చుట్టు ముట్టారు.

'యురేనియం ప్రాజెక్ట్ రెండవ మైనింగు కోసం నాలుగు వందల యాభై ఎకరాల భూమి కావాలని ప్రాజెక్టు అధికారులు కోరారు. గతంలో ఏ విధంగా నష్టపరిహారం ఇస్తారు.' అని కలెక్టర్ చెప్తుండగానే కొందరు రైతులు అడ్డుకున్నారు.

పరిస్థితి అంతా గందరగోళంగా తయారైంది.

ఎర్రటి దుమ్ము వీస్తోంది.

ఎవరికి తోచింది వాళ్ళు మాట్లాడుతున్నారు.

కలెక్టర్ అక్కడ్నుంచి ఎగువ కట్ట దగ్గరికి వచ్చాడు. రామాలయం లోకి వెళ్ళి కూర్చున్నాడు. అందరూ బయట వుండండి.

పల్లెలోని సర్పంచులు, రైతు నాయకుల్ని మాత్రం లోనికి రమ్మని కబురు పెట్టాడు. సీఐ బయట నిల్చొని కేవలం పదిమందిని మాత్రం తనతో పాటుగా కలెక్టర్ దగ్గరికి పిల్చుకొని వెళ్ళాడు. గుడి బయట గుంపులు గుంపులుగా జనం...

కలెక్టర్ మీ సమస్య ఏమిటో ఒకరు చెప్పండి అని అన్నాడు.

మునిరెడ్డి చెప్పడం మొదలెట్టాడు.

'అయ్యా! ప్రాజెక్టు ఏర్పాటప్పుడు ప్రతి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని చెప్పినారు. భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలు వచ్చేంత వరకు సంవత్సరానికి పదివేలు జీవన భృతి ఇస్తామని చెప్పినారు. ఒక్కటి కూడా ఆచరణలో జరగలేదు...'

అందరూ ఇదే తమ సమస్య అని తలలాడించినారు.

'మీరు చెప్పేది అయిపోయింది కదా!

యిక నన్ను చెప్పనివ్వండి....' కలెక్టర్ తన మాటగా చెప్పాడు.

పక్కనున్న సీ.ఐ. మిగిలిన రైతులను నిశ్శబ్దంగా వినమన్నట్లు సర్ది చెప్పాడు.

'ఈ సమస్య లన్నీ నాకు తెల్సు. తప్పకుండా ప్రాజెక్టు అధికార్లతో మాట్లాడి మీకు న్యాయం చేస్తాను. నేనిప్పుడు వచ్చింది ఆ పనిమీదే కదా! అయితే మీరు నా మాట కూడా వినండి...

యురేనియం ప్రాజెక్టు వలన ప్రపంచస్థాయిలో జిల్లాకు పేరు వచ్చింది. దీన్ని మనం గర్వంగా స్వీకరించాలి. యింత పెద్ద ప్రాజెక్టు మన జిల్లాకు రావడం మన అదృష్టం. చిన్న చిన్న సమస్యలు వస్తుంటాయి. పోతుంటాయి. వాటి నన్నింటిని సామరస్య పూర్వకంగా పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్దాం. రెండో మైనింగ్‌ను అడ్డుకోవద్దు...'

ఎవరో రైతు యింకేదో అన్నాడు.

మరో బాధితుడు కూడా అలాగే.

కానీ కలెక్టర్ ఎవరి మాట విన్నట్టు కనపడలేదు.

కలెక్టర్ కారు ముందుకు కదిలింది.

యురేనియం ప్రాజెక్టులోని దూసుకపోయింది.

• • •

కూడంకుళం అణువిద్యుత్ కేంద్రం వద్ద సముద్రం సమీపంలో దానిని వ్యతిరేకిస్తూ నిరసన తెలుపుతున్న స్థానికుల వార్త టీవీలో వస్తోంది.

హైద్రాబాదు నుంచి నిన్న రాత్రి పల్లెకొచ్చిన అంకిరెడ్డి కొడుకు ఆదర్శ్‌రెడ్డి తండ్రిని పిలిచి ఈ వార్తను చూడమని కూర్చోబెట్టాడు.

కూడంకళం అనేది తమిళనాడులోని తిరునల్వేలి జిల్లాలో వుంది. 2002లో దీని నిర్మాణం ప్రారంభమైంది. అప్పటి నుంచి అక్కడ నిరసనలు, ప్రదర్శనలు, ధర్నాలు జరుగుతూనే వున్నాయి. ప్రజల భద్రత, పర్యావరణానికి హానీ కల్గుతుందని స్థానికులు సుప్రీం కోర్టుకు వెళ్ళారు.

అణువిద్యుత్ ప్రాజెక్టు వల్ల ప్రజల భద్రత, పర్యావరణానికి ప్రమాదం వాటిల్లకుండా అన్ని సంరక్షణ చర్యలు తీసుకున్నారని కాబట్టి దీనికి అడ్డుకోవద్దని జస్టిస్ కె.ఎస్. రాధాకృష్ణన్, జస్టిస్ దీపక్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది.

వార్తల్లో కూడంకుళంలో ప్రజలు వినూత్న రీతుల్లో చేసిన నిరసనల క్లిప్పింగ్‌లను చూపిస్తున్నారు.

ప్రజాప్రయోజనాలతోపాటూ దేశాభివృద్ధికి ఈ ప్రాజెక్టు ఎంతో అవసరమని, భవిష్యత్ తరాల ప్రజలకు తక్కువ ఖర్చుతో విద్యుత్ అందించేందుకు దేశంలో అణు విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయవలసిన అవసరం ఆవశ్యకత ఎంతో వుందని ధర్మాసనం అభిప్రాయపడింది. నాటి భారత రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ ఈ కేంద్రాన్ని సందర్శించి దీని వలన ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావని, ఎలాంటి ప్రాణాపాయం జరగదని, అన్ని రకాల రక్షణ చర్యలు తీసుకున్నారని చెప్పిన విషయాన్ని కూడా గుర్తు చేస్తున్నారు. కూడంకుళం ప్రాజెక్టు భద్రత, పర్యావరణ సమస్యలకు సంబంధించి ధర్మాసనం పదహైదు మార్గదర్శకాలను నిర్దేశించింది. ప్రజల విస్తృత ప్రయోజనాలు, సంక్షేమం కోసం ఉద్దేశించిన ఈ ప్రాజెక్టును అడ్డుకోరాదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

టీవీ ఛానల్ మార్చాడు అంకిరెడ్డి.

'యిక్కడ ఈ యురేనియం ప్రాజెక్టును మనం వ్యతిరేకిస్తూ కోర్టుకెళ్ళినా ఇట్టాటి తీర్పే వస్తుందా?' అడిగాడు కొడుకును అంకిరెడ్డి.

'ప్రభుత్వం ఏమనుకుంటే అది గెలుస్తుంది.

నువ్వూ... నేనూ అనుకున్నది కాదు.

ఇట్లాటి తీర్పే వస్తుందనుకుంటాను...'

అన్నాడు అతను.

అంకిరెడ్డి టీవీ ఆఫ్ చేశాడు.

● ● ●

యురేనియం ప్రాజెక్టులో ఉత్పత్తి తగ్గిపోయినట్లు, నెలరోజులుగా ఇదే పరిస్థితి వుందని అందరూ అనుకుంటా వుండారు. ముడి పదార్థాన్ని ఎంత శుద్ధి చేసినా యురేనియం ఉత్పత్తి మాత్రం ఆశించిన స్థాయిలో రాలేదని ఇంకొందరు అనుకుంటా వుండారు. రసాయనాలు కలుపుతూ పదార్థాన్ని శుద్ధి చేయగా వచ్చిన దాన్ని ల్యాబ్‌లో టెస్ట్ చేస్తే నాసిరకం యురేనియం ఉత్పత్తి అవుతున్నట్లు మరికొందరు అనుకుంటా వుండారు.

'ఇవన్నీ నిజమేనా?' అడిగాడు సంజీవుడు.

'నువ్వు ఊర్కోరా! అవన్నీ నిజాలైతే వాళ్ళు రెండవ ప్లాంట్ ఎందుకు పెట్టుకుంటారు. మనం నష్ట పరిహారం, ఉద్యోగాలు అని అన్నప్పుడల్లా వాళ్ళు ఇట్లాటి పుకార్లు పుట్టిస్తా వుంటారు. ప్రాజెక్టు ఎత్తేస్తాండమని కూడా చెప్పుకుంటారు. దాన్లను నమ్మేటోళ్ళు ఎవరుండారు?' అని జవాబిచ్చినాడు రామిరెడ్డి మామ.

తమ సమస్యల పరిస్కారానికి ప్రాజెక్టు అధికారులు కృషి చేయడం లేదని ప్లాంటులో పని చేసే కార్మికులు నాల్గొందల ఇరవై రెండు మంది సమ్మె చేయడానికి సిద్ధపడ్డారు. ఇక్కడ పనిలోకి చేరినప్పటి నుంచి పిల్లల పాఠశాల ఫీజులు, భవనాల అద్దె పెంచనే లేదని అలాగే భూగర్భ మైనింగు లోకి వెళ్ళేందుకు బూట్లు ఇవ్వలేదని, శుద్ధి జలం సరఫరా చేయడంలేదని, ప్రాజెక్టుకు వచ్చేందుకు ఇంతవరకు వాహన సౌకర్యం కల్గించలేదనే డిమాండ్స్‌ను కార్మికులు తెరపైకి తెచ్చారు. ఎప్పటిలాగానే దశల వారీగా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి కార్మికులను శాంతింపచేశారు.

రాచకుంటపల్లె గ్రామానికి చెందిన రైతులు ఒక నిర్ణయానికి వచ్చారు.

యురేనియంగని విస్తరణకు సంబంధించి రెండవ ప్లాంట్ ఏర్పాటుకు తమకు ఎటువంటి అభ్యంతరం లేదని లిఖిత పూర్వకంగా రాసుకున్న కాగితంతో ప్లాంట్ ఈడీని కలిశారు.

అయితే తమ భూములు తీసుకోవడంతో పాటూ వెంటనే ఉద్యోగ అవకాశాలు కల్గించాలనేది వారి ఆకాంక్ష.

గని నుంచి రోజుకు మూడువేల టన్నుల ముడి యురేనియాన్ని వెలికి తీస్తున్నారు. ఇది కాకుండా మరో పదహైదు వందల టన్నుల ముడి యురేనియాన్ని వెలికితీసేందుకు ఏడొందల ఇరవై అయిదు కోట్ల వ్యయంతో గనిని విస్తరించాలని భావించారు. ప్రజల అభిప్రాయం తెలుసుకోవడానికి మూడుసార్లు ప్రయత్నించినప్పటికి సాధ్యం కాలేదు. ప్రజలు, ప్రజాసంఘాల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో యురేనియం సంస్థ వెనకడుగు వేసింది.

రాచకుంటపల్లె గ్రామానికి చెందిన రైతులు తమ భూములు ఇవ్వడానికి ముందుకు రావడంతో ప్రాజెక్టు ఈడీ ఆనందపడ్డారు.

ప్లాంట్ విస్తరణకు సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణ సమస్య జిల్లా కలెక్టర్ పరిధిలో ఉన్నందువల్ల మీందరూ వెళ్ళి కలెక్టర్‌ను కలవవలసిందిగా రైతులకు సూచించారు.

చుట్టు పక్కవున్న పల్లెల్లో రైతులు రెండు వర్గాలుగా చీలారు. ప్రాజెక్టు తమ భూములు ఇవ్వడానికి సిద్ధపడ్డవారు. ఇవ్వమని వెనక్కి తిరిగినవారు.

పచ్చని పల్లె బతుకుల్లో యురేనియం చిచ్చు.

మూడేపమాన్ల సత్రం దగ్గర వస్తున్న సంజీవుడికి పులివెందుల దిక్కు పోతున్న విలేకరి కన్పించాడు.

'న్నా! ఎండకు పోతాండవే... ఏమన్నా వార్తలుండాయా?' అడిగినాడు ఆతృతగా సంజీవుడు.

విలేకరి నవ్వినాడు.

'యురేనియం పల్లెలో వార్తలు ఏముంటాయి? స్థానికంగా వుండేటోళ్ళు మీరే చెప్పాల!' సమాధాన మిచ్చినాడు.

సంజీవుడు నవ్వినాడు.

స్కూటరు చెట్టు కిందకి తెచ్చినాడు విలేకరి. సంజీవుడు కూడా పక్కకి చేరినాడు.

హెల్మెట్ తీశాడు.

వార్తల వేటలో అలసిపోయి ఎఱ్ఱదుమ్ము కొట్టుకొని వున్న తలవెంట్రు కలతో నల్లగా వాడిపోయిన ముఖంతో వార్తల సైనికుడులా విలేకరి కన్పిస్తున్నాడు.

'ప్లాంటులో సెక్యూరిటి గార్డుగా పనిచేస్తున్న ఒక వ్యక్తిని పంప్ హౌస్‌లో దిగమని చెప్పినారు. అతను దిగిన తర్వాత కెమికల్ నీళ్ళు అతనిపైన పడి బొబ్బలు ఎక్కినాయని ఇందాక కార్మిక సోదరుడు చెప్పినాడు. సివిల్ ఫోర్‌మెన్ గేట్ దగ్గర గార్డుగా డ్యూటీలో వున్న వ్యక్తిని నీళ్ళ తొట్టిలోకి దిగి వాల్వ్‌కు అడ్డుగా వుండే డస్ట్‌ను తొలగించమని చెప్పినారు. అతడి మీద కెమికల్ నీళ్ళు పడినాయి. బొబ్బలెక్కినాయి. ఇదొక వార్త చెప్పినారు. ఇంక్కొంచెం విచారించి వార్త రాయాలి.' చెప్పినాడు విలేకరి.

'కాదున్నా! పోయిన నెల కూడా ఇట్టాటి సంఘటనే ఒకటి జరిగినట్లు గుర్తుకొస్తాంది' అన్నాడు సంజీవుడు.

'అవును... మన ఇంటిదగ్గర వుండే పిల్లోడు ప్లాంటులో పనికి పోతావుండాడు. అతడి కళ్ళలో ఏదో కెమికల్ పడిందని పరిస్థితి బాగా లేదని ఎవరో చెప్పినారు...'

'సరే లేన్నా! పోయిరాపో...

పులిందలకు వచ్చినప్పుడు ఆఫీసు దగ్గరికి వస్తా...',

'అట్నేలే...

విలేకరి స్కూటర్ కదిలింది.

పైపులు వేసుకొని వచ్చిన లారీ అట్నే ఎగువకు కదిలి దుమ్ము రేపుకుంటా పోయింది.

ముడి యురేనియాన్ని శుద్ధి చేసిన తర్వాత వచ్చే వ్యర్థ పదార్థాలను కొట్టాల సమీపంలోని ఎఱ్ఱవంక వాగులో నింపేందుకు ఇరవై రెండు కోట్ల వ్యయంతో టెయిల్ పాండ్ పనులు జరిగాయి. ఈ నిర్మాణాల్లో మబ్బుచింతలపల్లె, కొట్టాల గ్రామాలకు చెందిన రైతుల భూములు కోల్పోయారు.

ఈ పైప్‌లైన్లు తరచూ లీక్ అవుతున్నాయి. రసాయనాలతో కూడిన ఈ నీళ్ళు తాగి పశువులు అనారోగాలకు గురవుతున్నాయి. దీని గురించి ఎవరు ఆలోచిస్తారు?

తుమ్మలపల్లె యురేనియం ప్లాంట్ దగ్గర ధర్నాకు ఎర్రజెండా పిలుపునిచ్చింది. ప్లాంట్ విస్తరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తూ పిడికిళ్ళు బిగిసుకున్నాయి. ప్రజానాయకులు ప్లాంటును సందర్శించి అక్కడి పరిస్థితిని తెలుసుకోవాలని తుమ్మల పల్లెకు వచ్చారు.

చుట్టు పక్క పల్లెల జనం తరలి వచ్చారు.

ఎర్ర జెండాలు రెపరెపలాడాయి.

ప్లాంటు లోపలికి అనుమతించకుండా భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు.

వాగ్వాదం చాలాసేపు జరిగింది.

నినాదాలు ప్రతిధ్వనించాయి. ప్రజానాయకులు కొందరు గేట్లు ఎక్కి లోపలికి వెళ్లడానికి తీవ్రంగా ప్రయత్నించారు.

అప్రమత్తమైన పోలీసులు కిందకి లాగేశారు.

ఇద్దరిమధ్య తోపులాట జరిగింది.

జనం గేటు బయటే ధర్నాకు కూర్చున్నారు.

యురేనియం ప్రాజెక్టు లోపలికి వెళ్ళి అధికారులను కలవడానికి కేవలం ఇద్దరు, ముగ్గుర్ని మాత్రమే అనుమతిస్తామని పోలీసులు చెప్పారు.

నాయకులు అంగీకరించలేదు.

ఉద్రిక్తత నెలకొంది.

నాయకులు గొంతు విప్పారు.

ప్రసంగాలు మొదలైనాయి.

'యురేనియం శుద్ధి చేసిన అనంతరం మిగిలే వృథా నీటిని టెయిల్ పాండ్‌కు పంపుతున్నారు. దీని వలన స్థానికుల ఆరోగ్యాలు దెబ్బ తింటున్నాయి. మనుషులు, జీవరాశులు, పంటలను నాశనం చేసే ప్లాంటు వల్ల ఏం సాధిస్తారు? కడప జిల్లాలో యురేనియం రెండవ ప్లాంటు ఏర్పాటుతో పాటూ, అనంతపురం జిల్లా పరిధిలో మరో శుద్ధి కర్మాగారాన్ని ఏర్పాటు చేయడం ద్వారా రాయలసీమను సర్వనాశనం చేయాలని ప్రభుత్వాలు చూస్తున్నాయని... అప్పటి యూపీఏ ప్రభుత్వం వ్యూహాత్మకంగా తప్పిదాలు చేసిందని... ఆనాడు నల్గొండ జిల్లాలో ఏర్పాటు చేయదలపెట్టిన యురేనియం కర్మాగారాన్ని అక్కడి ప్రజలు వ్యతిరేకిస్తే నాటి ముఖ్యమంత్రి అనంతపురం జిల్లాలోని నంబుల పూలకుంట మండలంలో ఐదు వేల ఎకరాల భూముల్లో యురేనియం వ్యర్థాలు వేసేందుకు నడుంబిగించడం అమానుషమని ప్రజానాయకులు తీవ్రంగా విమర్శించారు.

తుమ్మలపల్లెలో ఎట్టి పరిస్థితుల్లోనూ ప్లాంట్ విస్తరణ జరగనివ్వమని తెగేసి చెప్పారు.

ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని ప్రజానాయకులు పిలుపునిచ్చారు.

ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్లాంటుముందు ధర్నా కొనసాగింది.

చీకటి పడుతుండడంతో పోలీసులు అక్కడ్నుంచి అందర్నీ పంపేశారు.

• • •

ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. కలెక్టర్ నేతృత్వంలో యురేనియం అధికారులు సమావేశమై బాధిత రైతులకు త్వరగా పరిహారం, ఉద్యోగాలు, ఇతరసమస్యలు పరిష్కరించాలనే నిర్ణయం తీసుకున్నప్పటికీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో చేసేదేం లేకపోయింది.

గ్రీవెన్స్ కమిటీ సమావేశం ఏదో ఒక కారణంగా వాయిదా పడుతూనే వస్తోంది.

ఎన్నికలు ముగిసిన తర్వాతే ఈ ఫైల్ ముట్టుకుంటానని కలెక్టర్ చెప్పాడు.

యురేనియం ప్రాజెక్టు పరిధిలోని ఐదు గ్రామాల బాధిత రైతులకు సంబంధించిన అన్ని డిమాండ్లను పరిష్కరించిన తర్వాతనే రెండవ ప్లాంట్ విషయం మాట్లాడాలని ఎంపీ తన మాటగా మరో మారు లేఖ కూడా రాశారు.

సమస్యల పరిష్కారానికి యూసీఎల్ అధికారులు ముందుకొచ్చినప్పటికీ ఎన్నికల నియమావళి వారికి అవరోధంగా మారింది.

మూడేపమాన్ల సత్రం దిగువన వుండే రామ్మూర్తి, బోరింగు దగ్గరికి పోయి రెండు బిందెల నీళ్ళు కొట్టి, సైకిల్‌కు కట్టుకొని ఇంటి దగ్గరికొచ్చాడు.

రోట్లో ఎర్రకారం దంచుతోంది భార్య సుశీలమ్మ.

ప్రొద్దున్నే యురేనియం ప్రాజెక్టులోకి పనికి పోయి వచ్చినాడు రామ్మూర్తి. బాగా అలసటగా వుంది. ఒక బిందె నీళ్ళు వంటిపై పోసుకొని త్వరత్వరగా అన్నానికి కూర్చున్నాడు.

నులక మంచంలో దగ్గుతున్న తల్లి కన్పిస్తోంది.

ఒక రోజుసెలవు దొరికితే పులివెందులకు పిల్సక పోయి ఆసుపత్రిలో చూపించాలని అనుకుంటున్నాడు. కానీ కుదరడం లేదు.

దగ్గుతున్న తల్లికి గ్లాసుతో నీళ్ళు తీసుకెళ్ళి ఇచ్చాడు.

తాగి నిమ్మళంగా ఆమె పడుకుంది.

రామ్మూర్తికి రేపు ప్రాజెక్ట్‌లో చేయాల్సిన పని గుర్తుకొస్తోంది.

అవును రేపు యురేనియం తవ్వకాలను పరిశీలించడానికి భారత అణుశక్తి సంఘం ఛైర్మన్ ప్లాంట్‌కు వస్తున్నారు. అందుకే తనకు సెలవు కూడా ఇవ్వలేదు. ఇలా ఆలోచిస్తూనే నిద్రలోకి జారుకున్నాడు రామ్మూర్తి.

ఉదయాన్నే యురేనియం ప్లాంట్‌కు విచ్చేసిన ఛైర్మన్‌కు సిబ్బంది ఘనస్వాగతం పలికారు. బెంగుళూరు నుంచి రాత్రి ఆయన యురేనియం ప్లాంట్‌కు చేరుకున్నారు.

యురేనియం తవ్వకాలను, శుద్ధీకరణ ప్లాంటును ఆయన పరిశీలించారు. ప్లాంట్‌లోని ముఖ్యమైన అధికారులతో సమావేశమై పలువిషయాలు చర్చించారు. స్థానికంగా వస్తున్న సమస్యలను ప్రాజెక్ట్ అధికారులు వారి దృష్టికి తీసుకెళ్ళారు. ఆయన ముఖంలో ఎక్కడా విసుగ్గానీ, అసహనంగానీ కన్పించడం లేదు.

చివర్లో విలేకర్లతో ప్రెస్‌మీట్ కూడా ఏర్పాటు చేశారు.

'యురేనియం తవ్వకాలవల్ల రేడియేషన్ వ్యాప్తి చెంది జబ్బులు వస్తాయనేది కేవలం అపోహ మాత్రమే. సహజంగానే గాలిలో ప్రతిచోటా కూడా రేడియోధార్మికత ఉంటుంది. ముప్పై అయిదేళ్ళ కిందట జాదూగూడలో తవ్వకాలు చేపట్టాం. అక్కడ కూడా ఎలాంటి నష్టం జరగలేదు. ప్రపంచవ్యాప్తంగా పదహారు శాతం విద్యుత్ ఉత్పత్తి యురేనియం వల్లనే సాధ్యమౌతోంది. విద్యుత్ సంక్షోభానికి దాని పరిష్కారానికి ఇదే సరైన పరిష్కారం. జపాన్ దేశంలోని పుకుషిమా అణువిద్యుత్ కేంద్రంలో ప్రమాదాలు జరిగాయని, ఇక్కడ కూడా ప్రమాదాలు జరుగుతాయని కొంతమంది అపోహ పడుతున్నారు. అలాంటి వాటికి ఆస్కారమే లేదు. ప్రమాదాలు జరగకుండా ప్లాంట్‌లో కూలింగ్ యంత్రాలు ఏర్పాటు చేశాం. యురేనియం తవ్వకాలకు, శుద్ధీకరణకు బోర్ల ద్వారా భూగర్భ జలం వినియోగించడం లేదు. చిత్రావతి నది ద్వారా తీసుకొచ్చే నీటినే ప్లాంట్‌లో వాడుతున్నాం. గతంలో మనదేశం ఇతర దేశాల నుంచి యురేనియం దిగుమతి చేసుకునేది. ప్రస్తుతం ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుకున్నాం.'

ఛైర్మన్ తను చెప్పదల్చుకున్నది సూటిగా చెప్పారు.

ఒక విలేకరి పైకిలేచి స్థానికంగా బోర్లు ఎండిపోయి భూగర్భజలాలు అడుగంటి పోతున్న విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్ళారు.

దానికి ఛైర్మెన్ నిండుగా నవ్వి... మళ్ళీ తనదైన శైలిలోనే సమాధానమిస్తూ...

'నేను మొదటి నుంచి చెప్తున్నది అదే మేము ప్లాంట్ కోసం బోర్ల ద్వారా భూగర్భజలాలను వినియోగించుకోవడం లేదు. చిత్రావతి నదినుంచి వచ్చే నీళ్ళనే వాడుకుంటున్నాం.

వ్యవసాయ బోర్లు ఎండిపోతున్నాయని, గ్రాండ్ వాటర్ లెవెల్స్ పడిపోతున్నాయని స్థానికులు చేస్తున్న ఫిర్యాదులపైన ఒక స్వతంత్ర కమిటీ చేత పరిశీలన చేయిస్తాం' అని హామీ ఇచ్చారు. ప్రెస్ మీట్ ముగిసింది.

సాయంత్రం ప్లాంట్‌లో పని అయిపోగానే సెలవు మంజూరు చేయించుకున్నాడు రామ్మూర్తి. తన తల్లిని పొద్దున్నే పులిందలకు తీసకపోయి ఆసుపత్రిలో చూపించడానికి సిద్ధపడ్తున్నాడు. క్యాంటిన్ దగ్గర టీ తాగి సైకిలెక్కాడు ఇంటిదారి పడ్తూ!

వాళ్ళింటి దగ్గరి వెంకటేశుకు కూడా ప్లాంట్‌లో ఉద్యోగం వచ్చింది. భూములు కోల్పోయినవారికి నష్టపరిహారం మరికొంత మందికి అందాల్సి వుంది.

యురేనియం ప్లాంట్ రెండువేల నాల్గువందల ఎకరాల్లో నిరంతరంగా నిర్విరామంగా పని చేసుకుంటూ ముందుకు పోతోంది. రోజుకు మూడువేల టన్నుల ముడి యురేనియాన్ని వెలికి తీస్తున్నారు. దీన్ని రోజుకు నాల్గువేల ఐదొందల టన్నులకు పెంచాలనేది వాళ్ళ లక్ష్యం. దాని కోసం నిరంతరం శ్రమిస్తున్నారు.

ఆర్డీఎస్ అనే రీడిజల్యూషన్ సిస్టంకూడా ప్లాంట్‌లో ఏర్పాటు చేశారు. రెండవ యంత్రం అందుబాటులోకి రావడంతో ముడి యురేనియం ఉత్పత్తి మరింతగా పెరిగింది.

ప్రజాసంఘాలు, నాయకులు అప్పుడప్పుడు యురేనియం ప్రాజెక్టు పరిధిలోని టి. వెలమవారిపల్లె, బక్కన్న గారిపల్లె, గిడ్డంగి వారి పల్లె, మీది పెంట్లకోట, భూమయ్యగారిపల్లె, రాచకుంట పల్లె, తుమ్మలపల్లె గ్రామాల్లో పర్యటిస్తూనే వున్నారు. ఇంకొందరు పాదయాత్రలు కూడా చేశారు. తమ వెంట నడిచిన వారికి భోజన వసతి కూడా కల్పించారు.

కాలం ఎన్నెన్నో చూస్తూ వస్తోంది!

పల్లెలో రామిరెడ్డి, అంకిరెడ్డి, చలమారెడ్డి, వెంకటనాయుడు, బాలిరెడ్డి, మునిరెడ్డి, గౌస్ ఎప్పటిలాగే రచ్చబండ రావిచెట్టు దగ్గర పొద్దున్నే కలుస్తాండరు.

తమకు తెల్సిన విషయాలు మాట్లాడుకుంటూ వుండారు. జరిగిన రాష్ట్ర విభజనకు కూడా బాధపడ్తా వుండారు.

రామాంజి ఇంట్లో గోడకు ప్రజా సంఘాలవాళ్ళు ఇచ్చిన క్యాలెండర్ గాలికి రెపరెపలాడ్తోంది. దాంట్లోని ఒక కొటేషన్...

'నేను మా హక్కుల కోసం నిలిచినందుకు నాకు అవి లేకుండా చేశారు.

నేను మీ అందరి స్వేచ్ఛా మందిరానికి రాళ్ళెత్తినందుకు నన్ను చెరసాలలోకి తోశారు.

నేను సత్యాన్ని ఎలుగెత్తినందుకు నా గొంతు నలిపేశారు. అయినా ఇది మీ అందరి సమస్య కాదంటరేమో...

అది మీ సమస్యే!

క్యాలండర్‌లో ఎర్రటి అక్షరాలు, పిడికిలి ఎత్తి ముందుకు అడుగు వేస్తున్న శ్రామికుడి చిత్రం చూడగానే ఆకట్టుకునేలా వుండాయి.

నిర్మలమైన అనంత ఆకాశాన్ని నల్లటి చీకటి తెరలు తెరలుగా కమ్ముకుంటోంది.

యురేనియం ప్రాజెక్టు విస్తరణలకు సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణ ఎప్పటికి జరుగుతుందో తెలియదు. పర్యావరణ అనుమతుల విషయంలోనూ స్పష్టత లేదు. తుమ్మలపల్లెలోని యురేనియం ప్రాజెక్టుకు అనుబంధంగా కడప - అనంతపురం సరిహద్దులోని నంబులపూలకుంట మండలంలో న్యూక్లియర్ ఇంధన కేంద్రం ఏర్పాటుకు ఎంతో కాలంగా ప్రతిపాదనలు తయారవుతున్నాయి. సమీపంలోనే పాపాఘ్ని నది, దానిపై వెలిగల్లు జలాశయం ఉండడంతో ఈ ప్రాంతాన్ని ఎంపిక చేస్తున్నట్లు పారిశ్రామిక మౌళిక వసతుల కల్పన సంస్థ ఇది వరకే స్పష్టం చేసింది.

అన్ని అంశాలు ఒక కొలిక్కి వస్తే నిర్దేశిత ప్రాంతం చుట్టూ ఇనుప కంచెతో కూడిన ప్రహరీ నిర్మిస్తారు. న్యూక్లియర్ కేంద్రం ఏర్పాటు వల్ల నీరు, గాలి, పర్యావరణం కలుషితమై ప్రజలు అనారోగాల పాలవుతారని, వెలిగల్లు ప్రాజెక్టుకు తీవ్ర నష్టం జరుగుతుందని ప్రజాస్వామ్య హక్కుల పోరాట సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

ఎన్నికలు వస్తుంటాయి, ప్రభుత్వాలు మార్తుంటాయి. కానీ సాయంత్రం కర్మాగారం నుంచి ఎర్రటి దుమ్ము నింపుకొని మాసిపోయిన దేహంతో బయటికి వచ్చే శ్రమజీవి తన తలరాతను తిట్టుకుంటూనే వుండాడు.

పావురం ఒక పూలకొమ్మని ముక్కున కరచుకొని వచ్చి ఇక్కడేం వాలదు!

దూరంగా శబ్దం

నల్లరాతి గుట్టల పైనుంచి రాకాసి శబ్దం చేస్కుంటా ఏదో ఆకాశంలోంచి వస్తాండే శబ్దం.

అవును... నిజమే దూరంగా ఆకాశంలో ఇనుపరెక్కల హెలికాప్టర్.

ఎర్ర దుమ్ము గాలి తుమ్మ చెట్ల వనం కాన్నుంచి రివ్వున ఎగుర్తా గంగమ్మ గుడి మోట్లోని ఎర్రమట్టి నేలను విసురుగా తాకింది. సుడిగాలి కొండను మింగిన దెయ్యంలా ఎగిరెగిరి పైపైకి పోతానే వుండాది.

యురేనియం ప్రాజెక్టు దగ్గరి పెద్ద చింతచెట్టు కొమ్మపైన గద్ద వొకటి కాపు కాసి ఎదురు చూస్తోంది!

• • •

# తారాపూర్ నుంచి తుమ్మలపల్లె వరకు

*'చరిత్ర ప్రకృతిపై ఆధారపడి వుంటుంది. నాగరికత చరిత్రకు ముందు మాటను ప్రకృతి రాస్తుంది.*

అణుశక్తి పరిశోధన మనదేశంలో 1948లోనే మొదలయింది. ఈనాడు దేశంలో అణుశక్తిని అనేక రకాలుగా ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా అణు విద్యుత్ ఉత్పాదన కోసం. ఇప్పుడు ఫ్యూజన్ టెక్నాలజీ, లేజర్సు మొదలైన వారి మీద పరిశోధన జరుగుతోంది. వ్యవసాయం, వంటల తెగుళ్ళ నివారణ, వైద్యము, ఎలక్ట్రానిక్స్, జీవశాస్త్రం, ఆహార విజ్ఞానం మొదలైన రంగాలకు తమ పరిశోధన ఫలితాలను అందిస్తున్నారు.

అణువిద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేయడానికి కావల్సిన అన్ని హంగులూ మన దేశంలోనే తయారు చేసుకుంటున్నాం. మొదట తారాపూర్‌లో దిగుమతి చేసుకున్న ఎన్‌రిచ్‌డ్ యురేనియంతో తేలిక జలంతో విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేశారు. తర్వాత స్థాపించిన రాజస్థాన్‌లోని కోట కర్మాగారంలోను, మద్రాసు కల్పకం కర్మాగారంలోను, ఉత్తరప్రదేశ్ నరోరా కర్మాగారం లోను సహజ యురేనియం ఇంధనంగా స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో తయారయిన భారీ జలంతో విద్యుచ్ఛక్తి తయారు చేస్తున్నారు. ఈ కర్మాగారాలకు కావలసిన ఇంధనాన్ని, ఇతర సామగ్రిని స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేస్తున్నారు.

రెండవ దశలో మన దేశంలో బాగా లభ్యమౌతున్న థోరియం సహాయంతో అణువిద్యుత్ ఉత్పత్తి చేసుకోడానికి కావల్సిన ఫాస్ట్ బ్రీడర్ టెక్నాలజీని మనదేశంలోనే అభివృద్ధి చేస్తున్నారు. ఇక మూడవ దశలో, వాడిన ఇంధనం కన్నా ఎక్కువ ఇందనాన్ని మిగిల్చే విధంగా ఈ ఫాస్టు బ్రీడర్ టెక్నాలజీని అభివృద్ధి పరుస్తున్నారు. మద్రాసు కల్పకంలో ఫాస్టు బ్రీడర్ టెస్ట్ రియాక్టర్ పనిచేస్తున్నది. ఇవన్నీ సొంతంగా అభివృద్ధి చేసుకున్నవి కావడం చేత ఏ అంతర్జాతీయ నియమావళి పరిధిలోకి రావు.

## అణుశక్తి

కొన్ని మాలిక్యుల్స్ కలవడం లేదా విడిపోవడం వలన శక్తి వస్తుంది. కొన్ని అణువులు కలిస్తే మాలిక్యూల్స్ ఏర్పడతాయి. చాలా సంవత్సరాల వరకు ఈ అణువుల్ని బద్ధలు చేయలేమని అనుకొన్నారు. కాని 1919లో లార్డ్ రూథర్ ఫర్డ్ అనే శాస్త్రవేత్త ఇది సాధ్యమని నిరూపించాడు. ఆ తరువాత అణువుని బద్దలు కొట్టడం ద్వారా శక్తి విడుదల అవుతుందని రుజువు చేశారు. అదే అణుశక్తి. యురేనియం - 235 అనే మూలకాన్ని విచ్ఛేదించినట్లయితే ఎక్కువ అణుశక్తిని విడుదల చేస్తుందని తెలిసింది. అణుబాంబులో లేదా అణువిద్యుత్కేంద్రాలలో ఈ విచ్ఛేదన ద్వారానే అణుశక్తిని సాధిస్తున్నారు.

## న్యూక్లియర్ శక్తిని పొందడానికి కావలసిన ఇంధనాలు

ప్రకృతి సిద్ధంగా లభించే యురేనియంలో యు-235 ఐసోటోపు 0.71 శాతం. మిగిలినది యు-238. అరుదుగా లభించే యు-235 ఐసోటోపు మాత్రమే శృంఖలా విస్ఫోటక ప్రక్రియను (Fission Chain Reaction) ధరిస్తుంది. దీనిని ఫిసైల్ మెటీరియల్ (విస్ఫోటక ద్రవ్యం) అంటారు. న్యూక్లియర్ రియాక్టర్లకు ఇంధనంగా ఉపయోగపడే ఇతర విస్ఫోటక ద్రవ్యాలు మానవుడు సృష్టించే టోనియం, యు-233, న్లూకియర్ రియాక్టర్‌లో యు-238పై కాంతి కిరణం ప్రకాశింపజేసినప్పుడు న్యూట్రానులను శోషించి కొంత యు-238 ప్లూటో

నియంగా మారుతుంది. ఇదే విధంగా న్యూక్లియర్ రియాక్టర్‌లలో థోరియంపై కాంతి కిరణం ప్రసరింప జేసినప్పుడు న్యూట్రానులు శోషింపబడి కొంత థోరియం యు-233గా మారుతుంది.

## అణుశక్తి నుంచి విద్యుచ్ఛక్తి

యురేనియం-235 (లేక ప్లూటోనియం-239 లేక యురేనియం-233) అణువు (న్యూక్లియస్) న్యూట్రాన్‌ను ఆకర్షించినప్పుడు అణువిస్ఫోటక ప్రక్రియ జరుగుతుంది. ఈ ప్రక్రియలో యురేనియం న్యూక్లియస్ (లేక ప్లూటోనియం న్యూక్లియస్) రెండు చిన్న - న్యూక్లియైలుగా విభజింపబడి శక్తి విడుదలవుతుంది. ఈ న్యూక్లియర్ శక్తి మొట్టమొదట రెండు చిన్న న్యూక్లియై (విస్ఫోటక ద్రవ్యాలు) కైనెటిక్ శక్తిగా, న్లూక్లియర్ రేడియేషన్‌గా ప్రత్యక్షమవుతుంది. ఇవి యురేనియం ద్రవ్యాన్ని వేడి చేస్తాయి. దీనికి తోడు విస్ఫోటన సమయంలో 2 లేక 3 న్యూట్రానులు విడివడతాయి. ఈ అదనపు న్యూట్రానులలో ఒక దానిని యురేనియం న్యూక్లియస్ (లేక ప్లూటోనియం) విస్ఫోటనాన్ని దోహదపరచడానికి ఉపయోగింప వచ్చు. ఈ విధంగా ఒకదాని తరువాత మరో విస్ఫోటన ప్రక్రియ జరుగుతుంది. దీనినే శృంఖలా విస్ఫోటక ప్రక్రియ అంటారు. దీనివల్ల నిలకడగా ఉష్ణం జనిస్తుంది. న్యూక్లియర్ రియాక్టర్ కోర్ ఇంధనంలో శృంఖలా విస్ఫోటక ప్రక్రియ వలన జనించిన ఉష్ణం కోర్ ద్వారా ప్రవహించే కూలెంట్ ద్రవం గ్రహిస్తుంది. వేడిగా వుండే కూలెంట్ ద్రవం స్టీము జనరేటర్లోకి పంపబడుతుంది. ఇవి టర్బో జనరేట్లను త్రిప్పి విద్యుచ్ఛక్తిని జనింపచేస్తాయి.

## యురేనియం, థోరియం వనరులు

మనదేశంలో ఎక్కువ భాగం యురేనియం వనరులు బీహార్‌లో వున్నాయి. టాటా నగర (బీహార్) దగ్గర జాదూగుడాలో యురేనియం వనరులు వ్యాపార స్థాయిలో వినియోగిస్తున్నారు. బీహారు పరిసర ప్రాంతాలలో అదనంగా గనులు తవ్వుతున్నారు. రాయలసీమ ప్రాంతంలోనూ, తుమ్మలపల్లె పరిసరాల్లోనూ, మధ్యప్రదేశ్, మేఘాలయా, కర్నాటకలలో కొన్ని ప్రదేశాలలో యురేనియం

వనరులు వున్నట్లు తెలుసుకొన్నారు. ముడి రాగి శుద్ధీకరణలో కూడా యురేనియం లభిస్తుంది. మోనజైట్ ఖనిజంలో థోరియం వుంటుంది. ఇది ముఖ్యంగా కేరళ, తమిళనాడు, ఒరిస్సా సముద్ర తీరాలలో ఇసుకలో లభిస్తుంది. మన దేశంలో లభించే అణు ఇంధన వనరులు సుమారు 70000 టన్నుల యురేనియం (యు3, ఓ8) 360000 టన్నుల థోరియం (టిహెచ్ఓ$_2$). ఈ అణు ఇంధన వనరులు అనేక శతాబ్దాలపాటు విద్యుచ్ఛక్తి ఉత్పత్తికి సరిపోతాయి. అంతర్జాతీయంగా ప్రకృతి సిద్ధంగా లభించే యురేనియంకు నిర్దేశింపబడిన ధర ఒక పౌనుకి 30 డాలర్లు. ప్రకృతి సిద్ధమైన యురేనియం ధరలాగే థోరియం ధర వుంటుంది. ఒక టన్ను ప్రకృతి సిద్ధమైన యురేనియం ఆక్సైడ్ ఇంధనం సుమారు 50 మిలియన్ యూనిట్లు విద్యుచ్ఛక్తిని మ్యాప్స్‌లో జనింపచేస్తుంది. ఇంత విద్యుచ్ఛక్తిని థర్మల్ పవర్ స్టేషన్‌లలో ఉత్పాదించడానికి 30000 టన్నుల బొగ్గు అవసరమవుతుంది.

సహజంగా లభించే యురేనియం యు-235, యు-238 ఐసోటోపులు వుంటాయి. యురేనియంలో యు-235 ప్రత్యేకమైన విధానంలో ఎన్‌రిచ్‌మెంట్ ప్లాంట్‌లలో అభివృద్ధి పరుస్తారు. దీనిని ఎన్‌రిచ్డ్ (అభివృద్ధి పరచబడిన) యురేనియం అంటారు. ఎన్‌రిచ్‌మెంట్ ప్లాంటులలో తక్కువ యు-235గల యురేనియం గణపదార్థంగా లభిస్తుంది. దీనినే డిప్లీటెడ్ యురేనియం అంటారు. థోరియం ఒకే ఐసోటోపు టిహెచ్-232గా ప్రకృతిలో లభిస్తుంది. ప్రపంచంలో ఎక్కువ థోరియం వనరులు మన భారతదేశంలోనే వున్నాయి. కాబట్టి థోరియం దిగుమతి చేసుకోవలసిన అవసరం లేదు. మనం యురేనియం కూడా ఇంత వరకు దిగుమతి చేసుకోలేదు. తారాపూర్ బాయిలింగ్ వాటర్ రియాక్టర్‌కి (బి.డబ్ల్యు.ఆర్.ఎస్) అభివృద్ధి పరచబడిన యురేనియం మాత్రం దిగుమతి చేసుకుంటున్నాము.

ఫ్రాన్స్‌కి 511382 ఎం.డబ్ల్యు.ఇ. శక్తి 54, 1988వ సంవత్సరం చివరి భాగంలో 108 న్యూక్లియర్ రియాక్టర్లతో మొత్తం 95273 ఎం.డబ్ల్యు.ఇ. శక్తిని ఉత్పాదించుకుంటూ యునైటెడ్ స్టేట్స్ ప్రథమ స్థానాన్ని వహించింది. కానీ

మొత్తం విద్యుచ్ఛక్తి ఉత్పాదనలో ఎక్కువ అణువిద్యుత్ ఉత్పాదనకు ఫ్రాన్స్ ప్రథమ స్థానాన్ని వహిస్తుంది. ఇక్కడ 70 చశాతం పైబడిన విద్యుచ్ఛక్తి న్యూక్లియర్ రియాక్టర్ల ద్వారా ఉత్పాదింపబడుతుంది. నేను భారతదేశంలోఉత్పాదింపబడే విద్యుచ్ఛక్తి 1374 ఎం.డబ్ల్యు.ఇ. ఇప్పుడు భారతదేశంలో విద్యుచ్ఛక్తి ఉత్పాదనలో న్యూక్లియర్ శక్తి 2 మొదలు 3 శాతం. ఈనాడు ప్రపంచంలో ముఖ్యంగా అణుశక్తి నుండి 16 శాతం విద్యుదుత్పాదన జరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా 339 అణుకేంద్రాలు వున్నాయి.


అణువిద్యుత్ కేంద్రాలున్న ప్రదేశాల దగ్గర ఏర్పాటు చేసిన పర్యావరణ సర్వే లాబొరేటరీలు, ప్లాంటు పని చేయడానికి ప్రారంభించే ముందు ప్లాంటు లోపల చుట్టుపట్ల అణుధార్మికత - రేడియో ఆక్టివిటీని పరీక్షించి ఆ తరువాత రేడియో ఆక్టివిటీ పెరగకుండా పరిశీలిస్తు వుంటాయి. కల్పాకం దగ్గర ఏర్పాటైన పర్యావరణ సర్వే లేబొరేటరీలో ధాన్యం, కూరగాయలు, పాలు, చేపలు, ఇతర సాగర సంబంధమైన ఆహార దినుసులు, గాలి, నీరు, ఉప్పు, వగైరాలలో రేడియో ఆక్టివిటీ స్థాయిని పరీక్ష చేసి తెలుసుకున్నారు. ఈ వస్తువులలో రేడియో ఆక్టివిటీ స్థాయిని నిరంతరం పరీక్ష చేస్తూ పవర్‌ప్లాంట్‌కి 32 కి.మీల వర్తుల వైశాల్య ప్రదేశంలో రేడియో ఆక్టివిటీ స్థాయి తగు మాత్రంలో వుండేట్లు జాగ్రత్త పడతారు. ఒక న్యూక్లియర్ శక్తికేంద్రాన్ని అంటే 2పి.హెచ్.డబ్ల్యు.ఆర్. యూనిట్లు గల పవర్ స్టేషన్‌ని నడపడానికి సుమారు 1000 మంది ఉద్యోగస్థులు అవసరం వుంటుంది. సాధారణంగా బొగ్గు ప్రదేశానికి 800 కి.మీ.ల దూరంలో న్యూక్లియర్ ఉత్పాదన కేంద్రం వుంటే, బొగ్గుతో తయారయే విద్యుచ్ఛక్తి కంటే 20 శాతం చౌకగా వుంటుంది. లైట్ వాటర్ రియాక్టర్లలో మోడరేటర్‌గానూ, కూలెంట్‌గాను మామూలు నీటని వాడతారు. కానీ వీటికి ఇంధనంగా అభివృద్ధి పరచిన యురేనియం అవసరం. ప్రెషరైజ్డ్ హెవీ వాటర్ రియాక్టర్లకు (పి.హెచ్.డబ్ల్యు.ఆర్) సహజంగా లభించే యురేనియంను ఇంధనంగా వుపయోగించవచ్చు. కానీ మోడరేటర్‌గా, కూలెంట్‌గా హెవీవాటర్ అవసరం వుంటుంది.

1977 నాటికి దేశంలో అణువిద్యుదుత్పాదన 3820 మెగావాట్లు. ప్రభుత్వం ఆమోదించిన పథకాలు పూర్తి అయితే 8700 మెగావాట్ల అణువిద్యుదుత్పాదన సాధించవచ్చు. శక్తి ఉత్పాదక రంగంలో అభివృద్ధి కార్యక్రమాలు మూడు ముఖ్యంగా జరుగుతాయి. మొట్టమొదటిది - విస్తృత పరచబడిన పి.హెచ్.డబ్ల్యు.ఆర్. శక్తి ఉత్పాదన వచ్చే 10 సంవత్సరాలలో 1000 ఎం.డబ్ల్యు.ఇ. సామర్థ్యత పొందుతుంది. రెండవది - దేశంలో ఫాస్ట్ బ్రీడర్ సాంకేతిక విధానం ఏర్పరచి యు-238 మరియు థోరియంలను అతి సమర్థవంతంగా వినియోగించి అత్యధికంగా వేలకొలది ఎం.డబ్ల్యు.ఇ. శక్తిని ఉత్పాదించడం జరుగుతుంది. మూడవది - లేసర్స్, ఆక్సిలేటర్స్, ప్యూషన్ మొదలైన వాటిలో అణుశక్తి సాంకేతికాభివృద్ధికి వినియోగించబడుతుంది.

ఇక్కడ మనం చెప్పుకోవలసిన మరో ముఖ్య విషయం ఏమిటంటే 2000 సంవత్సరానికే 1000 మెగావాట్లు విద్యుత్తును అణుశక్తి ద్వారా ఉత్పత్తి చేయాలని అంచనా వేశారు. ఒక అణు విద్యుత్ కేంద్రం సగటు అయుర్ధాయం 25 సంవత్సరాలు. ప్రపంచంలోని మొత్తం దేశాలలో 339 అణుకేంద్రాలు వున్నాయి. భారత అణుశక్తి నిపుణులు కమిషన్ వారు వీటి భద్రత, నాణ్యత, వ్యయం, మన్నిక, లాభాలు తదితర విషయాలను గురించి ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు తెలియజేస్తుంటారు. మనదేశంలో వున్న అన్ని అణువిద్యుత్ కేంద్రాలు సక్రమంగా, సురక్షితంగా, సమర్థవంతంగా, ప్రయోజనకరంగా పనిచేస్తున్నాయి అని నివేదికల్లో రాసుంటుంది.

*మానవ భవిష్యత్తును గురించి చరిత్ర ఏమి చెబుతుంది?*

*(1994 మార్చి, 15 యోజన మాసపత్రిక;*
*రచన: డా॥ వేంపల్లి గంగాధర్)*




న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో భారత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ గారికి తన రచనలను అందజేస్తున్న డా॥ వేంపల్లి గంగాధర్.

*'In Residence Programme'* లో భాగంగా
2014 సెప్టెంబర్ 8వ తేది నుండి 26వ తేది వరకు గంగాధర్
రాష్ట్రపతి భవన్‌లో విశిష్ట అతిథిగా విడిదిచేశారు.




కేంద్ర సాహిత్య అకాడమి యువపురస్కారాన్ని
డా॥ వేంపల్లి గంగాధర్‌కు ఆగస్టు 25, 2012నాడు,
భువనేశ్వర్‌లో ప్రదానం చేస్తున్న అకాడమీ అధ్యక్షులు
సునీల్ గంగోపాధ్యాయ.